www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
PRAJAPAKSHAM ★




పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పట్ల అంబేద్కర్ దార్శనికత, సవాళ్లు
చైనాకు భారత ఎగుమతులు పెరిగాయా! 06

సంపుటి 28, సంచిక: 159 | శనివారం | 29-11-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00



## పంచాయతీ ఎన్నికలపై ‘స్టే’ ఇవ్వలేం

- ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున జోక్యం చేసుకోలేం
- హైకోర్టు సిజె ధర్మాసనం స్పష్టీకరణ

**హైదరాబాద్ :** పంచాయతీ ఎన్నికలపై స్టే ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున జోక్యం చేసుకోలేమని సిజె ధర్మాసనం పేర్కొంది. పంచాయతీ ఎన్నికల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 46ను సవాల్ చేస్తూ అత్యంత వెనుకబడిన కుల సంఘాలు పిటిషన్ దాఖలు చేశాయి. ఈ పిటిషన్‌పై సిజె ధర్మాసనం విచారణ చేపట్టింది. పంచాయతీరాజ్ చట్టంలోని 285 ‘ఎ’ ప్రకారం రిజర్వేషన్లు కల్పించారని బిసిలలో ఉన్న ‘ఎబిసిడి’ గ్రూపుల ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది సుదర్శన్ కోర్టుకు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ వారం క్రితం తరువాయి 12లో

## జనవరి ఒకటిన లొంగిపోతాం

**సమయమివ్వండి.. సాయుధపోరాటాన్ని విరమించుకుంటాం**

- ఆయుధాలు అప్పగించి పునరావాసాన్ని అంగీకరిస్తాం
- అప్పటివరకు భద్రతా బలగాలు అరెస్టులు, ఎన్‌కౌంటర్లు వంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడండి
- మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులకు మావోయిస్టుల లేఖ
- మూడు రాష్ట్రాల మావోయిస్టు కమిటీ తరపున అనంత్ పేరుతో లేఖ బహిర్గతం



ప్రజాపక్షం/ ఖమ్మం

లొంగుబాటుపై మావోయిస్టులు కీలక ప్రకటన చేశారు. జనవరి ఒకటవ తేదీ వరకు సమయమివ్వండి.. లొంగిపోతామంటూ మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖ రాశారు. అనంత్ పేరుతో ఈనెల 17న మావోయిస్టులు విడుదల చేసిన లేఖ బహిర్గతమైంది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఛత్తీస్ గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి లకు మావోయిస్టులు ఒక లేఖను విడుదల చేశారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మావోయిస్టు పార్టీ కమిటీ పేరుతో అనంత్ పేరున ఒక లేఖ విడుదలైంది. 2026 జనవరి ఒకటి నాటికి సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా విరమించుకుని ప్రధాన స్రవంతిలో కలిసేందుకు నిర్ణయించుకున్నామని, అప్పటి వరకు మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు సమన్వయం పాటించాలని జనవరి ఒకటి వరకు భద్రతా దళాలు అరెస్టులు, ఎన్‌కౌంటర్లు వంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా చూడాలని ఆ లేఖలో తరువాయి 2లో

### చైతుతో పాటు మరో తొమ్మిది మంది లొంగుబాటు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ జిల్లా జగద్దల్ పూర్‌లో మావోయిస్టు నేత చైతు అలియాస్ శ్యామ్ దాదా పోలీసులు ఎదుట లొంగిపోయారు. ఆయనతో పాటు పది మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు బస్తర్ ఐజి సుందర్ రాజన్ తెలిపారు. దర్భా డివిజన్ ఇంచార్జ్ గా ఉన్న చైతు 2013 జిరామ్ వ్యాలీ దాడిలో 30 మంది కాంగ్రెస్ నేతలపై దాడి చేసి హతమార్చిన ఘటనలో ప్రధాన నిందితుడు. 2013 మే 15న జరిగిన దాడిలో చనిపోయిన వారిలో ప్రధానంగా ఆ రాష్ట్ర మంత్రి మహేందర్ ఖర్మ, కాంగ్రెస్ చీఫ్ నందకుమార్ పటేల్, విద్యాచరణ్ శుక్లా ఉన్నారు.

## 3000 మంది ప్రముఖులకు ఆహ్వానం

- ఆహ్వానితుల్లో బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లేర్, ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ డైరెక్టర్ ఎరిక్ స్విడర్, పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాయల్ ఫ్యామిలీ సభ్యులు
- ‘‘తరలిరండి.. ఉజ్జ్వల తెలంగాణలో పాలుపంచుకోండి’’ నినాదంతో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు
- ప్రపంచ స్థాయి వేడుకగా భారీ ఏర్పాట్లు

ప్రజాపక్షం/హైదరాబాద్

‘‘తరలి రండి ఉజ్వల తెలంగాణలో పాలుపంచుకొండి’’ అనే నినాదంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ‘తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్’ను నిర్వహిస్తోంది. డిసెంబర్ 8, 9 తేదీలలో హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించేందుకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్ చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. దేశ విదేశాలకు చెందిన దాదాపు 3 వేల మంది ప్రముఖులను ప్రభుత్వం ఈ సదస్సుకు ఆహ్వానిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, టెక్నాలజీ రంగం ప్రముఖులు ఈ జాబితాలో ఉన్నారు. బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లేర్, ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ డైరెక్టర్ ఎరిక్ స్విడర్, పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాయల్ ఫ్యామిలీ సభ్యులు, వివిధ కంపెనీల అంతర్జాతీయస్థాయి సిఇఓలు సదస్సుకు హాజరుకానున్నారు. వివిధ రంగాల ప్రముఖులను సదస్సుకు ఆహ్వానించేందుకు స్వయంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేరుతో ప్రభుత్వం ఆహ్వాన లేఖలను పంపిస్తోంది.

**ప్రముఖులకు సిఎం ఆహ్వాన లేఖలు**

‘వికసిత్ భారత్ 2047 జాతీయ వృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా మా ప్రజా ప్రభుత్వం ‘తెలంగాణ రైజింగ్ 2047’ డాక్యుమెంట్‌ను తయారు చేసింది. ఆర్థిక వృద్ధి, అన్ని రంగాల ప్రగతి, అన్ని వర్గాల సంక్షేమం, సాధికారత, సమ్మిళిత వృద్ధి లక్ష్యంగా భవిష్యత్తు తెలంగాణకు రోడ్ మ్యాప్‌ను రూపొందించింది. ఈ లక్ష్యాలను కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పాన్ని ప్రపంచ వేదికపై ప్రదర్శించేందుకు డిసెంబర్ 8, 9 తేదీలలో హైదరాబాద్‌లో ‘తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ –2025’ను నిర్వహిస్తున్నాము. తప్పకుండా తరలిరండి.’ అనే ఆహ్వాన సందేశంతో ముఖ్యమంత్రి పేరుతో ప్రభుత్వంలేఖలు పంపించింది.

**సిఎం ఆహ్వానానికి స్పందించిన ప్రముఖులు**

ప్రభుత్వం పంపించిన ఆహ్వానం అందుకున్న ప్రముఖులలో కొందరు సదస్సుకు హాజరవుతున్నట్లు ప్రకటించారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాజవంశానికి చెందిన షేక్ తారిక్ అల్ ఖాసిమీ, రాస్ అల్ ఖైమా, డాయిచ్ బోర్స్ గ్రూప్ హెడ్ తరువాయి 2లో



## రిజర్వేషన్లు సరిదిద్దాలి


ఆ తర్వాతే ఎన్నికలు

బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎన్నికలను నిలుపుదల చేయడంతో పాటు ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి, రిజర్వేషన్లలో జరిగిన తప్పులను సవరించి ఎన్నికలకు వెళ్లాలని బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ సూచించారు. మహాత్మ జ్యోతిబా పూలే 135వ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం తెలంగాణ బిసి కమిషన్ కార్యాలయంలో పూలే చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించడం జరిగిందన్నారు. అనంతరం బిసి కమిషన్ సభ్యులతో చైర్మన్ జి.నిరంజన్ సమావేశమై స్థానిక సంస్థల్లో బిసిలకు కల్పించిన రిజర్వేషన్ల విషయమై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 సంవత్సరం పంచాయతీ ఎన్నికల్లో బిసిలకు 22. 78 శాతం రిజర్వేషన్లు లభిస్తే తరువాయి 12లో

## డ్రగ్స్ సరఫరాకు నైజీరియన్ల భారీ కుట్ర

- న్యూ ఇయర్ వేడుకలే లక్ష్యం
- ఢిల్లీలో ముమ్మరంగా ‘ఈగల్’ దాడులు
- డ్రగ్స్ ఆపరేషన్‌లో వెలుగు చూస్తున్న సంచలనాలు
- పట్టుబడిన 50 మంది నేడు హైదరాబాద్‌కు



ప్రజాపక్షం/హైదరాబాద్

న్యూఢిల్లీ కేంద్రంగా నూతన సంవత్సర వేడుకల్లో దేశ వ్యాప్తంగా డ్రగ్స్‌ను సరఫరా చేసేందుకు నైజీరియన్ల భారీ కుట్రను తెలంగాణ పోలీసులు ఛేధించింది.డ్రగ్స్ నిర్మూలన కోసం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ‘ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్’ (ఈగల్ టీ) పోలీసులు బృందాలు ఢిల్లీలో మూడు రోజులుగా ముమ్మరంగా దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో పట్టుబడిన 50 మంది నైజీరియన్లను శనివారం హైదరాబాద్‌కు తరలించేందుకు ఈగల్ టీం సిద్ధమైంది. వీరంతా న్యూఢిల్లీలోని 20 ప్రాంతాల్లో సోదాలు చేయగా ఈగల్ టీంకు చిక్కారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను మార్చేందుకు ఈగల్ టీమ్ వ్యూహాత్మకంగా అడుగులు తరువాయి 2లో

## జిల్లాలకు సిఎం

డిసెంబర్ 1 నుంచి ఆరు జిల్లాల్లో రేవంత్‌రెడ్డి పర్యటన



ప్రజాపక్ష/హైదరాబాద్

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పరిపాలన పూర్తయిన సందర్భంగా డిసెంబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ‘ప్రజా పాలన వారోత్సవాల’ను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి డిసెంబర్ 1వ తేదీ నుంచి ఆరు రోజుల పాటు జిల్లాలలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా జిల్లాలలో నిర్వహించే బహిరంగ వారోత్సవాలలో నిర్వహించే బహిరంగ సభలలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. డిసెంబర్ 1న మహబూబ్ నగర్ జిల్లా మక్తల్, 2వ తేదీన ఖమ్మం జిల్లా కొత్తగూడెం, 3వ తేదీన కరీంనగర్ జిల్లా హుస్నాబాద్, 4వ తేదీన ఆదిలాబాద్, 5వ తేదీన తరువాయి 2లో

## ‘కాళోజీ’ వ్యవహారంపై సిఎం ఆగ్రహం


యూనివర్సిటీ విసి రాజీనామా!

ప్రజాపక్షం/హైదరాబాద్/హనుమకొండ

ఇటీవల వరుసగా కాళోజీ వర్సిటీ వ్యవహారాలపై పత్రికల్లో వస్తున్న కథనాలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్ష పేపర్ల మూల్యాంకనంలో అవకతవకలు, ఇష్టారీతిగా ఇన్ ఛార్జీల నియామకం తదితర ఘటనలపై వస్తున్న ఆరోపణలపై సిఎం ఆరా తీశారు. ఈ అంశంపై వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల నుంచి రేవంత్ రెడ్డి వివరణ కోరారు. ఉన్నతమైన వర్సిటీలో అస్తవ్యస్త పరిస్థితులకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశించారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే ఘటనల వెనుక ఎంతటి వారున్నా ఉపేక్షించే సమస్యే లేదని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.. ఉన్నత స్థాయి సంస్థల్లో పని చేసేవారు తరువాయి 2లో

## రికార్డులు బద్దలు

- కోకాపేటలో ఆకాశాన్నంటుతున్న భూముల ధరలు
- రెండోవిడత వేలంలో ఎకరాకు రూ.151 కోట్లు పలికిన ధర



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌లో భూముల ధరలు రికార్డు సృష్టిస్తున్నాయి. గతంలో భూముల ధరల రికార్డులను కోకాపేటలో ప్రస్తుత ధరలు బ్రేక్ చేస్తున్నాయి. కోకాపేట పరిసర ప్రాంతాల్లో కోట్లు పలుకుతున్నాయి. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండిఎ) శుక్రవారం నిర్వహించిన ఇ వేలంలో కోకాపేట నియోపోలీస్ భూములు రికార్డు స్థాయి ధర పలికాయి. హైదరాబాద్ కోకాపేట్ లో ఉన్న భూముల రెండో విడత ఇ వేలం శుక్రవారం ముగిసింది. రెండో విడత వేలంలో ఎకరాకు ఏకంగా రూ.151 కోట్ల పలికాయి. నియోపోలిస్ దగ్గర ఉన్న ప్లాట్ నెంబర్ 15 లో ఎకరానికి 151 కోట్ల 25 లక్షలు పలికిన ఎకరం ధర పలికి రికార్డు సృష్టించింది. అదే విధంగా ప్లాట్ నెంబర్ 16 లో ఎకరం ధర 147 కోట్ల 75 లక్షలు పలికింది. ఫ్లాట్ నంబర్ 15, 16లో మొత్తం 9.06 ఎకరాల భూమికి వేలం నిర్వహించారు. 15వ నెంబర్ ప్లాట్‌లో ఎకరం తరువాయి 2లో

## మెగా జిహెచ్‌ఎంసి 2000 చదరపు కిలోమీటర్లు


- పరిపాలనా సౌలభ్యం కోసం ఒకే కార్పొరేషన్ ఏర్పాటు యోచనలో ప్రభుత్వం
- ‘మహా’ నగరంలో మున్సిపల్ సంస్థల విలీనంపై ముమ్మరంగా సాగుతున్న కసరత్తు



ప్రజాపక్షం/హైదరాబాద్

మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి)లో శివారు కార్పొరేషన్లు, మునిసిపాల్టీల విలీనం నిర్ణయం నేపథ్యంలో, తదుపరి కార్యాచరణపై ప్రభుత్వ విభాగాలు దృష్టి సారించాయి. విలీనం పూర్తి చేసే కసరత్తు ముమ్మరంగా సాగుతోంది. గత మూడు రోజులుగా డివిజన్‌ల పునర్విభజన కసరత్తు ప్రారంభించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సిజిజి) కార్యాలయంలో జిహెచ్‌ఎంసికి చెందిన టౌన్‌ప్లానింగ్ యాంత్రాంగం తరువాయి 2లో

## సిఇసి చేతికి రక్తపు మరకలు




- బెంగాల్‌లో 40‘సర్’ సంబంధిత మరణాలు
- భారత ఎన్నికల సంఘాన్ని కలిసిన టిఎంసి

**న్యూఢిల్లీ :** ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియ కొనసాగుతున్న 9 రాష్ట్రాలు, మూడు యుటిల్లో పలువురు బిఎల్‌ఒలు మృత్యువాత పడుతున్నారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో ఇప్పటి వరకు దాదాపు 40 మంది సర్ సంబంధిత మరణాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం తృణమూల్ కాంగ్రెస్ ప్రతినిధి బృందం ఢిల్లీలో భారత ఎన్నికల కమిషన్ సమావేశమైంది. తమ రాష్ట్రంలో చోటు చేసుకున్న మరణాలను వివరించింది. చీఫ్ ఎలక్షన్ కమిషన్ చేతులుకు అంటుకున్న రక్తపు మరకలు అని ఆరోపించింది. పశ్చిమ బెంగాల్‌లో కొనసాగుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక తరువాయి 12లో

## శ్రీలంక, ఇండోనేషియాలో ప్రకృతి విలయం



**కొలంబో/జకార్త:** శ్రీలంక, ఇండోనేషియాలో ప్రకృతి విలయం భారీ నష్టాన్ని మిగిలిస్తున్నది. శ్రీలంకలో వరదలు, కొండ చరియలు విరిగిపడడం వంటి ఘటనల్లో 56 మంది మృతి చెందగా, పదుల సంఖ్యలో గల్లంతయ్యారు. ఇండోనేషియాలో కనీసం 79 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురి ఆచూకీ తెలియడం లేదు. పరిస్థితుల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అన్ని సంస్థలనూ అప్రమత్తం చేసింది. ముందస్తు చర్యగా అత్యవసర సర్వీసులను మినహాయించి మిగతా అన్ని సంస్థలకు తరువాయి 12లో



## భారత్‌కు పుతిన్

**డిసెంబరు 4 నుంచి రెండు రోజుల పర్యటన**

ద్వైపాక్షిక అంశాలపై పలు కీలక నిర్ణయాలు !

**న్యూఢిల్లీ :** భారత్–రష్యాల స్నేహసంబంధం మరింత పటిష్ఠం కానుంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెండు రోజుల పర్యటన కోసం భారత దేశానికి రానున్నారు. డిసెంబర్ 4నుండి నరేంద్ర మోదీతో వార్షిక సమావేశాలలో ఆయన పాల్గొనబోతున్నారు. ఈ పర్యటన ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో గణనీయమైన ఫలితాలను ఇస్తుందని భావిస్తున్నారు. శుక్రవారం రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌ను సందర్శించనున్న విషయాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఇఎ) ప్రకటించింది.పుతిన్ భారత పర్యటన రష్యాభారత్‌ల మధ్య ప్రత్యేక, విశేష వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి దార్శనికతను నిర్దేశిస్తుందని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆహ్వానం మేరకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డిసెంబర్ 4 నుండి 5 వరకు భారతదేశం రష్యా శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు భారత్‌లో అధికారిక పర్యటన చేయనున్నారు అని ఆ ప్రకటన తెలిపింది. రాష్ట్రపతి తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## గీత దాటొద్దు: జపాన్‌కు చైనా హెచ్చరిక

**బీజింగ్:** తైవాన్ విషయంలో గీత దాటితే జపాన్ భారీ మూల్యాన్ని చెల్లించు కోవల్సి వస్తుందని చైనా హెచ్చరించింది. తైవాన్ తీరానికి 100 కిమీల దూరంలో ద్వీపంపై క్షిపణుల మోహరింపునకు జపాన్ యోచిస్తుండటంతో చైనా రక్షణ శాఖ ఈ విధంగా స్పందించింది. తైవాన్‌పై చైనా దాడి చేస్తే టోక్యో సైన్యం బదులిస్తుందని పాన్ ప్రధాని సనే తకైచి ఇటీవల వ్యాఖ్యానించారు. రెండు దేశాల మధ్య దౌత్య సంక్షోభం దృష్ట్యా ఈ పరిణామానికి ప్రాధాన్యత ఏర్పడింది. తైవాన్ కంటే అనేక రెట్లు అధికంగా చైనా రక్షణ వ్యయం ఉంటుందని తైవాన్ మెయిన్‌ల్యాండ్ అఫైర్స్ కౌన్సిల్ అధికార ప్రతినిధి లియాంగ్ వెన్‌చీ అన్నారు. (క్రాస్‌స్ట్రైట్ శాంతికి చైనా ప్రాధాన్యత ఇస్తే ఈ డబ్బును మెయిన్‌ల్యాండ్ ఆర్థిక పరిస్థితులు, ప్రజల జీవితాలను మెరుగు పర్చడం కోసం వినియోగించుకోవచ్చన్నారు. తైవాన్ చుట్టూ సముద్ర జలాల్లో, గగనతలంలో చైనా సైన్యం తిరుగుతూనే ఉంటుందని చెప్పారు.

# ఇక కఠిన వలస విధానం

**అన్ని తృతీయ ప్రపంచ దేశాల నుండి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తాని డొనాల్డ్ ట్రంప్ ప్రకటన**



**న్యూయార్క్/ వాషింగ్టన్:** వైట్‌హౌస్ సమీపం లోఅఫ్ఘానిస్థాన్‌జాతీయుడు రహ్మానుల్లా లకాన్వాల్ జరిపిన కాల్పుల్లో గాయపడిన ఇద్దరు వెస్ట్ వర్జీనియా నేషనల్ గార్డ్స్‌లో ఒకరు మృతిచెందినట్టుఅమెరికాఅధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. థాంక్స్ గివింగ్‌ఉత్సవం సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, 20 ఏళ్ల సారా బెక్‌స్ట్రామ్ మృతి చెందగా, స్టాఫ్ సార్జెంట్ ఆండ్రూ ఓల్ఫ్ (24) ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. అతని పరిస్థితి కూడా ఆం దోళనక రంగానుండడన్నారు. 'సారా ఇప్పుడు మన మధ్య లేదు. ఆమె మరణ వార్త నాకు ఇప్పుడే తెలిసింది' అన్నారు. ఈ ఘటనను ఉగ్రవాద చర్యగా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. 'ఇది మానవత్వానికి వ్యతిరేకంగా జరిగినది. తీవ్రంగా ఖండిస్తున్నాం. నిందితుడు అత్యంత ప్రమాదకర ఆఫ్ఘనిస్తాన్‌కు చెందినవాడు. జో బైడెన్ హ యాంలో అమెరికా వచ్చాడు. అప్పుడు వచ్చిన అఫ్ఘాన్లు అందరినీవిచారించాలి' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. శరణార్థులు తమ మనుగడకే ప్ర మాదకరమని ప్రకటించారు. అందుకే, ఇక కఠిన వలస విధానాన్ని అమలు చేస్తామని, అన్ని తృతీయ ప్రపంచ దేశాల నుండి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తానని స్పష్టం చేశారు,అమెరికాకు భద్రతా ముప్పుగా ఉన్న విదేశీయులను బహిష్కరిస్తానని హెచ్చరించారు. పూర్వ బైడెన్ ప్రభుత్వ కాలంలో వచ్చిన లక్షలాది వలసదారుల ప్రవేశాలను కూడా రద్దు చేస్తానని తెలిపారు. యుఎస్ సిఐ ఎస్ కొత్త మార్గదర్శకాలను అనుసరిస్తుందని, ఆఫ్ఘనిస్తాన్‌తో సహా 19 అధిక ప్రమాద దేశాల నుండి వచ్చిన వలస అభ్యర్థలపై కఠినంగా 'పునర్మూల్యాంకనం' జరుగుతుం దనిస్పష్టంచేశారు.వలస విధానాలు దేశంలో నేరాలు, సామాజిక సమస్యలు, వనరులపై ఒత్తిడి పెంచుతున్నా యని ఆరోపించారు.

### పాకిస్తాన్ ఖండన

**ఇస్లామాబాద్:**అమెరికాలో నేషనల్ గార్డ్స్‌పై అఫ్ఘాన్‌కు చెందిన రహ్మానుల్లా లకాన్వాల్ కాల్పులు జరిపిన ఘటనను పాకిస్తాన్ ఖం డించింది. ఇది ముమ్మాటికీ ఉగ్రవాద చర్చే నని తెలిపింది. తమ దేశంలోనూ జరిగిన ఎన్నో ఉగ్రవాద దాడులకు అఫ్ఘానిస్థానే కారణమని ఆరోపించింది. అత్యంత సంక్లిష్టమైన పరిస్థితుల్లో,అమెరికాకుఅన్నివిధాలా సాయంగా ఉంటామని తన ప్రకటనలో పేర్కొంది.

## 'హాంకాంగ్' ఘటనకు
# పరంజాయే కారణం!



**హాంకాంగ్:** హాంకాంగ్‌లోని ఒక అపార్ట్‌మెంట్ సముదాయంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదానికి కారణాలపై దర్యాప్తు జరుగుతున్నది. అయితే, ఈ ప్రమాదంలో కనీసం 94 మంది మరణించ దంతో, అక్కడ విస్తృతంగా ఉపయోగించే 'బాంబూ స్కాఫోల్డింగ్' (వెదురు పరంజా) భద్రతపై తీవ్ర ప్రశ్నలు తలెత్తాయి. 32 అంత స్తుల భవనం వెలుపల ఉన్న పరంజాలో అగ్ని ప్రారంభమై, గాలుల కారణంగా భవనం లోపలికి, అపై మరో ఆరు టవర్లకు వేగంగా వ్యాపించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. తేలికగా ఉండటం, చవక కావడం, రద్దీగా ఉన్న హాంకాంగ్ వీధుల్లో సులభంగా అమర్చగలగడం వంటి కారణాలతో శతాబ్దాలుగా వెదురు పరంజాల వాడకం కొనసాగుతున్నది. ఇవి అగ్నిప్రమాదాలకు లోనయ్యే ప్రమాదం ఎక్కువ. 2018 నుంచి ఇలాంటి బాంబూ స్కాఫోల్డింగ్ ప్రమాదాల్లో కనీసం 23 మంది మరణించారు. హాంకాంగ్ ఇప్పటికే దశలవారీగా మెటల్ స్కాఫోల్డింగ్‌కు మారాలని ప్రణాళిక చేస్తోంది. అధికారులు బాంబూతో పోలిస్తే మెటల్ అగ్ని నిరోధకతలో మరింత సురక్షితమని నిపుణులు పేర్కొన్నారు. ప్ర మాదం అధికంగా ఉన్న ప్రాంతాల్లో మెటల్ స్కాఫోల్డింగ్ తప్పనిసరి కావాల ని సూచించారు. అ గ్ని వేగంగా వ్యాపి ంచడానికి ప్లాస్టిక్ నెట్లు, ప్లాస్టిక్ ఫోమ్ ప్యానెల్లు వంటి ఇతర దహన సామగ్రి కూడా కారణమై ఉండవచ్చని అధికారులు తెలిపారు. ఫైర్ సేఫ్టీ ప్రమాణాలను ఉల్లంఘించారనే అనుమానంతో ముగ్గురు నిర్మాణ సంస్థాధికారులను పోలీసులు అరెస్టు చేశారు. ఇలా వుంటే, ఈ ఘటన బాంబూ స్కాఫోల్డింగ్ భవిష్యత్తు పై పెద్ద చర్చను రేకెత్తించింది. పరిశోధన తుది ఫలితాలు ఏమైనా కావచ్చుగానీ, హాంకాంగ్‌లో బాంబూ స్కాఫోల్డింగ్ యుగం ముగింపునకు చేరువలోనే ఉందని నిపుణులు భావిస్తున్నారు.

# దక్షిణ సిరియాలో ఇజ్రాయెల్ దాడి

## కనీసం 10 మంది మృతి

## దళాలపై నిరసన వెల్లువ

**డమాస్కస్:** దక్షిణ సిరియాలోని బెయిత్ జిన్ గ్రామంలో శుక్రవారం జరిగిన దాడిలో ఇజ్రాయెల్ దళాలు కనీసం 10 మందిని హతమార్చాయి. స్థానికులు, సిరియా మీడియాను అనుసరించి, గ్రామంలో కొంతమందిని అరెస్ట్ చేయడానికి ప్రవేశించిన ఇజ్రాయెల్ దళాలపై ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. వారిపై సైనికులు కాల్పులు జరిపారు. ఈ ఘటనల నేపథ్యంలో అనేక కుటుంబాలు ప్రాంతం విడిచి పారిపోయాయి. కాగా, ఇజ్రాయెల్ సైనికాధుల ప్రకటనను ప్రకారం, తమ పౌరులపై దాడులకు కుట్ర చేసిన జమా– ఎ– ఇస్లామియ్యా మద్దతుదారులు ఉన్నారన్న ఇంటెలిజెన్స్ వర్గాలు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఆపరేషన్ చేపట్టారు. కాల్పుల్లో ఆరుగురు ఇజ్రాయెల్ సైనికులు గాయపడ్డారు. ప్రతిస్పందనలో ఇజ్రాయెల్ వైమానిక సహాయంతో దాడి చేసి, అనేక మిలిటెంట్లను హతమార్చి, ఇతరులను అదుపులోకి తీసుకుంది. 2024లో బషర్ అల్ అసద్ పతనమైన తర్వాత సిరియాలో ఏర్పడిన కొత్త ప్రభుత్వంపై ఇజ్రాయెల్ అప్రమత్తంగా ఉంది. అప్పటి నుండి ఇజ్రాయెల్, 1974 ఒప్పందంలో ఉన్న యుఎన్ బఫర్ జోన్‌ను స్వాధీన పరుచుకుని, దక్షిణ సిరియాలో అస్త్రాలు లేని ప్రాంతం కోసం ఒత్తిడి చేస్తోంది.

సిరియా అధికారులు ఈ దాడులను తమ భౌగోళిక స్వాధీనంపై దాడిగా ఖండించినప్పటికీ, తాజా దాడిపై వెంటనే స్పందించలేదు. గ్రామాధికారి ప్రకారం, హతులంతా పౌరులే. ఇటీవలి లెబనాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడుల నేపథ్యంలో, ఈ ఘటనలు ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచుతూ, గాజాలోని సున్నితమైన విరమణ ఒప్పందాన్ని కూడా ప్రమాదంలోకి నెడుతున్నాయి. యునైటెడ్ నేషన్స్ ప్రకారం, గత ఏడాది విరమణ తర్వాత లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడుల్లో 127 పౌరులు మరణించారు.

# జైలు అధికారులపై ఇమ్రాన్ సోదరి పిటిషన్





**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను అదియాలా జైల్లో కలుసుకోవడానికి అనుమతించకపోవడంతో, అతని సోదరి అలీమా ఖాన్ ఇస్లామాబాద్ హైకోర్టులో జైలు సూపరింటెండెంట్, ఇతర అధికారులపై పిటిషన్ దాఖలు చేశారు. మార్చి 24న హైకోర్టు ఖాన్‌ను వారంలో రెండు రోజులు (మంగళ, గురువారం) కలుసుకునేఅనుమతిని పునరుద్ధరించింది. కానీ అధికారులు ఈఆదేశాలనుపాటించలేదనిపిటిషన్‌పేర్కొంది. అలీమా, ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిది గురువారం జైలుకి వెళ్లి, కలుసుకునే అనుమతి నిరాకరించడంతో 16 గంటలపాటు ధర్నా నిర్వహించారు. కానీ వారు ఖాన్‌ను కలుసుకోలేకపోయారు. అఫ్రిది, ఇస్లామాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా కలుసుకోలేకపోయిన తరువాత, తన పార్టీ పార్లమెంట్ సమావేశాలు జరగనివ్వబోమని హెచ్చరించారు. సెనేట్‌లో కూడా పిటిఐ సభ్యులు ఖాన్ నిర్బంధంపై నినాదాలు చేశారు. ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం బాగోలేదని వచ్చిన వార్తలను ప్రభుత్వం తిప్పికొట్టి, ఆయనకు ఇతర ఖైదీలకు లేని సౌకర్యాలు ఉన్నాయని తెలిపింది.అఫ్రిది,గతనెల ముఖ్యమంత్రిగా నియమితుడైనప్పటి నుండి ఖాన్‌ను జైలు నుండి విడుదల చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నాడు. కానీ ఇప్పటివరకు అతని అన్ని ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఆయన మరింత నిరసనలు కొనసాగిస్తామని అన్నారు.

## జెలెన్‌స్కీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ మొర్మాక్ ఇంటిపై
# అవినీతి నిరోధకశాఖ దాడులు



**కీవ్:** ఉక్రేన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ సిబ్బందిలో, అత్యంత కీలకమైన హోదాలో ఉన్న చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఆండ్రియ్ యాండ్రియ్ యెర్మాక్ ఇళ్లు, కార్యాలయంపై అవినీతి నిరోధక సంస్థలు దాడులు జరిపాయి. అంతర్జాతీయ మీడియా నివేదికలను ఉటంకిస్తూ, పిటిఐ తెలిపిన వివరాల ప్రకారం యెర్మాక్‌పై సుమారు 100 మిలియన్ డాలర్ల (సుమారు 895 కోట్ల రూపాయలు)మేర అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇంధన రంగంలో అతను ఈ నేరాలకు పాల్పడినట్టు చెప్తున్నారు. ఈ నేపథ్యంలోనే, ఉక్రేన్ నేషనల్ యాంటీకరప్షన్ బ్యూరో, స్పెషలైజ్డ్ యాంటీకరప్షన్ ప్రాసిక్యూటర్ ఆఫీస్ సంయుక్తంగా దాడులు నిర్వహించాయి. జెలెన్‌స్కీపూర్వవ్యాపార భాగస్వామి తిమూర్ మిం డిచ్‌దర ప్రధాన నిందితుడిగా అనుమానిస్తున్నా రు. తిమూర్ దేశం విడిచి పారిపోగా, ఈ ఆరోపణలతో సంబంధం ఉందన్న విమర్శలు ఎదుర్కొంటున్న ఇద్దరు కీలక మంత్రులు ఇది వరకే రాజీనామా చేశారు. కాగా,తన ఇంటిపై దాడులు జరిగినట్టు యెర్మాక్ ధ్రువీకరించారు. దర్యాప్తు సంస్థలకు తాను పూర్తిగా సహకరిస్తున్నానని తెలిపారు. ఇలా వుంటే, ఇటీవల వెలుగులోకి వచ్చినఅవినీతి విచారణలు జెలెన్‌స్కీపై అంతర్గత ఒత్తిడిని పెంచాయి. ముఖ్యంగా అమెరికా, యూరోపియన్ యూనియన్ నుండి యుద్ధ సహాయం కొనసాగించేందుకుప్రయత్నిస్తున్న సమయంలో ఈఆరోపణలువెలుగు చూడడం అతనిని ఇబ్బందులకు గురి చేసే అవకాశం ఉంది. అవినీతిని అరికట్టాలని ఉక్రేన్‌కు యూరోపియన్ యూనియన్ స్పష్టం చేసింది. యెర్మాక్ 2020 నుంచి జెలెన్స్కీ ముఖ్య సహాయకుడిగా ఉన్నాడు. 2022 లో రష్యా దాడి తర్వాత జరిగిన ప్రతి విదేశీ పర్యటనలో అధ్యక్షుడితో ఉన్నాడు.

## నైజీరియన్ల భారీ కుట్ర
(మొదటి పేజీ తరువాయి)

వేస్తోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో తెలంగాణ ఈగల్ టీమ్, ఎన్‌సిబి, ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు సంయుక్తంగా జరిపిన ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. న్యూఢిల్లీలోని 20 ప్రాంతాల్లో.. గడువు తీరిన 50 మందికిపైగా నైజీరియన్లు ఉంటున్నట్లు గుర్తించింది. వారిని ఈ టీమ్ అదుపులోకి తీసుకుంది. నోయిడా, గ్వాలియర్, విశాఖపట్నం తదితర నగరాల్లో ఈ డ్రగ్స్‌తో సంబంధాలు ఉన్న కీలక నిందితులను అరెస్ట్ చేసింది. నాలుగు ప్రాంతాల్లో 5,340 ఎక్స్ సిటీ మాత్రలు, 250 గ్రాముల కొకైన్, 109 గ్రాముల హెరాయిన్, 250 గ్రాముల మెథాంఫెటమైన్‌ను సీజ్ చేసింది. ఢిల్లీలోని 59 మ్యూల్ ఖాతాలతోపాటు 16 డ్రగ్స్ కేంద్రాలను గుర్తించింది. ఇక నైజీరియాకు చెందిన 107 బ్యాంకు ఖాతాలు ఈగల్ టీమ్ స్తంభింపజేసింది. మల్నాడు రెస్టారెంట్, మహీంద్రా యూనివర్సిటీ కేసులో నైజీరియన్ నిక్‌ను అరెస్ట్ చేసింది. దేశవ్యాప్తంగా ఈ ముఠాతో దాదాపు 2 వేలకు పైగా డ్రగ్స్ వినియోగదారులు,పెడ్లర్లు ఉన్నట్లు ఈగల్ టీం గుర్తించింది. ఢిల్లీ నుంచి డ్రగ్స్ పార్శిళ్లు.. బూట్లు, దుస్తులు, కాస్మోటిక్ వస్తువులు, చెప్పులు మధ్యలో డ్రగ్స్ పెట్టి కొరియర్ ద్వారా సప్లై చేసినట్లు పోలీసులు దర్యాప్తులో వెల్లడైంది. శ్రీ మారుతి కొరియర్స్, డిటిడిసి, ప్రొఫెషనల్ కొరియర్స్, షిప్ రాకెట్, ఇండియా పోస్ట్, ఢిల్లీ వేరీ, బ్లూ డార్ట్, ట్రాక్ ఆన్ తదితర కొరియర్స్ నెట్‌వర్క్‌ను ఈ నైజీరియన్ ముఠా ఉపయోగించినట్లు ఈ కేసు విచారణలో బహిర్గతమైంది. మరికొద్ది రోజుల్లో నూతన సంవత్సర వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో డ్రగ్స్ కంట్రోల్‌కు ఈగల్ టీమ్ భారీ ఆపరేషన్ చేపట్టింది. ఈ సందర్భంగా అంతర్జాతీయ డ్రగ్స్ ఆపరేషన్‌ను ఛేదించింది. ఢిల్లీలో అరెస్ట్ చేసిన 50 మందిని హైదరాబాద్‌కు తరలించేందుకు ఈ టీమ్ ఇప్పటికే చర్యలు చేపట్టింది. వీరిని హైదరాబాద్కు తరలించిన తర్వాత కోర్టులో హాజరుపరచనుంది. అనంతరం వీరిని మరింత లోతుగా విచారణ జరపనుందని తెలుస్తోంది. ఈ విచారణలో మరిన్నీ కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని ఈగల్ టీమ్ భావిస్తోంది. ఈ విచారణలో వీరు చెప్పే కీలక ఆధారాలతో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని సమాచారం.

## ప్రముఖులకు ఆహ్వానం
(మొదటి పేజీ తరువాయి)

లుడ్విగ్ హెయిన్జెల్మాన్, ఎన్రిషన్ వ్యవస్థాపక భాగస్వామి డబ్ల్యూ విన్స్టన్, మాండల్ వైల్ లైఫ్ గ్రూప్ సిఈఓ బెనెట్ నియోతో పాటు పలు టెక్ కంపెనీల సిఈఓలు, పెట్టుబడిదారులు, స్టార్టప్ ఫౌండర్లు ఈ సదస్సుకు హాజరవుతున్నారు. తెలంగాణ ప్రగతి సంక్షేమాన్ని, అన్ని రంగాల్లో సాధించిన అభివృద్ధిని ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఈ వేదికను అద్భుతంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రపంచం నలుమూలాల నుంచి పెట్టుబడులను ఆకర్షించటంతో పాటు గ్లోబల్ ఇన్నోవేషన్ దిశగా తెలంగాణకు ఉన్న అనుకూలతలను చాటిచెప్పాలని సంకల్పించింది.

### మెస్సీ కిక్‌తో ముగింపు

రెండు రోజుల పాటు జరిగే సదస్సులో డిసెంబర్ 9న 'తెలంగాణ రైజింగ్–2047 డాక్యుమెంట్'ను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారు. ఈనెల 13న ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లయనల్ మెస్సీ హైదరాబాద్‌కు రానున్నారు. ఆయన పాల్గొనే వేడుకలోనే ప్రత్యేక ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహిస్తారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుకు ఇది ప్రత్యేక ఆకర్షణగా, ముగింపు ఘట్టంగా నిలుస్తుంది.

## జిల్లాలకు సిఎం
(మొదటి పేజీ తరువాయి)

నర్సంపేట, 6వ తేదీన నల్గొండ జిల్లా దేవరకొండలో జరిగే బహిరంగ సభలకు ముఖ్యమంత్రి హజరవుతారు. సిఎం పాల్గొనే బహిరంగ సభలకు భారీ ఏర్పాట్లకు, పెద్ద ఎత్తున ప్రజా సమీకరణకు కాంగ్రెస్ పార్టీ చర్యలు చేపట్టింది. కాగా జిల్లాలలో సిఎం బహిరంగ సభలకు సబంధించిన ఏర్పాట్లను సంబంధిత జిల్లాల మంత్రులు, ఎంఎల్‌ఎలు, సంబంధిత ప్రభుత్వ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటన పట్టణ ప్రాంతాలకే పరిమితం అవుతుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## లొంగిపోతాం
(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. మా మిత్రుల మధ్య సంబంధాలు ఏర్పరచుకుని సమాచారాన్ని మరింత వేగవంతం చేయడానికి భద్రతా దళాల కార్యక్రమాలు విరోధంగా మారాయని అందుకే భద్రతా దళాల కార్యకలాపాలను నిలిపివేయాలని కోరుతున్నామని లేఖలో పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో సతీష్‌దాదా, మహారాష్ట్రలో సోనుదాదా విషయంలో జరిగినట్లుగా ముఖ్యమంత్రి లేదా హోంమంత్రి అప్పగించి ప్రధాన స్రవంతిలో చేరతామని ఈ ప్రక్రియ శాంతియుతంగాపూర్తి చేయడంలో మాకు ఉత్తమ మద్దతు అందించే రాష్ట్ర ప్రభుత్వం ఎదుట లొంగిపోతామన్నారు. పైన పేర్కొన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు జనవరి ఒకటి 2026 వరకు ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా చూడాలని ఈ సమయం మాకు అవరమని వారు లేఖలో పేర్కొన్నారు. రేడియో ద్వారా ఛత్తీస్‌గఢ్ హోంమంత్రి విజయ్ ప్రసంగం విన్నామని 10 నుంచి 15 రోజుల సమయం సరిపోదాన్నారు. నిర్దిష్టప్రతిపాదనలు, డిమాండ్లు చేయాలనుకుంటే ప్రభుత్వం వాటిని నెరవేర్చేందుకు ప్రయత్నిస్తుందన్న ప్రకటనను కూడా మావోయిస్టు పార్టీ స్వాగతిస్తుందని ప్రధాన స్రవంతిలో చేరేటప్పుడు ఆ డిమాండ్లను పత్రిక ప్రకటనలో విడుదల చేస్తామని మావోయిస్టులు లేఖలో పేర్కొన్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు కూడా స్పందించాలని స్పందన కోసం ఎదురు చూస్తున్నామన్నారు.ఈప్రక్రియమొత్తం సుఖాం తం అయ్యేంత వరకు మావోయిస్టు సహచరులంతా కార్యకలాపాలను నిలిపి వేయాలని అంతరాయం కలిగించే ఎటువంటి పనులు చేపట్టవద్దని లేఖలో పేర్కొన్నారు. ఈ దఫా పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పిఎల్‌జిఏ) వారోత్సవాలను సైతం నిర్వహించవద్దని ఆ లేఖలో తెలిపారు. భద్రతాదళాల గస్తీని ఈ జోన్‌లో నిలిపివేయాలని ఈ ప్రకటన ఒకరి నుంచి మరొకరికి చేరేందుకు సహకారంఅవసరమన్నారు.అంతేకాకుండా మా వోయిస్టు పార్టీకి చెందిన ఎంఎంసి సభ్యులందరూ బహిరంగంగా సంప్రదించడానికి బావోసింగ్ ఒక ఓపెన్ ఫ్రీక్వెన్సీ నెంబర్‌ను మావోయిస్టులు విడుదల చేశారు. 435.715 ద్వారా సంప్రదించవచ్చునని 2026 జనవరి ఒకటిన ఒకరితో ఒకరం కలిసే అవకాశం ఉందని లేఖలో తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు జర్నలిస్టులు,ప్రజాప్రతినిధులుసహకరించాలని ఇం తకుముందులొంగిపోయినసోను,సతీష్‌లు కూడా మూడు రాష్ట్రాల ప్రభుత్వాలతో సంప్రదించి ఈ ప్రక్రియ పూర్తిగా శాంతియుతంగాజరిగేలా చూడాలని లేఖలో మావోయిస్టులుఅభ్యర్థించారు.అంతేకాకుండా సాయంత్రం ప్రాంతీయ వార్తల్లో మేము విడుదల చేసిన ఆడియోను రేడియోలో ప్రసారం చేయాలన్నారు.

## రికార్డులు బద్దలు
(మొదటి పేజీ తరువాయి)

రూ.151.25 కోట్లు, 16వ నెంబర్ ప్లాట్‌లో ఎకరానికి రూ.147.5 కోట్ల ధర పలికింది. దీంతో ప్రభుత్వ ఖజానాకు రూ.1352 కోట్ల ఆదాయం సమకూరనుంది. గతవారం ఇదే లేఔట్‌లో రూ.137.25 కోట్లుగా ధర పలికిన విషయం తెలిసిందే. ఎదురుచూపుల్లో ఉన్న రెండో విడత నియోపొలిస్ ఈఆక్షన్‌లు నవంబర్ 28, 2025న విజయవంతంగా పూర్తయ్యాయి. నవంబర్ 24న జరిగిన తొలి విడతలో వెలువడిన అద్భుత ఫలితాలను మరింత అధిగమించిన ఈ ఆక్షన్‌లు, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో నియోపొలిస్‌ను అత్యంత విలువైన భూభాగంగా నిలబెట్టాయి. ఈ విడతలో 4.03 ఎకరాల 15వ ప్లాట్, 5.03 ఎకరాల 16వ ప్లాట్లను వేలానికి ఉంచారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన బిడ్డింగ్ సాయంత్రం 6.30 గంటల తర్వాత కూడా తీవ్ర పోటీతో కొనసాగింది. ప్రముఖ అభివృద్ధిదారులు పోటీపడటంతో వేలం ఉత్సాహంగా సాగింది.

* 4.03 ఎకరాల 15వ ప్లాట్ ఎకరాకు రూ.151.25 కోట్లు నమోదుచేసి రికార్డు సృష్టించింది. ఈ ప్లాట్‌లను లక్ష్మి నారాయణ గుమ్మడి, కర్తీశ్ రెడ్డి మద్దుల, శరత్ వెంట్రప్రగడ, శ్యామ్ సుందర్ రెడ్డి వంగల కైవసం చేసుకున్నారు. 5.03 ఎకరాల 16వ ప్లాట్ ఎకరాకు రూ. 147.75 కోట్లు పలికి గోద్రెజ్ ప్రాపర్టీస్ లిమిటెడ్ సొంతం చేసుకుంది.

* ఈ రెండు ప్లాట్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు మొత్తం రూ.1352 కోట్లు లభించాయి. మొదటి విడతతో కలిపి ఇప్పటి వరకు నియోపొలిస్ ఈఆక్షన్‌ల ద్వారా మొత్తం ఆదాయం రూ.2708 కోట్లకు చేరింది.

* నియోపొలిస్‌లో సగటు ఎకరా విలువ రూ.142.83 కోట్లకు పెరగడం హైదరాబాద్ భూ మార్కెట్‌లో అత్యంత వేగంగా నమోదవుతున్న పెరుగుదలగా పరిశ్రమ వర్గాలు అభివర్ణిస్తున్నాయి. వరుసగా రెండు విడతల్లో రికార్డు స్థాయి ధరలు నమోదవడం, ఈ ప్రాంతాన్ని దేశవ్యాప్తంగా ప్రముఖ డెవలపర్లకు ప్రాధాన్య గమ్యస్థానంగా నిలబెట్టింది. డిసెంబర్ 03న నియోపొలిస్‌తో, డిసెంబర్ 5న గోల్డెన్ మైల్‌లో జరగనున్న తదుపరి ఈఆక్షన్‌లు కూడా భారీ ఆసక్తిని రాబట్టే అవకాశముందని హెచ్‌ఎండిఏ అధికారులు అంచనా వేస్తున్నారు.

### తదుపరి వేలంపై అంచనాలు..

* రెండు రౌండ్‌లలో అద్భుతమైన ఫలితాలు రావడంతో, త్వరలో జరగబోయే వేలంపై అంచనాలు భారీగా పెరిగాయి.

* డిసెంబర్ 3న నియోపొలిస్‌లో తదుపరి ఈ వేలం నిర్వహించనున్నారు.

* డిసెంబర్ 5న గోల్డెన్ మైల్‌లో ఈవేలం.

* ఈ వేలం కూడా డెవలప్‌మెంట్ వర్గం నుంచి అంతే బలమైన ఆసక్తిని ఆకర్షిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

### సర్పంచ్ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బిసిలు
# పోటీ చేసి సత్తా చాటాలి
### బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రస్తుతం జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో అన్ని జనరల్ స్థానాలలో బిసిలు పోటీ చేసి గెలిచి తమ సత్తా చాటాలని బిసి ఇంటలెక్చువల్స్ ఫోరమ్ చైర్మన్ టి.చిరంజీవులు(రిటైర్డ్ ఐఎఎస్) అన్నారు. ఆ దిశగా తెలంగాణ రాష్ట్రంలోని బిసి,ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ ప్రజలు కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో బిసిలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పి, ఇప్పుడు మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడం పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించలేదని ఆయన విమర్శించారు. 42 శాతం బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చి రాజ్యాంగ రక్షణ కల్పించిన తర్వాతనే ఎన్నికలు కల్పిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించి, అసెంబ్లీలో బిల్లులు ఆమోదించడంతో పాటు కేంద్ర ప్రభుత్వానికి కూడా పంపి ఆ బిల్లును చట్టంగా రూపొందించడానికి కనీస కార్యాచరణ చేపట్టలేదన్నారు. హైకోర్టు, నిధుల విడుదల సాకుగా చూపించి ఎన్నికలు నిర్వహిస్తామని సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలోని అనేక జిల్లాలలో బిసిలకు దక్కవలసిన కనీసం 22శాతం సర్పంచ్ సీట్లు కూడా దక్కకుండా కుట్రపూరితంగా తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న సర్పంచ్ ఎన్నికలు బిసిలకు రిజర్వేషన్లు అత్యంత తక్కువగా అమలవుతున్నాయని ఆవేద వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బిసిల జనాభా ప్రతి గ్రామంలో 50 శాతం పైనే ఉంటుందని, బిసిలకు రాజకీయ రిజర్వేషన్లలో జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ తమ సత్తా చాటుతూ సర్పంచులుగా గెలిచి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని టి.చిరంజీవులు పిలుపునిచ్చారు.

## చదరపు కిలోమీటర్లు
(మొదటి పేజీ తరువాయి)

ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. ఔటర్ లోపల, ఆనుకొని ఉన్న స్థానిక సంస్థల ప్రస్తుత పరిస్థితుల అంచనాకు సంబంధించిన సమాచారం (మ్యాపులు, జనాభా, వార్డులు, ఓటర్లు) పురపాలక శాఖ ఇప్పటికే సేకరించింది. ప్రస్తుత 650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో పోలిస్తే, మెగా జిహెచ్‌ఎంసి 2 వేల చదరపు కిలోమీటర్లకు పైగా ఉండనుంది. మెరుగైన పాలనా సౌలభ్యం కోసం ఒకే కార్పొరేషన్‌గా చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లుగా తెలుస్తోంది. ఆర్థిక వనరులు, మౌలిక సదుపాయాలు, జనాభాలో సమతుల్యత ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని భావిస్తున్నారు. ప్రస్తుత జిహెచ్‌ఎంసి పాలకమండలి గడువు వచ్చే ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఉంది. అలాగే అధికారులు న్యాయపరమైన అంశాల పరిశీలిస్తున్నారు. విలీన ప్రతిపాదనపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించే బాధ్యతను సిజిజి జిహెచ్‌ఎంసి అప్పగించింది. ప్రస్తుతం ఉన్న 30, కొత్తగా చేరే 27 సర్కిళ్లు కలిపి మొత్తం 57 సర్కిళ్లు ఆరు జోనల్ కార్యాలయాల కింద పని చేయనున్నాయి. రెండు నెలల య్యాక జోన్‌ల సంఖ్యను పెంచడంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. విశాల నగరంలో పరిపాలన ఎలా ఉండాలి. జోన్‌లు, సర్కిళ్ల సంఖ్య, ఏయే స్థాయిల్లో ఏ హోదా అధికారులు ఉండాలి, మొత్తం నగరానికి ఏ స్థాయిలో ఎంత మంది అధికారులు అవసరం, వారి అధికారాలు, కర్తవ్యాలు, ఇతరత్రా మార్గదర్శకాలతో సిజిజి త్వరలో నివేదిక ఇవ్వనుందని అధికారులు చెప్పారు.

### విలీన ఉత్తర్వులు అందగానే ఫైళ్ల స్వాధీనం..

జిహెచ్‌ఎంసిలో శివారు మున్సిపల్ సంస్థలకు సంబంధించిన ఉత్తర్వులు విడుదల కాగానే అధికారులు ఆయా మున్సిపాలిటీల్లో ఫైళ్లను స్వాధీనం చేసుకోనున్నారు. శివారు ప్రాంతాల జోన్‌లు, సర్కిళ్లకు విలీనం అయ్యే మున్సిపాలిటీల బాధ్యతలను అప్పగించనున్నారు. ఆర్థిక లావాదేవిలకు సంబంధించిన అంశాలను ఫ్రీజ్ చేస్తారు. పౌర సేవలను యథావిధిగా కొనసాగించనున్నారు. విలీన ప్రక్రియ కొలిక్కి వచ్చిన నిర్ణయాలు తీసుకోనున్నారు. గతంలో ఎంసిహెచ్‌లో విలీనం ఆదేశాలు రాగానే అప్పటి ఎంసిహెచ్ అధికారులు ఆయా మున్సిపాలిటీల్లోని కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఇంజనీరింగ్ పనులకు సంబంధించిన రికార్డులు, ఆస్తి పన్ను, చెక్కులు, నిధుల వ్యవహారాలకు సంబంధించిన పత్రాలన్నింటిని ఆధీనంలోకి తీసుకున్నారు. మున్సిపాలిటీ అధికారులు రెండు నెలలపాటు మునిపటిలాగే పౌరులకు సేవలందించాయి. అప్పటి వరకు ఎంసిహెచ్ పరిధికి ఓ కమిషనర్, ఏడు సర్కిళ్లకు ఏడుగురు ఉప కమిషనర్లు ఉండేవారు. విలీనం అనంతరం 12 మున్సిపాలిటీలను, 7 సర్కిళ్లను కలిపి 18 సర్కిళ్లుగా చేశారు. ఆ సర్కిళ్లపై పర్యవేక్షణకు ఐదు జోన్‌లు ఏర్పాటయ్యాయి. తర్వాత ఆరు జోన్‌లుగా, 30 సర్కిళ్లకు పెరిగాయి. నగర విస్తీర్ణం 172చదరపు కిలోమీటర్ల నుంచి 650 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. హైదరాబాద్, సికింద్రాబాద్ మున్సిపాలిటీల విలీనంతో 1955లో మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ (ఎంసిహెచ్) ఏర్పాటైంది. నాటి చట్టమే కాలానుగుణంగా సవరణలు జరుగుతూ ఇప్పటికీ అమలవుతోంది. 2007లో రంగారెడ్డి, మెదక్ జిల్లాల పరిధిలోని ఎల్.బి.నగర్, గడ్డిఅన్నారం, ఉప్పల్, మల్కాజిగిరి, కాప్రా, అల్వాల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, రామచంద్రాపురం, పటాన్‌చెరు మున్సిపాలిటీలను, పలు గ్రామాలను ఎంసిహెచ్‌లో విలీనం ద్వారా గ్రేటర్ హైదరాబాద్‌గా మహానగరపాలక సంస్థను ఏర్పాటు చేశారు.

## సిఎం ఆగ్రహం
(మొదటి పేజీ తరువాయి)

సమర్థంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పని చేయాలని సీఎం సూచించారు. ఈ క్రమంలో వరంగల్ కాళోజీ వర్సిటీ విసి రాజీనామా చేసినట్లు తెలిసింది. కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వీసీపై వచ్చిన ఆరోపణలపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేయగా రాజీనామా చేసినట్టు తెలిసింది. యూనివర్సిటీలో డబ్బులు తీసుకొని రీకౌంటింగ్ సో నలుగురికి మార్కులు కలిపారని విజిలెన్సు విచారణలో ప్రాథమికంగా తేలింది. నోటిఫికేషన్లు లేకుండా సిబ్బంది నియామకం అంశం, బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు గవర్నర్ కు ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వానికి మరక అంటొద్దనే ఉద్దేశంతో రాజీనామా చేసినట్టు తెలుస్తోంది.కాగా కాళోజీ వర్సిటీ వీసీ నందకుమార్ రెడ్డి రాజీనామా విషయం ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది.

# జనరల్
STATE & REGIONAL NEWS




## అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాడిన మహాత్మ జ్యోతిరావు

మంత్రి వాకిటి శ్రీహరి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సామాజిక సమానత్వానికి, విద్యా హక్కుకు, అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం పోరాడిన మహాత్మ జ్యోతిరావు పూలే సేవలను రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ కొనియాడారు. మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన నివాళులు అర్పించి, స్మరించుకున్నారు. పూలే వర్ధంతి సందర్భంగా మంత్రి ఒక ప్రకటనలో పూలే ఆలోచనలను నేటి సమాజానికి మార్గదర్శకమని అభివర్ణించారు. అణచివేతకు గురైన వర్గాలకు విద్య అనే అస్త్రాన్ని అందించి, వారి జీవితాలను వెలుగులోకి తీసుకువచ్చిన మహానుభావుడు పూలే అని అన్నారు. మహిళల విద్య, సామాజిక సంస్కరణల కోసం ఆయన చూపిన నిబద్ధత నేటికీ మనకు ప్రేరణ. సమానత్వం, న్యాయం అనే విలువలను స్థిరపరిచేందుకు ఆయన చేసిన కృషి భారత చరిత్రలో అజేయంగా నిలుస్తుందన్నారు.

## 4 లేబర్ కోడ్‌లను అమల్లోకి తేవటం
# తీవ్ర అన్యాయం

ఎఐటియుసి సీనియర్ నాయకులు వి.యస్.బోస్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** నరేంద్ర మోది ప్రభుత్వం కార్మికవర్గాన్ని మభ్యపెట్టి అసత్య ప్రచారాలతో 4 లేబర్ కోడ్‌లను అమల్లోకి తీసుకురావటం తీవ్ర అన్యాయమని ఎఐటియుసి సీనియర్ నాయకులు వి.యస్.బోస్ అనారు. హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో శుక్రవారం ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యం.డి. యూసుఫ్ అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లలో హైర్ అండ్ ఫైర్ సిస్టం స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ కార్మికులకు మంచి జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన అవసరం కార్మికవర్గానికి ఎంతైనా ఉందన్నారు. అసంఘటిత రంగ కార్మికులు యూనియన్ ఏర్పాటు చేసుకునే సందర్భంలో ట్రేడ్ యూనియనిస్టులను యూనియన్ నాయకులుగా ఎన్నుకోవటం ద్వారా కార్మికులకు చట్టాలను అమలు చేయించేందుకు అవకాశం ఉంటుందని, కానీ ప్రస్తుత కోడ్‌లలో ఆ నిబంధనలను తొలగించటం జరుగుతుందన్నారు. గతంలో 10 మంది కార్మికులుంటే చట్టాలు అమలు చేయాల్సివుండగా దానిని 20 మందికి పెంచటం, 100 మంది ఉంటే అమలయ్యే చట్టాలను 200 మందికి పెంచటం వలన పారిశ్రామికవర్గానికి ఎక్కువ లాభం చేకూర్చే అవకాశం ఉన్నదని తెలియజేశారు. ఎఐటియసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ మాట్లాడుతూ కార్మిక హక్కుల సాధన కోసం రాష్ట్రంలో ఉన్నటువంటి అన్ని రంగాల కార్మికులను సమీకరించి ఉద్యమాలు నిర్వహించాలని, రోజు రోజుకు కాంట్రాక్టు కార్మికుల సంఖ్య పెరుగుతూ వారి కనీస వేతనం మాత్రం చట్టం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల బేసిక్ వేతనం ఉండాల్సివుండగా దానిని అమలు చేయకపోవటం తీవ్ర అన్యాయమన్నారు. అసంఘటితరంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అడుగుతున్నప్పటికీ పట్టించుకోవటం లేదని మండిపడ్డారు. రానున్న రోజుల్లో కార్మికవర్గాన్ని చైతన్యం చేసి హక్కుల సాధనకై పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా పిలుపిచ్చారు. రాష్ట్రంలో ఉన్నటువంటి వివిధ స్కీంలలో వేలాది మంది ఉద్యోగులు కనీస వేతనానికి నోచుకోకుండా ఉన్నారని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఆటో కార్మికులకు రూ.12వేలు ఇవ్వాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల కనీస వేతనం చెల్లించాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ప్రైవేటీకరణను అరికట్టాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి యం.నర్సింహ్మా, రాష్ట్ర కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, బి.వెంకటేశం, ఎస్.విలాస్, ఎన్.కరుణ కుమారి, ఉపాధ్యక్షులు కె.ఏసురత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మారగోని ప్రవీణ్ కుమార్, కె.రవిచంద్రన్, గన్నారపు రమేష్, హాసీనాబేగం, జిల్లా కార్యదర్శులు కమ తం యాదగిరి, మేకల దాసు, బోగే ఉపేందర్, కడారి సునీల్, కడారి రాములు, శ్రీనివాస్, కిష్టాపురం లక్ష్మణ్, అజ్జ వేణు ప్రసంగించారు.

## ఇవిఎం తనిఖీ కోసం ఒక్క దరఖాస్తూ రాలేదు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల్లో వినియోగించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం (ఇవిఎం)లను తనిఖీ చేసి ధృవీకరించాలంటూ అర్హులైన అభ్యర్థుల నుంచి ఏ ఒక్క వ్రాతపూర్వక దరఖాస్తు కూడా అందలేదని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాల ప్రకటన అనంతరం అత్యధిక ఓట్లు పొందిన అభ్యర్థి తరువాత రెండో లేదా మూడో స్థానాల్లో నిలిచిన అభ్యర్థులు కోరిన పక్షంలో, మొత్తం ఇవిఎంలలో 5 శాతం వరకు బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివిపాట్‌లను తయారీ సంస్థల ఇంజినీర్ల బృందం ద్వారా తనిఖీ చేసి ధృవీకరించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఇందుకోసం ఫలితాల తేదీ నుంచి ఏడు రోజులలోపు వ్రాతపూర్వకంగా దరఖాస్తు చేయాల్సి ఉంటుందని వివరించారు. ఫలితాలు ప్రకటించిన 14వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఉన్న నిర్ణీత గడువు సమయంలో జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారికి ఎలాం టి దరఖాస్తులు రాకపోవడం స్పష్టమైందన్నారు. ఎన్నికల నిర్వహణ మొత్తం భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, విధి నియమాలు, భద్రతా ప్రమాణాల ప్రకారమే పూర్తిస్థాయిలో పారదర్శకంగా సాగిందని, ఈ వ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలపడేలా అన్ని చర్యలు తీసుకున్నామని సిఇఒ పేర్కొన్నారు.

## దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి

సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరహా దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టి, జానాభా దామాషా ప్రకారం అన్ని వర్గాల ప్రజలకు, అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ అన్నారు. 'మహాత్మ జ్యోతిభా పూలే 135వ వర్ధంతి' సందర్భంగా సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో అంబర్‌పేట, అలీ కేఫ్ వద్ద ఉన్న జ్యోతిభా పూలే విగ్రహానికి రామకృష్ణ శుక్రవారం పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా ప్రాతిపాదికన బిసిలకు విద్యా, ఉద్యోగ అవకాశాలను, చట్టసభలలో రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి ప్రత్యేక పార్లమెంటు సమావేశాన్ని ఏర్పాటు చేసి, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. దేశంలో సామాజిక పరిస్థితులలో కొనసాగుతున్న దోపిడి వర్గ ఆధిపత్యానికి వ్యతిరేకంగా అట్టడుగు వర్గాల ప్రజలకు సమానత్వ సాధన కోసం జ్యోతిభా పూలే పోరాటం చేశారని గుర్తు చేశారు. అంటరానితనం, సామాజిక వివక్ష భూస్వాముల ఆగడాలను, నిరసిస్తూ అవిశ్రాంతంగా ఉద్యమించారన్నారు. వేల సంవత్సరాలుగా విద్యకు దూరంగా ఉన్న వర్గాల ప్రయోజనాల కోసం అందరికీ విద్య అందించాలని ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం నియమించిన హంటర్ కమిషన్‌కు జ్యోతిభా పూలే నివేదికను సమర్పించారని వివరించారు. తన భార్య సావిత్రి బాయి పూలేకు చదువు నేర్పించి, ఆమె ద్వారా అనేక పాఠశాలలు నెలకొల్పి చదువుకు దూరంగా నెట్టబడిన ప్రజలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో పూలే కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి మారపాక అనిల్, సిపిఐ అంబర్ పేట్ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కాశన్న, ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీమాన్, సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆరుట్ల రాజ్ కుమార్, గ్యార నరేష్,అనిల్ కుమార్, ఎఐఎస్ఎఫ్ ఒయు అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పల ఉదయ్ కుమార్, లెనిన్, భవన నిర్మాణ కార్మికులు లింగ స్వామి, చెన్నేష్, నాగభూషణం, చెన్నయ్య, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ దీక్ష.. ఓ నాటకం

'దీక్ష దివస్' పేరుతో ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమవుతున్న బిఆర్ఎస్

రాజకీయ ఉనికి కోల్పోతుండడంతో మరో కొత్త డ్రామా

టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజకీయ ఉనికిని కోల్పోతున్న బిఆర్ఎస్ మరో కొత్త డ్రామాకు తెరదీసిందని, 'దీక్ష దివస్' పేరుతో ప్రజలను మోసం చేయడానికి బిఆర్ఎస్ సిద్ధమైందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్‌కుమార్ అన్నారు. బిఆర్ఎస్ బూటకపు మాటలను నమ్మవద్దని తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పరిపాలన, అభివృద్ధిపై చర్చకు సిద్ధమని ఆయన చెప్పారు. గాంధీభవన్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ 2009లో కెసిఆర్ చేసిన దీక్ష పూర్తిగా నాటకమని, కెసిఆర్ దీక్ష వల్ల తెలంగాణ రాష్ట్రం రాలేదని, విద్యార్థుల ఆత్మబలిదానాలకు స్పందించిన సోనియా గాంధీ వల్ల తెలంగాణ వచ్చిందన్నారు. 'రాష్ట్రం కోసం దీక్ష చేస్తున్నా' అని కెసిఆర్ ప్రకటించి నిమ్స్ ఆసుపత్రిలో ఫ్లూయిడ్స్ తీసుకున్నారని, ఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని, కెటిఆర్ ఒక్కసారి వాటిని చదవాలని సూచించారు. తెలంగాణ అమరుల శవాలపై కెసిఆర్ అధికారం అనుభవించారన్నారు. బిఆర్ఎస్ నేతలకు చిత్తశుద్ధి ఉంటే ముందుగా ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరులకు నివాళులు అర్పించాలన్నారు. నిజమైన దీక్షకు మయన్మార్ ఐరన్ లేడీ ఇరోమ్ షర్మిలా 16 ఏళ్ల నిరాహార దీక్షే ఉదాహరణ అని, షర్మిల దీక్షకు కెసిఆర్ దీక్షకు 'నక్కకు నాగలోకానికి' ఉన్న తేడా ఉందని ఆయన పేర్కొన్నారు. బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్ బయటికి వస్తే ప్రజలు అసహించుకునే పరిస్థితి ఏర్పడిందని, బిఆర్ఎస్ ముగిసిన శకం అని కెసిఆర్ స్వయంగా అర్థం చేసుకున్నారన్నారు. ప్రజా సెంటిమెంట్‌ను రాజకీయ లాభం కోసం వాడుకుని కెసిఆర్ కుటుంబమే లబ్ధి పొందిందన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత అవాంఛనీయ ఘటనలు జరగకుండా కాపాడిన అప్పటి సిఎం కిరణ్ కుమార్ రెడ్డి రాజకీయ చాణక్యమని ఆయన గుర్తు చేశారు. ఉద్యమంలో పాల్గొన్న పేదలు, విద్యార్థులు, ఎస్‌సిలు, ఎస్‌టిలు ఆత్మత్యాగం చేసుకున్నారని, వారి త్యాగాల వల్ల వచ్చిన రాష్ట్రాన్ని కెసిఆర్ కుటుంబం పదేళ్లు దోచుకుందన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల మాదిరిగానే స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓడిపోవడం ఖాయమన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని, బిసి రిజర్వేషన్లపై ప్రతిపక్ష బిఆర్ఎస్, బిజెపి ప్రజా ప్రతినిధులను నిలదీయాలని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు.

## లక్ష్మణ్ అప్పటికి పుట్టలేదు

టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాహుల్ గాంధీ ఇంట్లో మూడు ఎంపి సీట్లు అవసరమా అని బిజెపి ఎంపి, ఒబిసి ఛైర్మన్ లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలపై జగ్గారెడ్డి మండి పడ్డారు. ఈ మేరకు గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర చరిత్ర లక్ష్మణ్‌కు తెలియదని అప్పగికి ఆయన పుట్టలేదని జగ్గారెడ్డి విమర్శించారు. స్వాతంత్ర ఉద్యమంలో దేశానికీ రాహుల్ గాంధీ కుటుంబం ఆస్తులు ఇచ్చిందన్నారు. ఈ ధైర్యం మీ దగ్గర ఉందా..? అని లక్ష్మణ్‌ను సూటిగా ప్రశ్నించారు. నెహ్రూ ప్రధాని అయ్యాక దేశ ప్రజలు కడుపు నిండా తిండి పెట్టాలని..వ్యవసాయం అభివృద్ధి గురించి ఆలోచించారని గుర్తు చేశారు. దేశంలో ఎఫ్‌సిఐ ఏర్పాటు చేసి... కరువు వచ్చినా పేదలకు నెహ్రూ అన్నం పెట్టే ఆలోచన చేశారన్నారు. దేశ స్వతం త్ర ఉద్యమంలో కానీ... దేశ నిర్మాణం లో కానీ మోదీ.. అమిత్ షా పాత్ర ఏమైనా ఉందా..? అని నిలదీశారు. ఇందిరాగాంధీ దేశంలో ఉన్న పెత్తందారు భూము లు పేదలకు పంచిందన్నారు. పల్లెలకు బ్యాంకులను తెవడమేగాక ఐడిపిఎల్ బిడిఎల్ లాంటి కంపెనీలు తెచ్చింది కాంగ్రెస్ అని తెలిపారు. ఎక్కడైనా బిజెపి ఇలాంటి కంపెనీలు తెచ్చింది అని చెప్పగలుగుతారా.? ఆ ధైర్యం మీకు ఉందా అని నిలదీశారు. రాజీవ్ గాంధీ ప్రధాని అయ్యక 18 ఏండ్లకే ఓటు హక్క ఇచ్చారన్నారు. దేశంలో ఐటి అభివృద్ధికి రాజీవ్‌గాంధీ ఆలోచనలే కారణమన్నారు. హైటెక్ సిటీ డిజైన్ అంతా రాజీవ్ గాంధీ టెక్నాలజీ నుండే తెచ్చారన్నారు. కర్ణాటక, హైదరాబాద్‌లో ఐటి టెక్నాలజీ ఇలా ఉంది అంటే రాజీవ్ గాంధీ వల్లనే సాధ్యమైందన్నారు. ఇలాంటి అభివృద్ధి బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఉందా..? సర్దార్ పటేల్, నెహ్రూ కేబినెట్‌లో హోంమంత్రిగా పనిచేశారని గుర్తు చేశారు. బిజెపి వాళ్ళు పటేల్ మా వాడు అని చెప్పుకోవడంలో అర్థం లేదన్నారు. నోరుంది అని మాట్లాడితే ఎట్లా..? మీ అమ్మని.. నాన్నను అడుగు గాంధీ కుటుంబం గురించి చెబుతారని అని అన్నారు. కాంగ్రెస్ పుట్టింది 140 ఏండ్ల క్రితం, మీ పార్టీ పుట్టింది 40 ఏండ్ల క్రితం అని అన్నారు. మీ చరిత్రకు.. మా పార్టీ చరిత్రకు తేడా లేదా..? అని అన్నారు.

# భవిష్యత్ ప్రగతికి విద్య ప్రామాణికం

బిసి సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి సంక్షేమ శాఖలో భవిష్యత్ ప్రగతికి విద్య ప్రామాణికమని, దానికి ప్రథమ ప్రాధాన్యత కల్పించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా తెలంగాణ రైజింగ్ 2047 పాలసీలో భాగంగా గ్లోబల్ సమ్మిట్‌లో బిసి సంక్షేమ శాఖలో తీసుకోవాల్సిన అంశాలపై శుక్రవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో బిసి సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ జనాభాలో వెనుకబడిన తరగతులు 56 శాతం ఉన్నారని, వ్యవసాయం, చేతివృత్తులు, నైపుణ్యాలు, సాంప్రదాయ వృత్తులకు వెన్నెముకగా నిలుస్తున్నారని, వారి సామాజిక ఆర్థిక పురోగతి రాష్ట్రాభివృద్ధికి కీలకమైనదని వెల్లడించారు. విజన్ 2047లో బిసిలు విద్యాపరంగా బలంగా, ఆర్థికంగా స్వతంత్రంగా, సామాజికంగా సాధికారత సాధించి, ఆవిష్కరణ, నైపుణ్యాభివృద్ధితో పాటు రాష్ట్రాభివృద్ధికి చోదకంగా ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వాన్ని ఎదుర్కొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్య, మానవ మూలధనం నిరంతరాయంగా నాణ్యమైన అభ్యాసం ద్వారా విద్యా ప్రమాణాలను బలోపేతం చేయడం, మెరుగుపరచడం, రెసిడెన్షియల్ సంస్థలతో పాటు హాస్టళ్లను అత్యుత్తమ కేంద్రాలుగా అభివృద్ధి చేయాలన్నారు. ఉన్నత పాఠశాల నుండే ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, వ్యవస్థాపకతను పరిచయం చేయాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్‌లో చర్చించి రైజింగ్ తెలంగాణ విజన్ 2047లో పలు కీలక అంశాలు చేర్చనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో బిసి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, గురుకుల సెక్రటరీ సైదులు, బిసి సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ అలోక్‌కుమార్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర డాక్టర్ సెల్ కమిటీలను ప్రకటించిన టిపిసిసి చీఫ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర డాక్టర్ సెల్ కమిటీలను పిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి మహేష్‌కుమార్ గౌడ్ శుక్రవారం ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర వైస్ చైర్మన్, జనరల్ సెక్రటరీలతో పాటు ఐదు జిల్లాల చైర్మన్లతో పాటు కీలక పదవులకు సంబంధించిన నియామక పత్రాలను ఆయన అందచేశారు. మిగతా జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీల నియామకాలను కూడా త్వరలో ప్రకటించనున్నట్లు పిసిసి డాక్టర్ సెల్ చైర్మన్ డాక్టర్ రాజీవ్ తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్‌గౌడ్ గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఏళ్ల తరబడి బీద ప్రజలకు సేవలు అందిస్తున్న డాక్టర్స్‌కి శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్‌లకు సమాజంలో ప్రత్యేక స్థానం ఉందని, తాను కూడా డాక్టర్ కావాలని అనుకున్నానని, పరిస్థితుల వల్ల కాలేకపోయానని తెలిపారు. నేటి సమాజంలో డాక్టర్ చదువుకున్న వాళ్ళు రాజకీయాల్లోకి వస్తే క్వాలిటీ డెవలప్మెంట్ తయారవుతుందన్నారు.

మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఒక రూపాయి డాక్టర్‌గా ఫేమస్ అయ్యారని తెలిపారు. డాక్టర్ల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి వైద్యులు ప్రభుత్వానికి సూచనలు సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు. రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాజీవ్ మాట్లాడుతూ మెడికల్, హెల్త్ విభాగం కమిటీల నియామకాలు, ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసే దిశలో ఒక మంచి నిర్ణయమని, వైద్య రంగంలో నిర్మాణాత్మక ఆలోచనలతో పనిచేయడానికి అవకాశమిచ్చినందుకు కాంగ్రెస్ పార్టీకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## జిహెచ్‌ఎంసిలో మున్సిపల్ సంస్థలు విలీనం చేయొద్దు

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన జిహెచ్‌ఎంసి పరిధి విస్తరణ నిర్ణయాన్ని బిజెపి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు వెల్లడించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓఆర్ఆర్) పరిధిలోని 27 మున్సిపల్ సంస్థలను జిహెచ్‌ఎంసిలో విలీనం చేసి మహానగరంగా మార్చాలనే ప్రభుత్వ నిర్ణయం ప్రజలకు నష్టం చేకూరుస్తుందన్నారు. విలీనం తర్వాత జిహెచ్‌ఎంసి పరిధిలోని జనాభా 1.70 కోట్ల నుంచి 2 కోట్లకు పైగా పెరుగుతుందని, ఇంత పెద్ద జనాభాకు అవసరమైన సదుపాయాలను అందించే సామర్థ్యం ప్రస్తుతం జిహెచ్‌ఎంసికి లేదన్నారు. గ్రామీణ ప్రాంతాలు, మున్సిపాలిటీల ప్రజలపై పన్నుల భారం మరింత పెరగనుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మున్సిపాలిటీల్లో అపరిశుభ్రత, అధ్వాన్నమైన రోడ్లు, డ్రైనేజీ సమస్యలు వంటి అనేక సమస్యలు ఉన్నాయని, నిధుల కొరతతో జిహెచ్‌ఎంసి సైతం సతమతమవుతున్నందున, విలీనం చేస్తే అభివృద్ధి ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా, అశాస్త్రీయంగా ఈ నిర్ణయం తీసుకుందని రాంచందర్ రావు విమర్శించారు. హిల్ట్ పాలసీని తీసుకువచ్చి 9 వేల ఎకరాలకు పైగా భూములను రియల్ ఎస్టేట్ మాఫియాకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. హైడ్రా, హిల్ట్ పాలసీ, ఇప్పుడు జిహెచ్‌ఎంసిలో విలీనం వంటి నిర్ణయాలన్ని ప్రజలకు నష్టమేనని అన్నారు. ఈ నిర్ణయాలను కాంగ్రెస్ వెనక్కు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిజెపి ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమురయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, నగర మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి, మీడియా ఇన్‌చార్జ్ ఎన్.వి.సుభాష్, మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్, బిజెపి జిహెచ్‌ఎంసి ఫ్లోర్ లీడర్ శంకర్ యాదవ్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు రాధా ధీరజ్ రెడ్డి పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి డిసెంబర్ 3న మహాధర్నా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని, కాలయాపాన్ని నిరసిస్తూ డిసెంబర్ 3న హైదరాబాద్‌లోని సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్టు తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యుజె) అధ్యక్షుడు కె.విరాహత్ అలీ తెలిపారు. 'టియుడబ్ల్యుజె మహాధర్నా' కరపత్రాన్ని హైదరాబాద్‌లోని సచివాలయ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐజెయు నాయకులు ఎం.ఎ మాజీద్, టియుడబ్ల్యుజె ఉప ప్రధాన కార్యదర్శి రాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కిరణ్ కుమార్, కె.నరహరి, హెచ్‌యుజె అధ్యక్షుడు శిగ శంకర్‌గౌడ్, టియుడబ్ల్యుజె నాయకులు శ్రీకాంత్ రెడ్డి, జి.బాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.విరాహత్ అలీ మాట్లాడుతూ అక్రిడిటేషన్ పాలసీని వెంటనే ప్రకటించి, కొత్త కార్డులను జారీ చేయాలని, ఆరోగ్య బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని, వృత్తి కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలని, సంక్షోభంలో ఉన్న చిన్న,మధ్య తరహా పత్రికలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల జీవితాల్లో చీకటి తొలగి, వెలుగులు నిండుతాయని కలలు కన్నారని, కానీ గత టిఆర్ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఆశించిన స్థాయిలో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టలేదని, ప్రవేశపెట్టిన పథకాలను కూడా సక్రమంగా అమలు చేయలేదని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ఎపియుడబ్ల్యుజె సాధించిన, అప్పటి ప్రభుత్వాలు అమలు చేసిన సౌకర్యాలను, తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయకపోవడం విచారకరమని అన్నారు. గత ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలపైన సానుకూలంగా స్పందించలేదని, ప్రస్తుతం అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ తమ మ్యానిఫెస్టోలో కూడా జర్నలిస్టుల కోసం స్పష్టమైన హామీలను పొందుపర్చినట్టు ఆయన గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో రాష్ట్రంలో జర్నలిస్టుల కోసం ఏర్పాటు చేసిన హై పవర్, సంక్షేమ కమిటీలు ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో లేదన్నారు. వేతన పర్యవేక్షించేందుకు త్రైపాక్షిక కమిటీ కూడా ప్రస్తుతం మాయమైందని తెలిపారు. తెలంగాణ జర్నలిస్టులను ఎందుకు విస్మరిస్తున్నారని ఆయన ప్రశ్నించారు.



మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గాంధీ భవన్‌లో ఆ మహనీయుని చిత్ర పటానికి నివాళులు అర్పించిన టిపిసిసిఅధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ కుమార్ రావు, డిసిసి అధ్యక్షుడు కైలాష్ నేత, అధికార ప్రతినిధి లింగం యాదవ్ తదితరులు


HYDERABAD

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఇఇ, సర్కిల్-30, బేగంపేట్, సికింద్రాబాద్ జోన్.

ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన

నోటీసు నెం. 14/EOI/EE-30/SD Z/GHMC/2025-2026, తేదీ: 28.11.2025

| క్ర. సం. | క్రింద పేర్కొన్న పని కోసం తయారీదారులు, ఫ్యాబ్రికేటర్లు, అధీకృత డీలర్లు / ఏజెన్సీలు మొదలైన వారి నుండి EOI లను ఆహ్వానిస్తున్నాము | డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ & సమయం / డాక్యుమెంట్ దాఖలుకు ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|
| 1 | "పాత పాటిగడ్డ వద్ద జిహెచ్‌ఎంసి మల్టీపర్పస్ ఫంక్షనల్ హాల్ కోసం 544/600 కిలోల సామర్థ్యం గల ఎలెవేటర్ (లిఫ్ట్) వ్యవస్థ సంస్థాపన, సరఫరా మరియు డెలివరీ, జి ప్లస్ 2, 3 స్టాప్‌లు మరియు 3 ఓపెనింగ్‌లు(2వ రీకాల్)" కోసం ఆసక్తి వ్యక్తీకరణ (EOI) ఆహ్వానించబడింది. | EOI ప్రారంభ తేదీ & సమయం: 29.11.2025న మ. 12.00గం.ల నుండి, దాఖలుకు ఆఖరి తేదీ & సమయం: 03.12.2025న మ.12.00గం.ల వరకు | EOI ని ఒ/ఒ. ఇ.ఇ., సర్కిల్-30, జిహెచ్‌ఎంసి, సికింద్రాబాద్‌లో 03.12.2025న మ.12.00గం.లకు లేదా అంతకు ముందు సమర్పించవచ్చు. |

సంప్రదించవలసిన అధికారి చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-30 మరియు హెడ్ డ్రాఫ్ట్‌మెన్, సర్కిల్-30, సికింద్రాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి. పైన పేర్కొన్న పనికి సంబంధించిన మరిన్ని వివరాలను జిహెచ్‌ఎంసి వెబ్‌సైట్ https://www.ghmc.gov.in/Tenderspage.aspx నుండి పొందవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-30, బేగంపేట్.

DIPR R.O. No. : 11485-PP/CL/ADVT/1/2025-26, Date: 28-11-2025



# జనరల్

STATE & REGIONAL NEWS

## ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు పురుగులు లేని భోజనం పెట్టాలి

మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటర్‌నేషనల్ స్కూల్స్ అని డబ్బా కొట్టుకునే సిఎం రేవంత్ రెడ్డి ముందుగా ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు పురుగులు లేని భోజనం పెట్టాలని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సూచించారు. విద్యార్థులకు కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామని బెదిరించారని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో స్కీములు లేవని, ఎందులో చూసినా స్కాములేనని ఆరోపించారు. కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లలకు పురుగుల అన్నం పెట్టిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హరీశ్ రావు డిమాండ్ చేశారు.



## యుపిఎస్‌సి-ఇపిఎఫ్‌ఒ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా రెవెన్యూ అధికారి వెంకటచారి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యుపిఎస్ ఇపిఎఫ్‌ఒ పరీక్షను ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఈ. వెంకటాచారి సూచించారు. సరోజినీ నాయుడు వనితా మహా విద్యాలయంలోని శంకర్‌జి హాల్లో పరీక్షా నిర్వహణపై శుక్రవారం జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్ష ఈనెల 30న ఆదివారం ఉదయం 9.30 నుండి 11.30 గంటల వరకు జరగనుందని తెలిపారు. ఇందుకు హైదరాబాద్ జిల్లా పరిధిలో 48 ఉపకేంద్రాలు కేటాయించగా, మొత్తం 20,145 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని చెప్పారు. ఒక కేంద్రంలో 119 మంది వికలాంగ అభ్యర్థులు హాజరుకానుండగా, వారికి యుపిఎస్‌సి నిబంధనల ప్రకారం స్క్రైబ్ సౌకర్యం, అదనపు పరీక్ష సమయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. అభ్యర్థుల గుర్తింపునకు యుపిఎస్‌సి ఆన్‌లైన్ ఫేషియల్ రికగ్నిషన్ వ్యవస్థను ప్రవేశపెట్టిందన్నారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి 30 నిమిషాల ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఈఅడ్మిట్ కార్డ్‌తో ఉన్న సూచనలను తప్పనిసరిగా పాటించాలని, అడ్మిట్ కార్డ్ గుర్తింపు పత్రం, పెన్, పెన్సిల్, ఫొటోలు మాత్రమే అనుమతించబడతాయని స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, పుస్తకాలు, బ్యాగులకు అనుమతి లేదని తెలిపారు. వివిధ శాఖలకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

## మహిళా సమాఖ్య పథకంతో ఆర్‌టిసిపై అదనపు భారం

ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా సమాఖ్య బస్సుల పేరుతో ఆర్‌టిసిపై అదనపు భారం మోపడం సరికాదని ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరావు అన్నారు. మహిళ సమాఖ్యలు బ్యాంకుల నుండి రూ.30 లక్షల ఋణం తీసుకొని మొత్తం రూ. 36 లక్షలతో (30+6) బస్సులు కొనుగోలు చేసి ఆర్‌టిసికి అద్దెకు ఇవ్వడం, ఆర్‌టిసి 15 శాతం వడ్డీ రూపంలో మరల సమాఖ్యకు నెలవారీ ఇఎంఐలు సుమారు రూ. 70 వేలు చెల్లించాలనే ఆదేశాలు ఇవ్వడం అనుచితమని, ఆర్‌టిసిపై అక్రమ భారం మోపడం తగదన్నారు. బ్యాంకులు 9 శాతానికి ఋణాలు ఇస్తుంటే 15 శాతం వడ్డీ కట్టమని ఆదేశాలివ్వడం దారుణమని మండిపడ్డారు. డ్రైవర్, కండక్టర్, మెకానిక్‌ల వేతనాలు, నిర్వహణ ఖర్చుతో పాటు డిజిల్ వ్యయాన్ని కూడా భరిస్తూ, 15శాతం వడ్డీతో ఇఎంఐలు చెల్లించాలనే ఆదేశాలు ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు. ప్రభుత్వమే ఆ వ్యయాన్ని భరించడంతో పాటు ప్రభుత్వ పూచికత్తు పై కనీసం 1500 బస్సులు సమాకూర్చాలని ఎం.నాగేశ్వరావు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



## మనువాదం, అసమానతలకు వ్యతిరేకంగా... పూలే పోరాటం

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మనువాదం, అసమానతలకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన మహాయోధుడు జోతిబా పూలే అని, ఆయన ఆశయ సాధన కృషిలో భాగంగా సామాజిక, న్యాయ పోరాటాల్లో సమైక్యంగా పాల్గొనాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద జ్యోతిభా పూలే 135వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి శుక్రవారం పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ సామాజిక మార్పునకు చదువు మార్గంగా ఏర్పడిందన్నారు. జ్యోతిభా పూలే భార్య సావిత్రిబాయి పూలే టీచర్‌గా విద్యావ్యాప్తి చేశారని కొనియాడారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని శాసనసభ ద్వారా అన్ని రాజకీయ పార్టీలు బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపిస్తే, దీనిని ఆమోదించకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డుపడుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి అబ్బాస్, టి.సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్ బాబు, వివిధ ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు కోట రమేష్, భూపతి వెంకటేశ్వర్లు, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## రాజ్యాంగ స్ఫూర్తిపై అవగాహనకు రేపు 5కె రన్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాజ్యాంగ స్ఫూర్తిపై అవగాహన కల్పించే విధంగా ఈ నెల 30న ఉదయం 5 గంటలకు హైదరాబాద్ నెక్లెస్ రోడ్డు నుంచి సంజీవయ్య పార్కు వరకు సంవిదాన్ శక్తి 5కె రన్‌ను నిర్వహించనున్నట్టు ఏక్ నయీ దిశ ఫౌండేషన్ అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది మోక్ష కల్యాణ్ రామ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 5కె రన్‌కు సంబంధించినబ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. కళ్యాణ్ రామ్ మాట్లాడుతూ ఏక్ నయీ దిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ 5కె రన్‌కు ముఖ్యఅతిథులుగా జస్టిస్ నాగేశ్, భీమపాకం, జస్టిస్ చలపతిరావు, సైబర్ క్రైమ్ డిసిపి సైదులు హాజరవుతారని తెలిపారు. ఆరోగ్యంకోసం ఇలాంటి రన్స్ నిర్వహిస్తున్న కాలంలో తము వినూత్నంగా దేశం కొరకు బాధ్యతగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. రన్నర్స్‌గా నిలిచిన వారికి టీ షర్ట్‌తోపాటు మెడల్‌తో సత్కరిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు eknayeedisha.comలో శనివారం రాత్రి వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు.




# అవినీతికి పాల్పడుతున్న ఎస్‌ఐలు

అధికారుల పర్యవేక్షణ లోపం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పోలీసింగ్ వ్యవస్థలో కొందరు ఎస్‌ఐలు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఎస్‌ఐల అవినీతి ఉదంతాలు వరుసగా వెలుగు చూడడం ఉన్నతాధికారులను దిగ్భ్రాంతికి గురిచేస్తుంది. పక్షం రోజుల వ్యవధిలోనే రాష్ట్రంలో వివిధ కారాణాల వల్ల సస్పెండ్‌కు గురైన ఎస్‌ఐలే ఇందుకు నిదర్శనం. ఎస్‌ఐల అవినీతి వరుస ఘటనలపై అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని, అధికారుల నిర్లక్ష్యం ప్రధాన కారణమని పలువురు సీనియర్ అధికారులు అంగీకరిస్తున్నారు. సిఐ, డిఎస్‌పి, అదనపు ఎస్‌పి, జోన్‌ల డిసిపిలు ఇక నుంచి తరచు ఎస్‌ఐల పనితీరును పరిశీలించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల కొన్ని జిల్లాల్లో ఎస్‌లు వసూళ్లు, డబ్బుల కోసం కేసులు తారుమారు చేయడం, పలుకుబడిన వ్యక్తుల సూచనల మేరకు వ్యవహారించడం వంటి, కేసుల్లోంచి నిందితుల పేర్లు అక్రమంగా తొలగించడం వంటివి వెలుగు చూడడం ఎస్‌ఐల అవినీతిపై విస్తృత చర్చకు కారణమయ్యాయి. ఎస్‌ఐలపై తరచు బాధితుల ఫిర్యాదులు పెరుగుతున్నా, పై స్థాయి విచారణలు, వారిపై క్రమశిక్షణ చర్యలు చాలా అరుదుగానే జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవినీతిమయమైన చర్యలు ప్రజల్లో పోలీసు శాఖపై నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయి. న్యాయం కోసం స్టేషన్‌కు వెళ్లిన సామాన్యుడికి ఉన్నతాధికారులు స్టేషన్‌లపై రెగ్యులర్ సడెన్ ఇన్స్పెక్షన్లు, ఫిర్యాదులపై తక్షణ విచారణ, డిజిటల్ మానిటరింగ్ బలోపేతం, అవినీతి ఆరోపణలకు పాల్పడిన వారికి కఠిన చర్యలు, వీటిని కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. అవినీతికి పాల్పడుతున్న కొంతమంది అధికారుల వల్ల మొత్తం పోలీస్ వ్యవస్థకు మచ్చ అంటుతోందనే వాదన వినిపిస్తుంది. జిల్లాల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న కొంతమంది ఎస్‌ఐలు వసూళ్లు, అక్రమ సెటిల్‌మెంట్లు, రాజకీయ నేతల ఒత్తిళ్లకు లోనై వ్యవహారించడంపై పెరుగుతున్న ఆరోపణలు పోలీసు శాఖను ఇబ్బందుల్లో పడేస్తున్నాయి.

వీరిపై పర్యవేక్షణ చేయాల్సిన సిఐలు, డిఎస్‌పిలు ఎస్‌ఐల అవినీతిపై పర్యవేక్షణ నిజంగా ఉంటే ఇలాంటి దుస్థితి రాదు' అని. అయితే పై అధికారులు మాత్రం కార్యనిర్వహణ భారం ఎక్కువగా ఉండటమే తాము ప్రతి అంశాన్ని చూసుకోలేకపోవడానికి కారణమంటూ కొత్త వాదనలు వినిపిస్తున్నారు. పోలీస్ మాన్యువల్ ప్రకారం సిఐ నుంచి డిఎస్‌పి వరకు ఉన్న వారు ప్రతి స్టేషన్ పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ చేయాలి. సమాజ శ్రేయస్సు కోసం పనిచేయాలసిన పోలీస్ అధికారులు అవినీతి ఆరోపణలతో తరచూ వెలుగులోకి రావడంతో ప్రజల్లో పోలీస్ వ్యవస్థపై సందేహాలు పెరుగుతున్నాయి. వ్యవస్థ పరమైన సంస్కరణలు, పై అధికారుల మానిటరింగ్ వ్యవస్థ బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. అదే సమయంలో పోలీస్ శాఖలో ఉన్న నిజాయితీ గల అధికారుల ప్రతిష్ఠ కూడా కొంతమంది అవినీతిపరుల వల్ల దెబ్బతింటోందని పలువురు పౌర సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

**టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ సస్పెన్షన్**

హైదరాబాద్ సిసిఎస్‌లో నమోదైన రూ.23 కోట్ల చీటింగ్ కేసులో కర్నాటకలో ఉన్న నిందితులైన దంపతులు వుప్పలపాటి సతీష్, శిల్ప బండలను టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ అదుపులోకి తీసుకున్నాడు. ఆ తరువాత నిందితులతో రూ.2 కోట్లు బేరం మాట్లాడుకుని దారి మధ్యలో వారిని వదిలివేశాడు. ఈ ఉదంతంపై ఉన్నతాధికారులకు శ్రీకాంత్‌గౌడ్ తప్పుడు నివేదిక ఇచ్చారు. దీంతో అతన్ని కమిషనర్ సజ్జనార్ సస్పెండ్ చేశారు.

**రికవరీ బంగారాన్ని అమ్ముకున్న ఎస్‌ఐ**

అంబర్‌పేట పోలీసు స్టేషన్‌లో క్రైమ్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న 2020 బ్యాచ్‌కు చెందిన వి.భానుప్రకాష్ చోరీ కేసులో రికవరీ చేసిన ఐదు తులాల బంగారు ఆభరణాలను అమ్ముకుని సొంతానికి వాడుకున్నాడు. ఈ విషయంపై ఉన్నతాధికారులు దర్యాప్తు చేస్తుండగా అతని సర్వీస్ రివాల్వార్ కూడా మాయం అయ్యిందని తేలింది. ఇప్పటి వరకు ఈ రివాల్వార్ ఆచూకీ లభించలేదు. సదరు ఎస్‌ఐని కూడా కమిషనర్ సస్పెండ్ చేశారు.



## గోవా టూ హైదరాబాద్ ఒజి కుష్ గంజాయి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గోవా నుంచి హైదరాబాద్‌కు సరఫరా అవుతున్న ఒజి కుష్ గంజాయి మత్తు మందు రవాణా గుట్టును ఎక్సైజ్ పోలీసులు రట్టు చేశారు. ఈ మేరకు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి అతని నుంచి 50 గ్రాముల ఒజి కుష్‌ను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయ. గోవాకు చెందిన యష్ అనే వ్యక్తి తరచు హైదరాబాద్‌కు ఒజి కుష్ గంజాయిని సరఫరా చేస్తున్నాడు. హైదరాబాద్‌లో ఈ ఒజి కుష్ గంజాయిని జీవన్ రెడ్డి విక్రయిస్తుంటాడు. ఈ మేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్‌టిఎఫ్ బి టీం సిఐ బిక్షారెడ్డి, ఎస్‌ఐ బాలరాజులు జీవన్‌రెడ్డి నివాసంపై దాడి చేయగా అతని వద్ద 50 గ్రాముల ఒజి కుష్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అమ్మకాలు జరుపుతున్న జీవన్‌రెడ్డితోపాటు రెగ్యులర్‌గా గంజాయి కొనుగోలు చేస్తున్న ఇద్దరిని కూడ అరెస్టు చేశారు. గోవా నుంచి ఒజి కుష్ ఒక గ్రాములకు రూ. వేయికి జీవన్‌రెడ్డి కొనుగోలు చేస్తాడు. గంజాయి కొనుగోలు చేసే వారికి ఒక గ్రాముకు రూ. 2000 నుంచి రూ. 2500 అమ్మకాలు జరుపుతు లాభాలు గడిస్తున్న జీవన్‌రెడ్డితో పాటు రుషిక్, ఉదయ్‌లను అరెస్టు చేశారు. ఈ కేసులో గోవా నుంచి గంజాయి సరఫరా చేస్తున్న యష్‌తోపాటు ఉత్తమ సింగ్, మహేశ్వర్‌లపై కేసు నమోదు చేశారు. ఈ ముగ్గురు పరారీలో ఉన్నారని తెలిపారు. అరెస్టు చేసిన గంజాయి నిందితులను ఘట్కేసర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.



## గంజాయి కేసులో నలుగురికి పదేళ్ల జైలు శిక్ష

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గంజాయి అక్రమ రవాణా చేసిన నలుగురు నిందితులకు సంగారెడిడ ఫస్ట్‌క్లాస్ అడిషనల్ సెషన్ కోర్టు న్యాయమూర్తి జయంతి పదేళ్ల జైల్ల శిక్షతో పాటు రూ.లక్ష చొప్పున జరిమానా విధించారని మెదక్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జె.హరికిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2021 ఫిబ్రవరిలో 102 కేజీల గంజాయిని అక్రమంగా రవాణ చేస్తు ఉండగా జహీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ హెచ్‌ఏ మోహన్‌కుమార్ రమేష్ రెడ్డి గంజాయిని పట్టు కున్నారు. ఈ కేసును జహీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఎస్‌ఐ ఎం.టి కుమార్ కేసు నమోదు చేశారని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ఈ కేసులో సంగారెడ్డి జిల్లా కోర్టులో వాదనలు విన్న న్యాయమూర్తి జయంతి, నిందితులైన రాథోడ్ మోహన్, రాథోడ్ వెంకట్, కేతావత్ పాండు నాయక్, రాథోడ్ మోతిరాంలకు పది సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.లక్ష చొప్పున జరిమాన విధించారు. గంజాయి నిందితులకు శిక్షలు పడేవిధంగా చర్యలు చేపట్టిన ఎక్సైజ్ సిబ్బంది డిప్యూటి కమిషనర్ హరి కిషన్ అభినందించారు.

## హైదరాబాద్ మెట్రో స్టేషన్‌లో 'టక్కీట్' స్మార్ట్ లాకర్లు ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రో రైల్ ప్రయాణికులకు టక్కీట్ స్మార్ట్ లాకర్ల విధానాన్ని ప్రారంభించారు. ఎల్,టిఎంఆర్‌హెచ్‌ఎల్ టక్కిట్ భాగస్వామ్యంతో మెట్రో స్టేసన్లలో స్మార్ట్ , సురక్షితమైన సోరేజ్‌ను ప్రవేశపెట్టారు. ల్మెట్లు, సామాగ్రి, షాపింగ్ బ్యాగులు తదితర వ్యక్తిగత వస్తువులను సురక్షితంగా భద్రపర్చాలనే ఉద్దేశంతో ఈ సౌకర్యాన్ని కల్పించారు. ఎల్ అండ్ టి మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ (ఎల్,టిఎంఆర్‌హెచ్‌ఎల్) టక్కీట్ భాగస్వామ్యంతో హైదరాబాద్ నగరంలోని ఏడు హైదరాబాద్ మెట్రో స్టేషన్లలో 'ఆన్‌డిమాండ్ స్మార్ట్ స్టోరేజ్' లాకర్ల సౌకర్యాన్ని ప్రారంభించింది. మియాపూర్, అమీర్‌పేట, పంజాగుట్ట, ఎల్‌బినగర్, ఉప్పల్, పరేడ్‌గ్రౌండ్, హైటెక్ సిటీ స్టేషన్‌లలో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎల్,టిఎంఆర్‌హెచ్‌ఎల్ ఎండి,సిఇఒ కెవిబి రెడ్డి మాట్లాడుతూ ప్రయాణికులు ఎటువంటి ప్రయాస లేకుండా ప్రశాంతంగా ప్రయాణించే అవకాశం కలుగుతుందన్నారు. ప్రయాణికులు మూడు విధాలుగా కేవలం 30 సెకన్లలోపు స్మార్ట్ లాకింగ్ చేయవచ్చు. ముందుగా లాకర్ ప్యానెల్‌లో ఉండే క్యూర్ కోడ్‌ను స్కానింగ్ చేయాలి. వస్తువు ఆధారంగా లాకర్ సైజ్‌ను ఎంచుకోవాలి. ఎంతసేపు స్టోర్ చేయాలనుకుంటే అంత మొత్తాన్ని డిజిటల్‌గా చెల్లించాలి.

## 'ఇఎల్‌ఐఎస్‌ఎస్ యాప్ సాఫ్ట్‌వేర్' అంశంపైన వర్క్‌షాపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పశువుల గణాంకాల అంశంపైన కేంద్ర ప్రభుత్వం 'ఇఎల్‌ఐఎస్‌ఎస్ యాప్ సాఫ్ట్‌వేర్' అంశంపైన దక్షిణాది రాష్ట్రాలకు చెందిన నోడల్, జిల్లాల అధికారులకు రెండు రోజుల పాటు నిర్వహించే వర్క్‌షాపును హైదరాబాద్‌లోని టిజిఐఆర్‌డి శిక్షణ సంస్థలో శుక్రవారం ప్రారంభించింది. ఈ వర్క్‌షాపులో రాష్ట్ర వెటర్నరీ, పశుసంవర్ధక శాఖ డైరక్టర్ బి.గోపి, కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, పశువుల గణాంకాల విభాగం గణాంక సలహాదారు జగత్ హజారికా పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ,ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, తమిళనాడుతో పాటు పుదుచ్చేరి, లక్షద్వీప్ రాష్ట్రాలకు చెందిన నోడల్,జిల్లా నోడల్ అధికారుల హాజరయ్యారు. ఈ సందర్భంగా పశువుల గణాంక డేటా ప్రాముఖ్యతను వివరించారు. గ్రామ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ నమూనా సర్వేల ద్వారా పొందిన డేటాను సంకలనం చేసి, తరువాత రాష్ట్ర, జాతీయ, ప్రపంచ స్థాయిలో నివేదించబడుతుందని గణాంక సలహాదారు జగత్ తెలిపారు.

అనంతరం ఐఎఎస్‌ఆర్‌ఐ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ప్రాచి మిశ్రా సాహు మాట్లాడుతూ పశువుల డేటాను 2023–24 సంవత్సరం నుంచి ఇఎల్‌ఐఎస్‌ఎస్ యాప్ సాఫ్ట్‌వేర్ ద్వారా దేశవ్యాప్తంగా డిజిటలైజ్ చేసినట్లు వివరించారు.



పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మభూషణ్ ప్రొఫెసర్ కె.శ్రీనాథ్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని నివాసంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన దృశ్యం.

## గ్యాస్ డెలివరీ బాయ్ ముసుగులో గంజాయి సరఫరా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్యాస్ సిలిండర్ డెలివరీ భాయ్ ముసుగులో గంజాయి సరఫరా చేస్తున్న ఉదంతం కూకట్‌పల్లిలో శుక్రవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. గాదే అజయ్ (21) కూకట్‌పల్లిలో ఓ గ్యాస్ ఏజెన్సీలో డెలివరీ భాయ్‌గా పనిచేస్తున్నాడు. తన ఆటోలో ప్రతి రోజు ఇంటింటికి గ్యాస్ సిలిండర్‌లను సరఫరా చేస్తుంటాడు. ఇదే క్రమంలో అదే ఆటోలో గంజాయిని రహస్యంగా తీసుకెళ్తుంటాడు. గంజాయి కస్టమర్లకు చిన్న చిన్న పొట్లాలలో అమ్మకం చేస్తుంటాడు. కూకట్‌పల్లిలోని దేవి ఇస్తావా హోం ప్రాంతంలో గంజాఇయి అమ్మకాలు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్‌టిఎఫ్ డి టీమ్ సిఐ నాగరాజు తన సిబ్బందితో శుక్రవారం అజయ్ నడిపిస్తున్న గ్యాస్ సిలిండర్ సరఫరా చేసే ఆటోను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో గ్యాస్ సిలెండర్ల అమ్మకాలు జరుగుతున్న అజేయ్ వద్ద 580 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని గంజాయిని కూకట్‌పల్లి ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

## రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించడం అశాస్త్రీయం

మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'తెలంగాణ విజన్ 2047'లో భాగంగా రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించడం అశాస్త్రీయంగా ఉన్నదని బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. వరంగల్,మహబూబ్ నగర్ లాంటి నగరాలను వెనకాల వేశారని, ఇదొక లోపభూయిష్టమైన నిర్ణయమని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వినోద్ కుమార్ మాట్లాడుతూ విజన్ 2047 డాక్యుమెంట్ విషయంలో సిఎం రేవంత్ రెడ్డి రెండు అనాలోచిత నిర్ణయాలు తీసుకున్నారని, డాక్యుమెంట్ రూపకల్పన కోసం ఏర్పాటు చేసిన అడ్వయిజరీ ప్యానెల్ కమిటీలో మోహన్ గురుస్వామి తప్ప తెలంగాణకు చెందిన వారికి అవకాశం ఇవ్వలేదని, 30 మంది సభ్యులలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారికి ఎందుకు అవకాశం ఇవ్వలేదని వినోద్ కుమార్ ప్రశ్నించారు. సోనియా గాంధీ గతం లో ఏర్పాటు చేసిన ప్యానెల్ లో కూడా తెలంగాణకు చెందిన హనుమంత రావు ,జయప్రకాష్ నారాయణ్ ఉండేవారని, అమెరికాలో కూడా తెలంగాణ బిడ్డలు ఆ గవర్నమెంట్ కు సలహాదారులుగా పనిచేశారని, అనేక దేశాల్లో తెలంగాణ బిడ్డలు ఆయా ప్రభుత్వాలకు సేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణ విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో తెలంగాణ బిడ్డలకు ఇప్పటికైనా స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ తప్ప మిగిలిన గ్రామీణ తెలంగాణ ను నిర్లక్ష్యం చేసే కుట్ర కనిపిస్తోందని ఆరోపించారు. డిసెంబర్ 9న జరిగే సమావేశం లో సిఎం రేవంత్ రెడ్డి తన తప్పుడు నిర్ణయాలను సమీక్షించుకోవాలని సూచించారు. తెలంగాణ విజన్ డాక్యుమెంట్ రూపొందించే క్రమంలో లోపాలను సరిదిద్దాలని వినోద్ కుమార్ అన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు చిరుమళ్ల రాకేష్ కుమార్ ,పల్లె రవికుమార్ ,గోసుల శ్రీనివాస్ యాదవ్ ,కార్తీక్ రాయల పాల్గొన్నారు.

## బంగాళాఖాతంలో మరో కొత్త తుఫాన్

**న్యూఢిల్లీ :** బంగాళాఖాతంలో మరో కొత్త తుఫాను ముప్పు పొంచి ఉన్నట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండి) వెల్లడించింది. వాయువ్య బంగాళాఖాతం దానికి ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో వాయుగుండం ఏర్పడిందని.. అది తుఫాన్ మారుతోందని ప్రకటించింది. దీనికి దిట్వా తుఫానుగా నామకరణం చేశారు.ఈ తుఫాను నవంబర్ 30 నాటికి ఉత్తర తమిళనాడు పుదుచ్చేరిదక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలను తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ తీరప్రాంత జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. తీరప్రాంత రాష్ట్రాలలోని మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించింది. ఇప్పటికే శ్రీలంకలో భారీ వర్షాలతో కూడిన ఈదురుగాలులు ప్రారంభమయ్యాయని.. ఏపి, తమిళనాడులోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

ఈ క్రమంలో తీర ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, వాతావరణ శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను పాటించాలని అధికారులు కోరారు.

## దమ్ముంటే బిజెపి అడ్డుకోవాలి


శివసేన (యుబిటి) అధ్యక్షుడు ఉద్ధవ్ థాక్రే

**ముంబై :** పార్లమెంటులో వందే మాతరం, జై హింద్ నినాదాలు వద్దంటూ ఎంపిలకు రాజ్యసభ సెక్రటేరియట్ ఆదేశించడాన్ని శివసేన (యూబిటి) అధ్యక్షుడు ఉద్ధవ్ థాక్రే తీవ్రంగా ఖండించారు. తమ పారీ ఎంపిలంతా పార్లమెంటులో వందేమాతరం నినాదాలు ఇస్తారని శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన తేల్చి చెప్పారు. అవిభజిత శివసేన గతంలో బిజెపితో కలిసి ఉండేదని గుర్తుచేశారు. దేశంలో బతకాలనుకునే వారంతా వందే మాతరం అనాల్సిందేనన్నారు. రాజ్యసభ సెక్రటేరియట్ ద్వారా ఈ మేరకు ఆదేశాలిచ్చిన వ్యక్తిని పాకిస్థాన్‌కు పంపుతారా? బిజెపిలో మెకాలే సంతతి చొరబడిందా? అని ఉద్ధవ్ ప్రశ్నించారు. 'మా ఎంపిలు వందేమాతరం నినాదాలు ఇస్తారు. మమ్మల్ని పార్లమెంటు నుంచి ఎవరు బయటకు పంపుతారో చూస్తాం. శివసేన (యుబిటి) ఎంపిలంతా వందే మాతరం అంటూ బిగ్గరగా అంటారు' అని ప్రకటించారు. 'బిజెపికి ధైర్యముంటే మమ్మల్ని అడ్డుకోవాలి, సభ నుంచి బయటకు పంపాలి' అంటూ ఉద్ధవ్ థాక్రే సవాల్ విసిరారు.

### వచ్చే డిజిపిలు, ఐజిపిల సదస్సు నాటికి
## నక్సలిజం నుంచి విముక్తి

**రాయ్‌పూర్ :** నక్సలిజాన్ని దేశం నుంచి పూర్తిగా నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని హోంమంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. తదుపరి జరగబోయే డిజిపిలు, ఐజిపిల సదస్సు నాటికి దేశం ఈ సమస్య నుంచి పూర్తిగా విముక్తి పొందుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు. నక్సలిజం, ఈశాన్య రాష్ట్రాల సమస్యలు, జమ్మూకశ్మీర్ సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని అందించడంలో మోదీ ప్రభుత్వం విజయం సాధించిందని అన్నారు. రాయ్‌పూర్‌లో శుక్రవారం జరిగిన డిజిపి, ఐజిపిల వార్షిక సదస్సులో ఆయన ప్రసంగించారు. దేశ భద్రత, అంతర్గత శాంతిని కాపాడటంలో పోలీస్ దళాల పాత్ర కీలకమని అమిత్ షా ఉద్ఘాటించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వ్యవస్థీకృత నేరాలపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాదారులు, నేరగాళ్లకు భారతదేశంలో ఎంత మాత్రం స్థానంలేదని హెచ్చరించారు. పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్‌ఐ)పై నిషేధం తర్వాత కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు, ఆ తర్వాత జరిగిన పరిణామాలను అమిత్ షా ప్రస్తావించారు.

పిఎఫ్‌ఐ నిషేధం తర్వాత దేశవ్యాప్తంగా అధికారుల సోదాలు, అరెస్టులు చేయడాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ చర్యలు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మధ్య అద్భుతమైన సమన్వయాన్ని ప్రదర్శించాయని, ఇది దేశ భద్రతా చర్యలకు ఒక గొప్ప ఉదాహరణగా నిలిచిందని పేర్కొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## విమానంలో పొగ..వెనక్కి మళ్లింపు

**న్యూఢిల్లీ:** ఎయిర్ ఇండియా విమానంలో పొగ ఉన్నట్లు హెచ్చరికలు చూపడంతో టేకాఫ్ అయిన ఆ విమానాన్ని వెనక్కి మళ్లించి ఎయిర్‌పోర్ట్‌లో దించేశారు. ప్రయాణికులను కిందకు దించి వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. దిల్లీలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎయిర్ ఇండియా విమానం ఏఐ 2939 దిల్లీ నుంచి అహ్మదాబాద్ వెళ్లేందుకు దిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి గురువారం టేకాఫ్ అయింది. ఆ వెంటనే కార్గో విభాగంలో పొగ ఉన్నట్లు కాక్‌పిట్‌లో అలెర్ట్ చూపించింది. వెంటనే విమానం పైలట్లు వెంటనే అప్రమత్తమయ్యారు. ప్రామాణిక ఆపరేటింగ్ ప్రొటోకాల్స్ పాటించారు. ఆ విమానాన్ని తిరిగి ఎయిర్‌పోర్ట్‌కు మళ్లించారు. సురక్షితంగా దించేశారు. ప్రయాణికులను విమానం నుంచి దించి, పొగ అలెర్ట్ వచ్చిన కార్గో విభాగాన్ని విమాన సిబ్బంది పరిశీలించారు. అయితే అక్కడ ఎలాంటి పొగ ఆనవాళ్లు కనిపించలేదు. దీంతో తప్పుడు అలెర్ట్‌గా సిబ్బంది నిర్ధారించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా ప్రయాణికులను వారి గమ్యస్థానానికి చేర్చినట్లు ఎయిర్ ఇండియా అధికారి తెలిపారు.

### వసుధైక కుటుంబం అనే పురాతన తత్వానికి...

## గతంలో కంటే అధిక ప్రాచుర్యం

బ్రహ్మకుమారీలు నిర్వహించిన 'ప్రపంచ ఐక్యత-విశ్వాసం కోసం ధ్యానం' సమావేశం ప్రారంభోత్సవంలో రాష్ట్రపతి ముర్ము



**లక్నో:** ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ఊహించని సవాళ్ల మధ్య వసుధైక కుటుంబం (ప్రపంచం ఒక కుటుంబం) అనే పురాతన తత్వం గత ంలో కంటే ఇప్పుడు మరింత ప్రాచుర్యం పొందిందని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అన్నారు. శుక్రవారం ఇక్కడ 2025–26 సంవత్సరానికి బ్రహ్మకుమారి ఇతివృత్తం 'ప్రపంచ ఐక్యతవిశ్వాసం కోసం ధ్యానం' సమావేశం ప్రారంభోత్సవంలో రాష్ట్రపతి ముర్ము ప్రసంగించారు. 'భారతదేశ ప్రాచీన నాగరికత, గొప్ప సాంస్కృతిక వారసత్వం ఎల్లప్పుడూ వసుదైవ కుటుంబం అనే 'కాలాతీత సూత్రాన్ని' ప్రతిబింబించాయి. ఇది అనిశ్చితులు, ప్రపంచ సవాళ్లను ఎదుర్కొంటున్న నేటి ప్రపంచం ఈ సందేశం మరింత సందర్భోచితంగా మారుతోంది' అని రాష్ట్రపతి అన్నారు. నేడు మానవులు గతంలో కంటే ఎక్కువ విద్యావంతులు మాత్రమే కాకుండా సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందారు. పురోగతి సాధించడానికి అనేక అవకాశాలు ఉన్నాయని, అయినప్పటికీ పురోగతితో పాటు పెరుగుతోన్న వత్తిడితో ఇబ్బంది పడుతున్న సమాజం, మానసిక అభద్రత, ఒంటరితనంతో పోరాడుతోంది. ముందుకు సాగడం మాత్రమే కాదు. తనలో తాను చూసుకోవడం కూడా నేటి అవసరమని రాష్ట్రపతి ముర్ము అన్నారు. 'ప్రతీ మానవుడూ ఇతరులను విశ్వసించాలని కోరుకుంటాడు. కానీ మనస్సు ప్రశాంతంగా, ఆలోచనలు స్పష్టంగా, భావోద్వేగాలు స్వచ్ఛంగా ఉన్నచోట మాత్రమే నమ్మండి. మనం ఒక్క క్షణం ఆగి సంభాషించినప్పుడు, శాంతి, ఆనందం ఏ బాహ్య ప్రపంచంలోనూ కనిపించవని మనం గ్రహిస్తాం. మనలో ఆధ్యాత్మిక స్పృహ మేల్కొన్నప్పుడు ప్రేమ, సోదరభావం, కరుణ, ఐక్యత దానంతట అవే జీవితంలో భాగస్వామ్యం అవుతాయి' అని ఆమె చెప్పారు. ప్రశాంతమైన, స్థిరమైన మనస్సు సమాజంలో శాంతికి బీజం వేస్తుందని, అక్కడ నుండి ప్రపంచ శాంతికి పునాది వేస్తుందని రాష్ట్రపతి ఉద్ఘాటించారు. ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రతీ మూలను కవర్‌చేసే యాత్రను చేపట్టే బ్రహ్మకుమారీలకు 'కలశం', బ్రహ్మకుమారులకు జెండాలను బహుకరించారు. దీనికి ముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం పలికిన ఉత్తర్‌ప్రదేశ్ గవర్నర్ ఆనందిబెన్ పటేల్ మాట్లాడుతూ 'ఆమె ఉనికి ఈ కార్యక్రమాన్ని చరిత్రాత్మకంగా మార్చింది. 'జాతీయ ప్రయోజనం,మానవత్వం, విలువల పట్ల మీ అంకితభావం మనందరికీ స్ఫూర్తిదాయకం' అని గవర్నర్ ఆనందిబెన్ పటేల్ అన్నారు. ప్రపంచ ఐక్యత లక్ష్యంతో ఇది ఒక ప్రధాన ప్రచారం అని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వివరించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు యోగి స్వాగతం పలుకుతూ 'ఒక దేశ రాజ్యాంగ అధిపతిగా ఉండటమే కాకుండా ఆమె జీవితం ఒక ఉపాధ్యాయుడి తరహాలో స్ఫూర్తిని ఇస్తోంది' అని ఆయన పేర్కొన్నారు.

## వాయు కాలుష్యంపై పార్లమెంట్‌లో చర్చ జరపాలి

### ఆరోగ్య అత్యవసర పరిస్థితిపై మోదీ మౌనం ఎందుకని రాహుల్ నిలదీత

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబరు 1వ తేదీ నుంచి జరగనున్నాయి. ఈ నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో రోజు రోజుకు పెరుగుతున్న వాయు కాలుష్యంపై సవివరంగా చర్చించాలని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. ఆరోగ్య అత్యవసర పరిస్థితిపై ప్రధాని మోదీ మౌనం ఉండడమేటమని రాహుల్ ప్రశ్నించారు. వాయు కాలుష్యాన్ని పరిష్కరించడానికి కఠినమైన, అమలు చేయగల కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై మోదీ ప్రభుత్వం ఎటువంటి అత్యవసరతను లేదా జవాబుదారీతనం ఎందుకు చూపించడం లేదని నిలదీశారు. ఈ అంశంపై తన నివాసంలో తల్లుల బృందంతో రాహుల్ గాంధీ ముఖాముఖి నిర్వహించారు. వారితో తన సంభాషణ వీడియోను పంచుకున్నారు. వారిలో చాలామంది తమ పిల్లల ఆరోగ్యంపై కాలుష్యం ప్రభావం గురించి ఆందోళన వ్యక్తం చేశారు. తమ బిడ్డ విషపూరిత గాలిని పీల్చుకుంటూ పెరుగుతోందని, వారు అలసిపోయారని, భయపడుతున్నారని, కోపంగా ఉన్నారని తనను కలిసిన ప్రతి తల్లి ఇదే విషయాలను చెబుతోందన్నారు. 'మోదీ జీ, భారతదేశ పిల్లలు మన ముందు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మీరు ఎలా మౌనంగా ఉండగలుగుతున్నారు? మీ ప్రభుత్వం ఎందుకు అత్యవసరంగా, ప్రణాళిక లేకుండా, జవాబుదారీతనం లేకుండా ఉండగలుగుతుందని అని రాహుల్ ఎక్స్‌లో ప్రశ్నించారు.



భారతదేశానికి వాయు కాలుష్యంపై తక్షణ, వివరణాత్మక పార్లమెంటు చర్చ, ఈ ఆరోగ్య అత్యవసర పరిస్థితిని పరిష్కరించడానికి కఠినమైన, అమలు చేయగల కార్యాచరణ ప్రణాళిక అవసరం' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు పేర్కొన్నారు. మన పిల్లలు స్వచ్ఛమైన గాలికి అర్హులని, సాకులు, పరధ్యానాలు కాదని హితవు పలికారు. వీడియోలో మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రతి ఒక్కరూ కాలుష్యం వల్ల ప్రభావితమవుతున్నారని పేర్కొన్నారు. ఢిల్లీలో పేదలు, ధనవంతులు ఇద్దరూ నివసిస్తున్నారన్నారు. కాలుష్యం ఉండటానికి కారణం కాలుష్యం వల్ల ప్రయోజనం పొందే వారున్నారని, దానిని స్పష్టంగా చెప్పాలంటే వారు మీ కంటే శక్తివంతమైనవారన్నారు. ఇప్పుడు రాజకీయ సంకల్పం గురించి మాట్లాడేటప్పుడు, ఈ శక్తి పరిణామాలు రాజకీయ సంకల్పాన్ని ప్రభావితం చేస్తాయని, ఢిల్లీని కలుషితం చేస్తున్న 500 నుండి 1000 వాణిజ్య యూనిట్లు మీకు ఉంటే, వారికి రాజకీయ అండ ఉంటుందన్నారు. ఇక్కడ సమస్య ఏమిటంటే సగటు పౌరుడు అస్సలు వ్యవస్థీకృతంగా లేడన్నారు. కాబట్టి, అతనికి ఏ రాజకీయ శక్తి అండగా లేదన్నారు. వాయు కాలుష్యాన్ని ఎదుర్కోవడంలో వారికి ఇప్పటికే ఎంపికలు ఉన్నప్పటికీ, భారతదేశంలో చాలా మందికి అవి లేవని చెప్పారు. కాగా, పార్లమెంటులో చర్చ జరపాలని ఓ తల్లి చేసిన సూచనకు గాంధీ స్పందిస్తూ 'పార్లమెంటులో వాయు కాలుష్యంపై చర్చ జరపడానికి మాకు అనుమతి ఇవ్వడం న్యాయమైన లక్ష్యం అవుతుందన్నారు. సంభాషణ సమయంలో భారతదేశంలో వాయు కాలుష్యం కారణంగా ప్రతిరోజూ దాదాపు 500 మంది పిల్లలు మరణిస్తున్నారని, అయినప్పటికీ ఇది ఎప్పుడూ అత్యవసర పరిస్థితి కాదని ఒక మహిళ గాంధీతో అన్నారు. ఇది దీర్ఘకాలిక జాతీయ వైద్య అత్యవసర పరిస్థితి అయినప్పటికీ, ప్రభుత్వం నుండి ఎటువంటి సలహా లేదని, మొత్తం తరం పిల్లల కోసం అది ఏమి చేస్తుందని, ప్రభుత్వం దానిపై ఎందుకు మౌనంగా ఉందని మరొక మహిళ ప్రశ్నించారు. మనం ఇప్పుడు చర్య తీసుకోకపోతే, రాబోయే 10 సంవత్సరాలలో ఇది బాంబులా తయారవుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంగా, గత 15 రోజులుగా ఢిల్లీ చాలా పేలవమైన గాలి నాణ్యతతో పోరాడుతోంది. ఎయిర్ క్వాలిటీ ఎర్లీ వార్నింగ్ సిస్టమ్ అంచనా ప్రకారం రాబోయే కాలంలో గాలి నాణ్యత చాలా పేలవంగా ఉండే అవకాశం ఉంది.

## ప్రజలపై భారీ కుట్ర

### 'సర్' ప్రక్రియపై ఎస్‌పి చీఫ్ అఖిలేశ్ ధ్వజం



**లక్నో :** ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)పై ఎస్‌పి చీఫ్ అఖిలేశ్ యాదవ్ మరోసారి ఎన్నికల కమిషన్‌పై విరుచుకుపడ్డారు. దేశ ప్రజలకు వ్యతిరేకంగా చేస్తున్న ఒక భారీ కుట్ర అని, పౌరులను వలసవాద యుగం కంటే దారుణమైన స్థితిలోకి నెట్టవేస్తున్నారని మండిపడ్డారు. గురువారం సాయంత్రం తన అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లో సర్ ప్రక్రియపై 20 సెకన్ల వీడియోను అఖిలేశ్ పోస్టు చేశారు. బిజెపి చేస్తున్న మెగా కుట్రను ఐక్యంగా బహిర్గతం చేయాలని అధికార నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డిఎ) మిత్రదేశాలతో సహా అన్ని ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై మండిపడుతూ ఇది ప్రజాస్వామ్యానికి మోసమని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేడు ఓట్లు తొలగిస్తున్నారని, రేపు మధ్యతరగతి ప్రజల బ్యాంకు ఖాతాలు, లాకర్ల నుండి కూడా పేర్లు తొలగించబడతాయని ఆరోపించారు. సర్ ప్రక్రియ దేశ ప్రజలకు వ్యతిరేకంగా జరిగిన ఒక పెద్ద కుట్ర, ఇది వలసవాద యుగం కంటే చాలా దారుణమైన పరిస్థితికి దారితీస్తుందని, మేల్కొని ప్రతి ఓటును రక్షించాల్సిన సమయం అది అని ఉద్ఘాటించారు. ప్రస్తుతం బిజెపికి మద్దతు ఇస్తున్న పార్టీలు ముందుగా అంతమవుతాయని హెచ్చరించారు. అందువల్ల అన్నీ వదిలివేసి సర్ కింద జరుగుతున్న మోసాన్ని ఆపాలని పౌరులకు పిలుపునిచ్చారు. బిజెపి, దాని మిత్రపక్షాలు, రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌లోని కొంతమంది అవినీతి అధికారులు మొత్తం ఎన్నికల వ్యవస్థను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని అఖిలేశ్ ఆరోపించారు. బిజెపి నాయకులు, వారి మిత్రపక్షాలు బహిరంగంగా దోచుకున్న దేశాన్ని కాపాడటానికి, మన ఓటు ద్వారా ప్రాతినిధ్యం వహించే మన గుర్తింపును కాపాడుకోవడానికి మనం ఐక్యంగా ఉండాలని, లేకపోతే, రేపు వారు తమను తాము బయటి వ్యక్తులుగా ప్రకటిస్తారని పేర్కొన్నారు.

## 'నయా భారత్' ఎవరికీ తలవంచదు

ప్రధాని నరేంద్ర మోడీ



**ఉడిపి:** నయా భారత్ ఎలాంటి బెదిరింపులకు తలొగ్గదని, దేశ పౌరుల రక్షణ కోసం ఎంత దూరమైనా వెళ్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు ఉగ్రదాడుల తర్వాత, ఎలాంటి ప్రతీకారం తీర్చుకోకుండా నిర్లిప్తంగా ఉండేవని విమర్శించారు. 'ఆపరేషన్ సుదర్శన్ చక్ర' దేశానికి 'భద్రత వలయాన్ని' అందిస్తుందని, ఎవరైనా శత్రువులు భారత్‌పై దాడి చేయడానికి ప్రయత్నిస్తే, వారిని సర్వనాశనం చేస్తుందని అన్నారు. కర్ణాటకలోని ఉడిపిలో జరిగిన లక్ష కంఠ గీత పారాయణ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది ఎర్రకోట నుంచి చేసిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో, ప్రధాని మోదీ 'సుదర్శన చక్ర మిషన్'ను ప్రకటించారు. రానున్న దశాబ్దకాలంలో భారత జాతీయ భద్రతను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ మిషన్‌ను ప్రారంభించామని స్పష్టం చేశారు. కాగా, ఉడిపిలో జరిగిన సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, 'శ్రీకృష్ణుడు యుద్ధ భూమిలో గీతా ప్రబోధం చేశాడు. శాంతి, సత్యాన్ని పునరుద్ధరించడానికి దుర్మార్గులైన శత్రువులను అంతం చేయడం ముఖ్యమని భగవద్గీత మనకు బోధిస్తుంది. ఇది జాతీయ భద్రత విధానానికి చెందిన సారాంశం. మనం వసుదైవ కుటుంబం అని నమ్ముతాం. 'ధర్మో రక్షతి రక్షితః' అనే మంత్రాన్ని పఠిస్తాం. అందుకే ఎర్రకోట నుంచి మేము శ్రీకృష్ణుని సందేశంతో మిషన్ సుదర్శన చక్రను ప్రకటించాం. దీని ద్వారా శత్రువులు మన దేశంలో చొరబడకుండా భద్రతా వలయాన్ని నిర్మించాం. ఒకవేళ శత్రువు దాడి చేయడానికి ధైర్యం చేస్తే, మన సుదర్శన చక్రం వారిని నాశనం చేస్తుంది' అని అన్నారు. పాక్ ముష్కరులు పహల్గాం దాడి చేసిన తర్వాత, ప్రతీకారం తీర్చుకోవాలనే దృఢ సంకల్పంతో మన దేశం ఆపరేషన్ సిందూర్ చేపట్టిందని మోదీ పేర్కొన్నారు. 'పహల్గాం ఉగ్రదాడిలో మన కర్ణాటకకు చెందిన సోదరులు, సోదరీమణులు బాధితులయ్యారు. మునుపటి ప్రభుత్వాలు ఉగ్రదాడుల తర్వాత ఎలాంటి ప్రతీకార దాడులు చేయలేదు. కానీ ఇది సరికొత్త భారతదేశం. శాంతిని ఎలా స్థాపించాలో, దానిని ఎలా కాపాడాలో మాకు తెలుసు. అందుకే మా ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. దీనిని దేశం మొత్తం చూసింది' అని మోదీ పేర్కొన్నారు. కర్ణాటకలో చేపట్టిన లక్ష కంఠ గీత పారాయణ కార్యక్రమంలో విద్యార్థులు, సాధువులు, పండితులు, వివిధ రంగాలకు చెందిన పౌరులు సహా లక్ష మందికి పైగా పాల్గొన్నారు. వీరందరూ భగవద్గీతను పారాయణం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ కృష్ణమందిరి ముందున్న సువర్ణ తీర్థ మండపాన్ని ప్రారంభించారు. పవిత్రమైన కనకన కిండి (కిటికీ ) కోసం బంగారు కవచాన్ని అంకితం చేశారు. వాస్తవానికి ఈ కిటికీ ద్వారానే కనకదాసు నేరుగా శ్రీకృష్ణుని దివ్యదర్శనం చూశాడని భక్తులు నమ్మకం.

### ప్రపంచంలోనే ఎత్తయిన శ్రీరాముడి విగ్రహాన్ని ఆవిష్కరించిన మోడీ



ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన శ్రీరాముడి విగ్రహాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఆవిష్కరించారు. దక్షిణ గోవాలోని శ్రీ సంస్థాన్ గోకర్ణ పర్తగాలీ జీవోత్తమ్ మఠంలో ఏర్పాటు చేసిన 77 అడుగుల కాంస్య విగ్రహాన్ని ప్రారంభించారు. మఠం 550వ వార్షికోత్సవం సందర్భంగా అక్కడ పర్యటించిన ప్రధాని మోదీ, విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ అశోక్ గజపతిరాజు, సిఎం ప్రమోద్ సావంత్, పలువురు రాష్ట్ర మంత్రులు హాజరయ్యారు. అంతకుముందు ప్రధాని నరేంద్ర మోదీ ఈ మఠంలో ఉన్న ఆలయాన్ని కూడా దర్శించారు. ఈ మఠం భారతదేశంలోనే అతి పురాతన మత సంస్థల్లో ఒకటిగా ప్రాచుర్యం పొందింది. గుజరాత్‌లో ఉన్న 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ'ని తీర్చిదిద్దిన శిల్పి రామ్ సుతార్ శ్రీరాముడి విగ్రహాన్ని కూడా తయారుచేశారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి, కొడుకు సహా నలుగురు మృతి

**ఉత్తర్‌ప్రదేశ్/మిర్జాపూర్:** రోడ్డు పక్కన నిలిచిన ట్రక్కును కారు ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు సభ్యులతో సహా నలుగురు వ్యక్తులు మరణించారని పోలీసులు తెలిపారు. ఈ ఘటన శుక్రవారం ఉదయం కటక సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ప్రయాగ్‌రాజ్ నుండి వారణాసికి వెళ్తున్న కారు డ్రైవర్ వాహనాన్ని అదుపు తప్పి రోడ్డు దాటుతున్న ఇద్దరు పాదచారులను ఢీకొట్టడంతో రోడ్డు పక్కన నిలిచిన ట్రక్కును ఢీకొట్టింది. పాదచారులు కొన్ని మీటర్ల దూరం విసిరివేయబడ్డారని సర్కిల్ ఆఫీసర్ అమర్ బహదూర్ సింగ్ తెలిపారు. ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జయిపోయిందని తెలిపారు. ప్రయాగ్‌రాజ్‌లోని సొరాన్‌లో నివాసం ఉంటున్న శ్యామ్‌కృష్ణ యాదవ్ (55), అతని కుమారుడు అనురాగ్ యాదవ్ (30)గా గుర్తించారు. ఈ ఘటనలో మృతి చెందిన ఇద్దరు పాదచారులను సరోజ్ (40), భోలు (35)గా గుర్తించామని పోలీసులు తెలిపారు. క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారని, మృతదేహాలను పోస్ట్ మార్టంకు తరలించినట్లు వారు తెలిపారు.



## రూ.5 కోట్లు ఇవ్వాల్సిందే

### గోల్డ్‌మ్యాన్ 'చిత్తోర్‌గఢ్ బప్పీలహరి'కి బెదిరింపులు

**జైపూర్:** చిత్తోర్‌గఢ్ బప్పిలహరిగా గుర్తింపు పొందిన వ్యాపారవేత్త కన్హయ్యలాల్ ఖాతిక్‌కు బెదిరింపులు వచ్చాయి. రాజస్థాన్‌లోని చిత్తోర్‌ఘడ్‌కు చెందిన అతడు తన మెడలో ఎప్పుడూ బంగారు ఆభరణాలు వేసుకుని తిరుగుతుంటాడు. సుమారు 3.5 కేజీల బంగారంతో అతను సంచరిస్తూ ఉంటాడు. పండ్ల వ్యాపారం చేసే కన్హయ్యలాల్‌కు గ్యాంగ్‌స్టర్ రోహిత్ గోదార గ్యాంగ్ నుంచి బెదిరింపులు వచ్చాయి. పోలీసుల కథనం ప్రకారం రెండు రోజుల క్రితం ఖాతిక్‌కు ఓ మిస్డ్‌కాల్ వచ్చింది. ఆ తర్వాత అదే నెంబర్ నుంచే వాట్సాప్ కాల్ చేశారు. ఆ కాల్ రిసీవ్ చేసుకోకపోవడంతో... ఆడియో మెసేజ్ చేశారు. రూ.ఐదు కోట్లు ఇవ్వాలంటూ ఆ మెసేజ్‌లో డిమాండ్ చేశారు. ఒకవేళ డబ్బులు చెల్లించకుంటే బంగారు ఆభరణాలు ధరించేందుకు అవకాశం ఉండదని హెచ్చరించారు. వీలైనంత త్వరగా విషయాన్ని సెటిల్ చేయాలన్నారు. డబ్బులు డిమాండ్ చేస్తూ మరోసారి కూడా తనకు ఫోన్ కాల్ వచ్చిందని ఖాతిక్ తెలిపాడు. సిటీ కోత్వాల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తోపుడు బండిపై ఒకప్పుడు కూరగాయలు అమ్మిన కన్హయ్యలాల్... యాపిల్స్ వ్యాపారంలో బాగా సంపాదించాడు. ఆ క్రమంలో అతడు బంగారు ఆభరణాలపై మోజు పెంచుకున్నాడు. 3.5 కేజీల బంగారాన్ని ధరిస్తూ చిత్తోర్‌ఘడ్ గోల్డ్‌మ్యాన్‌గా గుర్తింపు పొందాడు. గ్యాంగ్‌స్టర్ రోహిత్ గోదార.. బికనీర్ రెసిడెంట్. ప్రస్తుతం అతను కెనడాలో ఉన్నట్లు తెలుస్తోంది. దేశంలో వివిధ పోలీసు స్టేషన్లలో అతడిపై 32 కేసులు నమోదు అయ్యాయి. రాజస్థాన్‌లో వ్యాపారవేత్తల నుంచి అతడు డబ్బులు వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

## ఏదీ కోరను, తొందరపడను...

డికె శివకుమార్



**బెంగళూరు :** కర్ణాటకలో నాయకత్వ మార్పు వ్యవహారం ముదురుతోంది. అధికార పంపిణీ వ్యవహారంపై తలెత్తిన ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను ఆయన నివాసంలో ఒక్కలిగ కమ్యూనిటీకి చెందిన ఆధ్యాత్మిక నేత నంజవదూత స్వామి శుక్రవారంనాడు కలుసుకున్నారు. డికెకు తమ మద్దతు ప్రకటించారు. దీనిపై డికె శివకుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీనే తన కమ్యూనిటీ అని, రాష్ట్రంలోని అన్ని సామాజికవర్గాలను తాను సమంగా చూస్తానని చెప్పారు. నాయకత్వ మార్పుపై అడిగినప్పుడు 'నేను ఏదీ కోరను. దేనికీ తొందరపడేది కూడా లేదు. దీనిపై మా పార్టీ నిర్ణయం తీసుకుంటుంది. నేను ఎప్పుడూ కమ్యూనిటీ కోణం నుంచి చూడను. కాంగ్రెస్ పార్టీనే నా కమ్యూనిటీ. సమాజంలోని అన్ని వర్గాలను అభిమానిస్తుంటాను' అని డికె సమాధానమిచ్చారు. సిఎం పోస్టు వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానం ఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు ఊహాగానాలు వినిపిస్తుండగా, డికె మాత్రం ఇందుకు భిన్నంగా స్పందించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నందున కర్ణాటక రైతుల సమస్యలను పార్టీ అధిష్ఠానం దృష్టికి తెచ్చేందుకు తాను ఢిల్లీ వెళ్తానని చెప్పారు. 'ఢిల్లీకి తప్పనిసరిగా వెళ్తాను. అది మా గుడి. కాంగ్రెస్‌కు సుదీర్ఘ చరిత్ర ఉంది. మాకు ఢిల్లీ నుంచే ఎల్లప్పుడూ మార్గదర్శకాలు ఉంటాయి. ఢిల్లీలో నాకు చాలా పని ఉంది. పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరగనున్నాయి. కర్ణాటక ప్రాజెక్టులకు ముందుకు తీసుకు వెళ్లేందుకు పార్లమెంటు సభ్యులను నేను కలవాల్సి ఉంది. మా ముఖ్యమంత్రి కూడా సమస్యలను కేంద్రంతో కేంద్రం రైతులను ఆదుకోవడం లే దు' అని తెలిపారు.

**ఊహాగానాలను తోసిపుచ్చిన ప్రియాంక్ ఖర్గే**

రాష్ట్రంలో నాయకత్వ మార్పు జరగవచ్చనే ఊహాగానాలను కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే తోసిపుచ్చారు. దీనికి ముందు ఆయన డికె శివకుమార్‌ను కలుసుకున్నారు. పాలనాపరమైన సమస్య కారణంగానే తాను డికెను కలిసినట్టు ప్రియాంక్ ఖర్గే చెప్పారు. సిఎంను కూడా కలుస్తానని అన్నారు. ఏ నిర్ణయమైన అధిష్ఠానం తీసుకుంటుందని, అధిష్ఠానం పిలిచినప్పుడు తాము వెళ్తామని సీఎం, డిప్యూటీ సిఎం ఇప్పటికే చెప్పినందున మీడియా కూ డా ఊహాగానాలకు చేయరాదని కోరారు. బిజెపినే ఈ ఊహాగానాలకు సృష్టిస్తోందని విమర్శించారు.

## 'ఆధార్'తో బర్త్ సర్టిఫికెట్ల జారీ రద్దు

**న్యూఢిల్లీ:** ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు పుట్టిన తేదీ సర్టిఫికేట్ జారీ కోసం ఆధార్ కార్డులను ప్రమాణికంగా తీసుకోబోమని పేర్కొన్నాయి. ఆధార్ కార్డుకు బర్త్ సర్టిఫికేట్‌ను జోడించడం లేదని, దాన్ని జన్మ ధృవీకరణ పత్రంగా భావించడం లేదని ఉత్తరప్రదేశ్ ప్రణాళికశాఖ స్పెషల్ సెక్రటరీ అమిత్ సింగ్ బన్సాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వం కూడా ఇలాంటి ఆదేశాలే జారీ చేసింది. బర్త్ సర్టిఫికేట్ జారీ చేసేందుకు ఆధార్ కార్డును ఓ డాక్యుమెంట్‌గా ఆమోదించబోమని చెప్పింది. జనన, మరణ రిజిస్ట్రేషన్ సవరణ చట్టం 2023 తర్వాత ఆధార్ కార్డు ఆధారంగా నమోదు అయిన బర్త్ సర్టిఫికేట్లను రద్దు చేయ నున్నట్లు వెల్లడించింది. అక్రమంగా జరుగుతున్న నకిలీ జనన, మరణ ధృవపత్రాల జారీని అ డ్డుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఆధార్ కార్డులతో అనుమానాస్పద రీతిలో జారీ చేసిన అన్ని సర్టిఫికేట్లను రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

### దేశ సార్వభౌమత్వం, భద్రత విషయంలో...


## భారత్ ఎట్టి పరిస్థితుల్లో రాజీపడదు

కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ:** భారతదేశం శాంతి, సంభాషణను విశ్వసిస్తుందని, అయితే దేశ సార్వభౌమత్వం, భద్రత విషయానికి వస్తే ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడదని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నొక్కిచెప్పారు. శుక్రవారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగిస్తూ ప్రస్తుత ప్రపంచ వాతావరణంలో భారతదేశం సమతుల్యత, బాధ్యత యొక్క స్వరంగా మారిందని ఇండోపసిఫిక్, గ్లోబల్ సౌత్‌లోని దేశాలు న్యూఢిల్లీని నమ్మకమైన భాగస్వామిగా చూస్తున్నాయని ఆయన అన్నారు. భారతదేశం ఆర్థికవృద్ధి, సాంకేతిక సామర్థ్యాలు, సూత్రప్రాయమైన విదేశాంగ విధానం మారుతున్న ప్రపంచ వాతావరణంలో సమతుల్యత, బాధ్యత యొక్క స్వరంగా మారాయన్నారు. ఇండోపసిఫిక్, గ్లోబల్ సౌత్‌లోని దేశాలు మమ్ములను నమ్మకమైన భాగస్వామిగా చూస్తున్నాయని తెలిపారు. చాణక్య రక్షణ సంభాషణలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. భారతదేశం బాధ్యతాయుత భావన, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి, నాగరికత విలువలలో పాతుకుపోయిన విశ్వాసంతో ప్రపంచ చర్చలను రూపొందిస్తుందని రాజ్‌నాథ్‌సింగ్ నొక్కి చెప్పారు. విప్లవాత్మక సంస్కరణల కారణంగా దేశాల సార్వభౌమత్వాన్ని నియమాల ఆధారిత క్రమాన్ని గౌరవించడం పట్ల దాని స్థిరమైన వైఖరి కారణంగా భారతదేశం ప్రపంచ విశ్వాసాన్ని సంపాదించుకుందని వివరించారు. 'భద్రత, కనెక్టివిటీకి మద్దతుగా భారత్ సరిహద్దు, సముద్ర మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తోంది. కొత్త వేదికలు, సాంకేతికతలు, నిర్మాణాల ద్వారా మేం మా దళాలను కూడా ఆధునీకరిస్తున్నాం' అని రక్షణమంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో యుద్ధక్షేత్రాలను రూపొందించే స్టార్టప్‌లు, డీప్‌టెక్ సామర్థ్యాలు, పరిశోధన, అభివృద్ధిలో భారతదేశం పెట్టుబడులు పెడుతోందని సింగ్ చెప్పారు.

## యుపిలో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం



**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో మరో అంబేద్కర్ విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశా రు. వరుసగా ఇది ఐదవ ఘటనగా పోలీసులు శుక్రవారం తెలిపారు. యూపీలోని గద్వార్ ప్రా ంతంలో కొందరు గుర్తు తెలియని దుండగులు అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశా రు. దీంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తత చెలరేగిందని పోలీసులు అన్నారు. రాంపూర్ అస్లీ గ్రామంలోని గద్వార్‌నాగ్రా రహదారి వెంబడి ఏర్పాటు చేసిన విగ్రహం వేలును బుధవారం రాత్రి కొందరు దుండగులు ధ్వంసం చేశారు. ఆగ్రహించిన గ్రామస్తులు నిరసన చేపట్టారు. ఇది ఈ ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహాలు లక్ష్యంగా జరిగిన ఐదవ దాడిగా పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటన అనంతరం సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ (ఎస్‌డీఎం) రవి కుమార్, సిటీ సర్కిల్ ఆఫీసర్ ఉస్మాన్, ఇతర పోలీస్, పరిపాలనాధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని, రక్షణ సరిహద్దు గోడ, సీసీటీవీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానికులు వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు.

## ఎమ్మెల్యేపై అత్యాచారం కేసు

**తిరువనంతపురం:** కేరళ కాంగ్రెస్ ఎమ్మెల్యే రాహుల్ మామ్‌కుటత్తిల్‌పై అత్యాచారం కేసు నమోదైంది. తనపై రాహుల్ అత్యాచారానికి పాల్పడ్డాడని, అనంతరం గర్భం తొలగించుకోవాలని బెదిరించాడని కేరళకు చెందిన ఓ యువతి ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. తాము కొంతకాలం కలిసున్నామని, తనకు బిడ్డ కావాలని బలవంతం చేసి, గర్భం దాల్చిన తర్వాత అబార్షన్ చేయించుకోవాలని రాహుల్ బెదిరింపులకు పాల్పడ్డాడని యువతి తన ఫిర్యాదులో పేర్కొంది. వీరిద్దరి మధ్య జరిగిన సంభాషణకు సంబంధించిన ఆడియో రికార్డులు, వాట్సప్ స్క్రీన్‌షాట్‌ల ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే రాహుల్ స్పందిస్తూ తాను ఏ తప్పు చేయలేదన్నారు. కుట్రపూరితంగా తనపై కేసు నమోదు చేశారని, దీనిని చట్టపరంగా ఎదుర్కొంటానన్నారు. ప్రజలు, న్యాయస్థానం ముందు తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటానన్నారు.

### మణిపూర్‌లోని టెంగ్నౌపాల్ జిల్లాలో

## అసోం రైఫిల్స్ పెట్రోలింగ్ బృందంపై కాల్పులు

**గువహతి/ఇంఫాల్:** మణిపూర్‌లోని టెంగ్నౌపాల్ జిల్లాలో శుక్రవారం అస్సాం రైఫిల్స్ పెట్రోలింగ్ బృందంపై గుర్తుతెలియని ఉగ్రవాదులు కాల్పులు జరిపారని రక్షణ ప్రతినిధి తెలిపారు. పౌర భద్రతను పరిగణనలోకి తీసుకుని భద్రతా సిబ్బంది 'వెంటనే నియంత్రణ మరియు జాగ్రత్తతో ప్రతిస్పందించారు' అని అధికారి తెలిపారు, ఈ ప్రాంతం మయన్మార్ సరిహద్దుకు దగ్గరగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆపరేషన్లు జరుగుతున్నాయి, ఈ ప్రాంతంలో అదనపు దళాలను మోహరించారని ఆయన అన్నారు. ప్రాణనష్టం జరిగిందో లేదో వెంటనే తెలియదని ప్రతినిధి తెలిపారు.

ప్రజాపక్షం
శనివారం, 29 నవంబరు

# కాంగ్రెస్ కర్ణాటక సంక్షోభం

భారత జాతీయ కాంగ్రెస్‌కు ఎన్నికల్లో ఎన్ని ఎదురుదెబ్బలు తగులుతున్నా, అధికారం చేతికందటం అరుదైన లక్షణంగా మారుతున్నా దాని వ్యవహార శైలిలో మార్పురాకపోవటం ఓ విచిత్రం. ఒకనాడు–దీర్ఘకాలం ఆసేతు హిమాచలం గుత్తాధికారం అనుభవించిన, చెలాయించిన పార్టీ జాతీయస్థాయి నాయకత్వం రీత్యా, రాష్ట్రాల్లో అధికారం రీత్యా పలచబడినప్పటికీ, అధికారం అరుదైన చోట సైతం పదవులకోసం కుమ్ములాడుకునే, ప్రతిష్ట దిగజార్చుకునే పాత లక్షణం వెంటబడి తరుముతూనే ఉంది. ఇప్పుడు అధికారంలో ఉన్నదే ముచ్చటగా మూడు రాష్ట్రాలు – హిమాచల్‌ప్రదేశ్, కర్నాటక, తెలంగాణ. కర్నాటక రాష్ట్రంలో రాజకీయాధికారం రగడ అపహాస్యంగా తయారైంది. నెలల తరబడి దాన్ని చక్కదిద్దలేని నిస్సహాయత, అసమర్థత అధిష్టానవర్గంగా పిలవబడే జాతీయ నాయకత్వంలో ఉంది. అధిష్టానవర్గం కూడా సోనియా గాంధి, రాహుల్‌గాంధి, అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేలకు కుంచించుకుపోయింది. వారిలో ఖర్గే కర్నాటకకు చెందినవారు. స్వరాష్ట్రంలో కాంగ్రెస్‌లో అంతర్గత సంఘర్షణను నివారించలేని లేదా పరిష్కరించలేని నిస్సహాయస్థితిలో ఉన్నారాయన. కారణం?

కర్నాటకలో రెండున్నర సంవత్సరాలక్రితం అసెంబ్లీ ఎన్నికలనాటికే కాంగ్రెస్‌లో రెండు బలమైన వర్గాలున్నాయి. పిసిసి అధ్యక్షుడిగా ఉన్న డి.కె.శివకుమార్ కుబేరుడు, సాంప్రదాయకంగా పార్టీపై పట్టున్న వ్యక్తి. రెండో ధృవం మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య. వీరు దేవగౌడ నాయకత్వంలోని జనతాదళ్ (సెక్యులర్) నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన వెనుకబడిన తరగతులకు చెందిన నాయకుడు. దక్షిణాదిలో తమ ప్రవేశానికి ముఖద్వారంగా కర్నాటకను భావించిన భారతీయ జనతాపార్టీ అంతర్గత కుమ్ములాటలవల్ల అధికారం పునరుద్ధరించుకోలేక చతికిలబడింది. దాని అసమర్థపాలనతో విసుగెత్తిన కర్నాటక ఓటర్లు కాంగ్రెస్‌కు పట్టంగట్టారు. కాంగ్రెస్ వారు అధికారంలో లేనప్పుడు ఐక్యంగా పనిచేస్తారన్న నానుడి నిజమైంది. అయితే ఎన్నికల ఫలితాలు వస్తూనే ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య పోటీ మొదలైంది. తన బిసి నేపథ్యంవల్లనే విజయం వరించిందని సిద్ధరామయ్య భావిస్తే, పిసిసి అధ్యక్షునిగా పార్టీకి తన సారథ్యం వల్లనే ప్రతిపక్షంలోని కాంగ్రెస్‌కు పరిపాలనయోగం పట్టిందని శివకుమార్ భావించి ఉంటారు. ఆ వెనుక లింగాయత్, వక్కిళిగ శక్తులు, మఠాలు ఉండనే ఉంటాయి. ఆ పరిస్థితిలో కాంగ్రెస్ హైకమాండ్ కర్నాటక నేతలిద్దర్ని ఢిల్లీ రప్పించి మంతనాలు జరిపి రాజీ చేసింది. ఈ 'ఐదుగురు ఒప్పందం' ప్రకారం సిద్ధరామయ్య, శివకుమార్‌లు చెరో రెండున్నర సంవత్సరాలు ముఖ్యమంత్రి పదవిలో ఉంటారని అప్పుడు బయటకొచ్చిన మాట. దాన్ని నెరవేర్చాలని శివకుమార్ వర్గం ఇప్పుడు డిమాండ్ చేస్తోంది. 'నోటి మాట ప్రపంచంలోనే శక్తిమంతమైంది' అని శివకుమార్ స్వయంగా అన్నారు.

ఆ సమయం సమీపిస్తున్నందున శివకుమార్ అనుచర నాయకులు ఢిల్లీ చేరుకుని అధికార పీఠం మార్పు గూర్చి ఖర్గేమీద ఒత్తిడి తేవటం మొదలుపెట్టారు. సిద్ధరామయ్య, శివకుమార్ ఇద్దరూ అధిష్టానం మాటకు బద్ధులమని అంటూనే ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. కొద్ది నెలలుగా కొనసాగుతున్న ఈ గందరగోళం పార్టీ ప్రతిష్టకు నష్టం చేస్తుందని అధిష్టానవర్గానికి తెలుసు. పార్టీ శాసనసభ్యుల్లో తనకే మెజారిటీ ఉందని, వచ్చే రెండు బడ్జెట్లు తానే సమర్పిస్తానని సిద్ధరామయ్య. మెజారిటీ–మైనారిటీ సమస్య పక్కనబెడితే రాహుల్‌గాంధి ఇప్పుడు ఒబిసిలకు న్యాయం చేకూర్చే రాజకీయం నడుపుతున్నాడు. తమిళనాడు, కేరళలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్న తరుణంలో బిసి అయిన సిద్ధరామయ్యను తొలగిస్తే అది పార్టీకి నష్టమన్న ఆందోళన ఆయనలో ఉండవచ్చు. అందువల్ల కాంగ్రెస్ పార్టీకి కర్నాటక చిక్కు సమస్యగా తయారైంది. సిద్ధరామయ్య మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు అనుమతి కోరుతుండగా, శివకుమార్ ముందుగా ముఖ్యమంత్రి విషయం తేల్చాలంటున్నారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు అధిష్టానం అనుమతి ఇస్తే అది సిద్ధరామయ్య పూర్తి పదవీ కాలానికి సంకేతమవుతుందని ఆయన అనుయాయులు ఆశపడుతున్నారు.

ఈ సంక్షోభ పరిష్కారాన్ని పార్టీ అధిష్టానం ఇంకా జాప్యం చేయలేదు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి శివ కుమార్‌లను ఢిల్లీ పిలిపించి చర్చలు జరుపుతామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే గురువారంనాడు చెప్పారు. దానినిబట్టి అధిష్టానం ఒక నిర్ణయానికి వచ్చినట్లుగా భావించవచ్చు. సత్వర నిర్ణయం తీసుకుని సర్దుబాటు చేయటమే పార్టీకి ప్రయోజనం. అందువల్ల వచ్చేవారంలో కర్నాటక సంక్షోభానికి తెరపడుతుందని ఆశించుదాం.

# స్వచ్ఛమైన నీరే ప్రాణాధారం

మానవునికి, సమస్త జీవ రాశికి ఆహారం తర్వాత కావలసిన దివ్య ఔషధం నీరు. నేడు పరిశుభ్రమైన నీరు సేవనం లేకపోవడం వల్ల కోట్లాదిమంది వివిధ రకాల జబ్బుల తో బాధపడుతూ వున్నారు. జలమే జీవనం..జీవితం. మంచి స్వచ్ఛమైన తాగునీరు వాడకం మన శరీరం రోగాల బారినపడకుండా సంరక్షించే ఒక గొప్ప సంజీవిని అని చెప్పవచ్చు. శుభ్రమైన తాగునీరు వాడకం మన ఆరోగ్య పరిరక్షణకు ఔషధం. చక్కటి శరీర సౌష్టవానికి, మన శరీరం జబ్బుల బారిన పడకుండా ఉండటానికి ఉచితమైన మెడిసిన్ ఏదైనా ఉందంటే అది ఒక్క శుద్ధి చేసిన నీరు మాత్రమే! వేకువజామున రెండు మూడు గ్లాసుల గోరు వెచ్చని నీరు సేవించామంటే చాలు మన లో అంతవరకు ఆవహించి వున్న నిస్సత్తువ తొలిగిపోయి రోజంతా మన శరీరం ఎనలేని ఉత్సాహాన్ని సంతరించుకుంటుంది. ముఖ్యంగా మండు వేసవిలో తగినంత సమపాళ్ళలో స్వచ్ఛమైన నీరు సేవించడం మూలాన మన బాడీ డిహైడ్రేషన్ బారిన పడకుండా అత్యంత సురక్షితంగా ఉంటుంది!

అందుకనే ప్రజలందరూ స్వచ్ఛమైన నీరును సేవిస్తూ మంచి ఆరోగ్యవంతులుగా జీవించాలనే ఏకైక లక్ష్యంతో మన రాష్ట్ర ప్రభుత్వం వారు అనేక ప్రాంతాల్లో, పట్టణాల్లో, పల్లెల్లో ఉచిత బోర్లు వేస్తూ ప్రజలందరిలో జల కళ తీసుకువచ్చేలా అవిరళ కృషి సల్పుతున్నది. మిషన్ కాకతీయ ద్వార నీరు ప్రతీ ఇంటికీ సరఫరా చేయాలన్న లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరడం లేదు. ఏదిఏమైనా స్వచ్ఛమైన నీటివాడకం అనేది మన ఆయుష్షును అమాంతం పెంచడమే కాకుండా మనం దీర్ఘకాలిక వ్యాధుల బారినపడకుండా సదా ఆరోగ్యవంతులుగా జీవించేందుకు మనకు ఒక గొప్ప సువర్ణ అవకాశాన్ని కల్పిస్తుంది.

ఏమైనా స్వచ్ఛమైన త్రాగునీరు అందించే ప్రయోజనాలు అన్ని ఇన్ని కావు.ఒక విధంగా చెప్పాలంటే మన శరీరాన్ని జబ్బుల మయం చేసుకొని హాస్పిటళ్ళ చుట్టూ తిరుగుతూ,డాక్టర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ వారికి చెల్లించే ఫీజుల రూపంలో మన జేబులకు అమాంతం చిల్లుపడకుండా చేసుకోవాలంటే మాత్రం స్వచ్ఛమైన మంచి త్రాగునీరు సేవనం మనందరికీ అత్యంత ఆవశ్యకం, ఎనలేని ఉపయోగకరం! ఇందులో ఎలాంటి సందేహానికి తావు లేదు. నేడు ప్రతీ గ్రామంలో గుర్తింపు లేని వాటర్ ప్లాంట్‌లు విచ్చలవిడిగా వెలిశాయి.అధిక మోతాదులో వివిధ కెమికల్స్ కలిపి విక్రయిస్తూ వున్నారు. ఐ.యస్.ఇ గుర్తింపు లేవు. ఆటోలు ఏర్పాటు చేసి వాని ద్వారా ప్రతీ ఇంటికి నామ మాత్రపు డబ్బుతో నీటిని సరఫరా చేస్తున్నారు. వాని ద్వారా వివిధ నొప్పులు, కాళ్ళు లాగడం లాంటివి సంభవించి అనారోగ్యం పాలు అవుతూ వున్నారు. ప్రభుత్వం, అధికారుల నిఘా తగ్గి విచ్చలవిడిగా నీటి ప్లాంట్స్ వెలిస్తూ వున్నాయి. స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసే బాధ్యత ప్రభుత్వానిదే.

# జాగ్వార్ల సంరక్షణతోనే అడవికి ఆరోగ్య భరోసా

అమెరికాలో అతిపెద్ద అడవి పులి అయిన జాగ్వార్ పాంథేరా ఓంకా మన గ్రహంలోని వృక్ష,జంతుజాల సమతుల్యానికి అత్యంత కీలకమైన జంతువు. జాగ్వర్ పెద్ద పిల్లి జాతిగా భావించబడుతుంది. దట్టమైన అరణ్యాలలో, చిత్తడి నేలల్లో ఉండటానికి ఇష్టపడుతుంది.శరీర పొడవు ఆరు అడుగుల పై ఉండి 160 కిలోల వరకు బరువు ఉంటుంది. లేత పసుపు గోధుమ రంగు చర్మాన్ని కలిగి ఉండి శరీరం మొత్తం రోసెట్ లుగా మారే నలుపు, నారింజమచ్చలతో కప్పబడి ఉంటుంది. చర్మంపై ఉండే ఈ రోసెట్టి ముద్రలు జాగ్వార్లను ఒక్కోదానికి ఒక్కోలా, ప్రత్యేకంగా ఉంచే ప్రకృతి ప్రసాదించిన గుర్తింపు లక్షణం. అమెజాన్, పాంటనాల్ వంటి అడవుల్లో ఇది ఇంకా నిర్విరామంగా జీవ వ్యవస్థలను నిలబెడుతోంది. జాగ్వార్ అనగా శక్తి. మెసోఅమెరికన్, మాయా నాగరికత, సంస్కృతిలో జంతువుల రాజుగా, పవిత్ర జంతువుగా భావించేవారు.

**ప్రత్యేకమైన వేట శైలి :** జాగ్వార్ జీవనశైలి కూడా అత్యంత విశిష్టమైనది. ఇది సాధారణంగా ఒంటరిగా జీవిస్తాయి. వ్యూహాలతో సంచరిస్తూ ప్రధానంగా రాత్రివేళ వేటాడుతుంది. జాగ్వర్లు తమ మధ్య సహనం, స్నేహ భావనతోనే ఉంటాయి. సుదూర సంభాషణల కోసం గర్జనను వినియోగించుకుంటాయి. సహజంగా 10 నుండి 12 సంవత్సరాలు జీవిస్తాయి. విసర్జితాలతో తన ప్రదేశానికి హద్దులు నిర్ణయిస్తుంది. గట్టి శరీరం, అత్యంత బలమైన దవడలు, తక్కువ శక్తితో ఎక్కువ ఫలితమిచ్చే వేట వ్యూహం దీనికి సహజ బలాన్ని ఇస్తాయి. ఇతర పెద్ద పిల్లులు గొంతును లక్ష్యంగా చేస్తే జాగ్వార్ నేరుగా తలపై కాటు వేసి బలిని వెంటనే నిర్వీర్యం చేస్తుంది. నీటిలో అద్భుతంగా ఈదగలవడం వల్ల చేపలు, కైమాన్ వంటి చిన్న మొసళ్ళను కూడా సులభంగా పట్టుకుంటుంది. అంతర్జాతీయ జాగ్వార్ దినోత్సవం ప్రతి సంవత్సరం నవంబర్ ఇరవై తొమ్మిదో తేదీన ప్రపంచ సమాజానికి జాగ్వార్ల రక్షణకు ఒక గంభీర సందేశం ఇస్తుంది.. 2018లో పాంథెరా ఐక్యరాజ్యసమితి ప్రారంభించిన జాగ్వర్ 2030 రోడ్డుమాప్ ద్వారా అమెరికా, మెక్సికో నుంచి అర్జెంటీనా వరకు ఉన్న జాగ్వార్ కారిడార్‌లను పునరుద్ధరించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. కెమెరా ట్రాప్‌లు,ఉపగ్ర హ కాలర్‌లు స్పాటిల్ కాప్చర్, రికాప్చర్ నమూనాల సహాయంతో శాస్త్రవేత్తలు సంరక్షణ పథకాలు రూపొందిస్తున్నారు. ఎకోటూరిజం ద్వారా స్థానిక సమాజాలను భాగస్వాములుగా చేస్తూ పర్యావరణ ఆర్థిక సమతుల్యత సాధిస్తున్నారు. జాగ్వార్లను సంరక్షించుకుంటేనే అడవులతో పాటు ప్రకృతి సమతుల్యతను సాధించవచ్చు.

## పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పట్ల

# అంబేద్కర్ దార్శనికత, సవాళ్లు



డి.రాజా
ప్రధాన కార్యదర్శి, సిపిఐ

నవంబర్ 26న మనం రాజ్యాంగ దినం జరుపుకున్నాం. రాజ్యాంగం మన ప్రజాస్వామ్యాన్ని తీర్చిదిద్దుతున్నది. మరికొద్ది రోజులకు, డిసెంబర్ 1న పార్లమెంటు శీతాకాల సమావేశం మొదలవుతుంది. 15 సిట్టింగ్‌లు ఉంటాయని భావించబడుతున్నది. వాటిలో మూడు ప్రైవేటు మెంబర్ బిజినెస్‌కు కేటాయించబడ్డాయి. మరికొద్ది రోజులకు, డిసెంబర్ 6న, దేశం మన రాజ్యాంగ ముఖ్య రూపశిల్పి అయిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి జరుపుకుంటుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఎంతో గట్టిగా, ధైర్యంగా సమర్థించిన వారిలో అంబేద్కర్ ఒకరు. ఈ సంవత్సరం ఈ మూడు తేదీలు అతిదగ్గరగా రావటం క్యాలెండర్ వరుస క్రమాన్ని మించిన ప్రాముఖ్యతగలవి. మన రిపబ్లిక్ ఆరోగ్యాన్ని, హరించుకుపోతున్న శాసనసంస్థల (పార్లమెంటు, అసెంబ్లీలు) పనితీరును, మన ప్రజాస్వామిక జీవితానికి కేంద్రకమైన జవాబుదారీతనాన్ని తిరిగి పొందవలసిన అత్యవసరాన్నీ పరిశీలించేందుకు అవి లెన్స్‌లాగా పనిచేస్తాయి.

రాజ్యాంగ నిర్ణాయక సభ మన రిపబ్లిక్ భవిష్యత్ స్వరూపాన్ని చర్చిస్తున్నప్పుడు అంబేద్కర్ స్పష్టంగా అధ్యక్షతరహా వ్యవస్థను (అధ్యక్ష తరహా ప్రభుత్వరూపం) తిరస్కరించారు. భారతదేశానికి కార్యనిర్వాహకవర్గం నిరంతరం లెజిస్లేచర్‌కు బాధ్యురాలిగా ఉండే వ్యవస్థ కావాలని, ఏ ఒక్క వ్యక్తికీ తిరుగులేని అధికారం ఉండకూడదని అన్నారు.

''రాజకీయాలు, భక్తి లేదా హీరో ఆరాధన దిగజారుడుకు, అంతిమంగా నియంతృత్వానికీ దారితీస్తుందని'' అంబేద్కర్ చెప్పిన మాట ప్రసిద్ధి పొందింది. ఒక మహోన్నత నాయకుడు లేదా సంస్థ చేతిలో అధికారం ఉంచే వ్యవస్థకన్నా సమష్టి బాధ్యతతో కూడిన నమూనాను ఆలింగనం చేసుకోమని భారతీయులకు ఆయన విజ్ఞప్తి చేశారు. అప్పుడు పార్లమెంటరీ వ్యవస్థారీతి ఎంచుకోబడింది. బ్రిటిష్ పాలన ద్వారా అది ఎక్కువ ప్రాచుర్యం పొందిందని దాన్ని ఎంచుకోలేదు; అది సహజసిద్ధంగానే మరింత జవాబుదారీతనం గలదీ, చర్చలకు అవకాశమున్నదీ, ప్రజల సర్వసత్తాక అభీష్టాన్ని ప్రతిబింబించేదీ కావటంవల్ల దాన్ని ఎంచుకున్నారు.

అయితే, ఈ సంవత్సరం రాజ్యాంగ దినం నుంచి అంబేద్కర్ వర్ధంతి రోజుకు మనం ప్రయాణిస్తున్నప్పుడు ఆయన వ్యక్తీకరించిన ఆదర్శాలకు, మన కళ్లముందు కనిపిస్తున్న వాస్తవికతకు మధ్య జాగా విస్తృత మైనట్లు కనిపిస్తున్నది. ఈ దిగజారుడు మరెక్కడికన్నా, పార్లమెంటు పనితీరులోనే మరింత స్పష్టంగా కనిపిస్తున్నది. ''మన ప్రజాస్వామ్యానికి నాడీ కేంద్రం''గా అంబేద్కర్ అభివర్ణించిన సంస్థ దాని స్ఫూర్తి, ఆచరణ రెండింటిలోనూ అణచివేయబడుతున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. తొలి లోక్‌సభ సంవత్సరంలో 135 రోజులు సమావేశమైంది. చర్చలు, అసమ్మతి, బలమైన పరిశీలనకు అవకాశం కలిగింది. నాల్గవ లోక్‌సభ కూడా సగటున 123 రోజులు సమావేశాలు జరిపింది. అయితే ఇటీవల సంవత్సరాలు ఈ తగ్గదలను చారిత్రకంగా అతి తక్కువస్థాయికి తీసుకెళ్లాయి. 16వ లోక్‌సభ వార్షిక సగటు 66 సిట్టింగ్‌లు, 17వ లోక్‌సభ మరీ అధమంగా 55 సిట్టింగ్‌లకు దిగజారింది. 1952 నుంచి ఇదే అత్యంత తక్కువ రోజులు సమావేశాలు జరిపిన లోక్‌సభ. 17వ లోక్‌సభ 15 సెషన్స్‌లో 11 అర్థాంతరంగా వాయిదా పడ్డాయి. దాంతో జరగాల్సిన 40 సిట్టింగ్‌లు రద్దయినాయి, పార్లమెంటు నిర్ణీత పనిదినాల్లో సుమారు 13 శాతం దేశం కోల్పోయింది. 2020లో లోక్‌సభ మొత్తం సంవత్సరంలో 33 రోజులు మాత్రమే సమావేశమైంది. ఈ వ్యవస్థ రాజ్యాంగం ఆశించిన దానికి విరుద్ధంగా ఎంతగా దిగజారిందో ఇది కొట్టొచ్చినట్లు తెలియజేస్తున్నది.

17వ లోక్‌సభ దాని మొత్తం 5సంవత్సరాల కాలంలో 274 సార్లు మాత్రమే సమావేశమైంది. భారత పార్లమెంటరీ చరిత్రలో పూర్తి కాలం పనిచేసిన సభలో అతి తక్కువ సిట్టింగ్‌లు జరిగింది ఈ లోక్‌సభ టరంలోనే. పనిచేసిన కాలం తగ్గిపోయింది అంటే ప్రభుత్వ పనితీరును పరీక్షించే కాలం తగ్గిపోయినట్లే. 17వ లోక్‌సభ ఆమోదించిన 179 బిల్లుల్లో (ఫైనాన్స్, అప్రోప్రియేషన్ బిల్లు మినహాయించి) 35శాతం గంటలోపు చర్చతోనే ఆమోదం పొందాయి. ప్రవేశపెట్టిన బిల్లుల్లో 16శాతం మాత్రమే రాజకీయ పక్షపాత ఒత్తిళ్లు లేకుండా సవివరంగా స్క్రూటినీ చేసేందుకు ఉద్దేశించిన పార్లమెంటరీ కమిటీలకు నివేదించబడ్డాయి. అంటే సిట్టింగ్స్ కుదించుకుపోయినందున ప్రభుత్వం ఆగమేఘాలమీద అతి కొద్దిసమయం చర్చతో బిల్లులు ఆమోదించుకుంది. పార్లమెంటు పనితీరు డొల్లగా తయారైనందున కార్యనిర్వాహకవర్గం జవాబుదారీతనం తగ్గిపోయింది.

పార్లమెంటరీ వ్యవహారసరళి ఈ విధంగా దిగజారటం ఆందోళనకరమైన కొత్తధోరణిలో మరింతగా ప్రతిబింబిస్తున్నది. ఆ ధోరణి ఏమంటే, అధికారపక్ష సభ్యులు సభా కార్యక్రమాలను అడ్డుకుంటున్నారు. ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్‌లు మీదుమిక్కిలి పెరిగాయి. పాలకపార్టీ సభ్యులు సభ హుందాతనాన్ని తుంగలోతొక్కి, ఉద్దేశపూర్వకంగా చర్చలను స్తంభింపచేయటం ద్వారా చర్చలు కుదించటానికి తోడ్పడుతున్నారు.

ప్రతిపక్ష సభ్యులను అతి తరచుగా సస్పెండ్ చేయటం, చట్టసమ్మతమైన ప్రశ్నలు లేవనెత్తినందుకు కూడా సస్పెండ్ చేయటం పార్లమెంటును ఏకపక్ష గోదాగా మార్చుతున్నది. ఇది కార్యనిర్వాహక అధికారం – లెజిస్లేటివ్ స్క్రూట్నీ మధ్య అసమతౌల్యాన్ని పెంచుతున్నది. ఈ వక్రీకరణ యాదృచ్ఛికం కాదు. మన ప్రజాస్వామ్యంలో ప్రజల సర్వసత్తాక అభీష్టాన్ని ప్రతిబింబించే పార్లమెంటును ఒక కేంద్రీకృత, ఒక భావజాలంతో పనిచేసే కార్యనిర్వాహకవర్గానికి లోబడి ఉండే సాధనంగా కుదించే ఉద్దేశపూర్వక ప్రయత్నాలలో ఇది భాగం.

అంబేద్కర్ కచ్చితంగా ఈ ప్రమాదం గూర్చే హెచ్చరిక చేశారు. భారతదేశం సంస్థలకన్నా నాయకులను పైకెత్తే రాజకీయ వాతావరణంలో నిరంకుశ దగ్గరిదార్లతో రాజ్యాంగబద్ధ పద్ధతులను తొలగించవచ్చునని ఆయన భయాందోళన వ్యక్తం చేశారు.

కీలకమైన సంస్థలను – దర్యాప్తు సంస్థల నుంచి నియంత్రణ (రెగ్యులేటరీ) సంస్థల వరకు, విశ్వవిద్యాలయాల నుంచి మీడియా వరకు అవి అధికారం లో ఉన్నవారి ప్రాపంచిక దృక్పథాన్ని పంచుకునేటట్లు నెట్టబడుతున్న వ్యవస్థ ఆవిర్భవించటాన్ని మనం ఈనాడు చూస్తున్నాం. అవి కార్యనిర్వాహకవర్గంపై అదుపులుగా వ్యవహరించే బదులు ఒక నిర్దిష్టమైన భావజాలానికి విస్తరణలుగా పనిచేయటం పెరుగుతున్నది. అవి రాజ్యాంగ విలువలైన సమానత్వం, సౌభ్రాతృత్వం, సెక్యులరిజం, ప్రజాస్వామిక జవాబుదారీతనంలను తరచూ కసితో ధిక్కరిస్తున్నాయి.

వ్యవస్థల మధ్య ఈ అసమతౌల్యం మధ్య తరచూ విస్మరించబడుతున్న మరో ఆందోళనకరమైన ప్రమాదం ఉంది. అది భారతదేశ సమాఖ్య వ్యవస్థను (ఫెడరలిజం) బలహీనపరచటం. అంబేద్కర్, రాజ్యాంగ సభ ఇతర సభ్యులు భారత్ ఒక యూనిటరీ (ఏకవ్యక్తి లేక వ్యవస్థ) కమాండ్‌గా కాకుండా ''యూనియన్ ఆఫ్ స్టేట్స్''గా ఉండాలని – అంటే సమాఖ్య వ్యవస్థగా ఉండాలని నిర్ద్వంద్వంగా వక్కాణించారు. అంటే కేంద్రం(యూనియన్), రాష్ట్రాలు ఒకటి నుంచి మరొకటి కాకుండా రాజ్యాంగం నుంచి తమ అధికారం పొందుతాయి. అయితే నేడు ఫెడరలిజమే ఒత్తిడిలో ఉండటం మనం చూస్తున్నాం.

ద్రవ్య అధికారాలను కేంద్రం తన చేతిలోకి తీసుకోవటం పెరుగుతున్నది. కేంద్రం–రాష్ట్రాల మధ్య పన్నుల సొమ్ము పంపిణీ తగ్గిపోవటంలో, కేంద్ర ప్రాయోజక పథకాలపై ఆధారపడటం పెరుగుతుండటంలో, జిఎస్‌టి కౌన్సిల్ పనితీరులో దీన్ని మనం చూస్తున్నాం. దీని వల్ల తమ ప్రజలకు కావలసిన పథకాలు రూపొందించడంలో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి కుంచించుకుపోతున్నది. శాసనాలు నిరోధించడానికి, ఆమోదముద్ర వేయటాన్ని జాగు చేయటానికి లేదా ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వాల్లో జోక్యం చేసుకోవటానికీ గవర్నర్‌లను తరచుగా, పక్షపాతంతో ఉపయోగించటం, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో రాజకీయ ప్రత్యర్థులకు వ్యతిరేకంగా కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించటం పెరుగుతుండటంతో రాజ్యాంగ సాధనాలు వేధింపు సాధనాలుగా మార్చబడుతున్నాయి.

ప్రభుత్వ సంస్థల మధ్య సంభాషణల అవకాశాలు క్షీణించడం, అంతర్ రాష్ట్ర మండలి వంటి సంస్థలను పక్కన పెట్టడం వల్ల అంబేద్కర్ తలపోసిన సహకార స్ఫూర్తిని హరిస్తున్నది. ప్రజాస్వామ్యపు ఫెడరల్ పునాదులు బలహీనపడినప్పుడు అది ఆరోగ్యంగా ఉండజాలదు. రాష్ట్రాల నోరునొక్కటం అంటే అది అంతిమంగా అవి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజల నోరు నొక్కటమే అవుతుంది.

ఈ కేంద్రీకృత విధానం పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. పార్లమెంట్ సంవత్సరంలో సగటున 55 రోజులే సమావేశ మైనప్పుడు, పార్లమెంటరీ స్క్రూటినీ కుప్పకూలినప్పుడు, అసమ్మతిని అవిధేయతతో సమానంగా చూచినప్పుడు, ప్రశ్నల స్థానంలో ఉత్తర్వులు జారీ అవుతున్నప్పుడు, జవాబుదారీతనం స్థానంలో ముఖస్తుతి ప్రవేశించినప్పుడు రిపబ్లిక్ బలహీనపడడం మాత్రమే జరగదు. ఆ వ్యవస్థ అప్రకటిత ఫాసిజంలోకి దిగజారుడును ప్రతిబింబిస్తుంది. ఏ ప్రజాస్వామ్యం రాత్రికిరాత్రి కూలిపోదు. అది నెమ్మదిగా, ఒక సంస్థ తర్వాత మరో సంస్థ వంతున కోతకు గురవుతాయి.

అందువల్ల అంబేద్కర్ దోహదాలను ఎలా స్మరించుకుంటున్నామన్నది ప్రశ్నకాదు. ఆయన దార్శనికతను ఎలా గౌరవిస్తున్నామన్నది ప్రశ్న. ప్రజలను ఎన్నడూ ప్రేక్షకులుగా కుదించరాదని ఆయన విశ్వసించారు. ఏ దేశం పార్లమెంటు అయితే అతి తక్కువ దినాలు సమావేశమవుతుందో,అరుదుగా చర్చలు జరుపుతుందో, ప్రతిపక్షం నోరు ఎక్కువగా మూయిస్తుంటుందో ఆదేశం ఆ దార్శనికతనుంచి దూరం జరుగుతున్నట్లు భావించాలి.

ఈ క్షీణింపును వెనక్కు మళ్లించడం, జవాబుదారీతనాన్ని పునరుద్ధరించటం మన రాజకీయ జీవిత ప్రాథమిక లక్ష్యం కావాలి. జవాబుదారీతనం కోసం పోరాటం మూడు రంగాల్లో ఏకకాలంలో ప్రారంభించాలి. అవి రాజకీయ, భావజాల, లీగల్ రంగాలు. రాజకీయ రంగంలో పోరాటం ప్రజాస్వామ్యయుత నిజాయితీకి ప్రాధాన్యతయిచ్చే ప్రజా సమీకరణ, ఎన్నికల్లో సరైన ఎంపికల ద్వారా జరగాలి. భావజాలరంగంలో పోరాటం పిడివాద కథనాలకు వ్యతిరేకంగా రాజ్యాంగ విలువల పునరుద్ఘాటన ద్వారా జరగాలి. లీగల్ రంగంలో పోరాటం నిరంకుశ కార్యనిర్వాహక ఉత్తర్వులను సవాలు చేస్తూ, కోర్టులు, బహిరంగ వేదికల్లో వ్యవస్థాగత స్వాతంత్ర్యాన్ని సమర్థిస్తూ జరగాలి.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి కొత్త జవసత్వాలు చేకూర్చటానికి ప్రతి క్యాలెండర్ సంవత్సరంలో పార్లమెంటు కనీసం 100 రోజులు సమావేశం కావాలని ఆదేశించటం ఒక నిర్దిష్టమైన చర్య అవుతుంది. ఇది ప్రతీకాత్మక డిమాండ్ కాదు, వ్యవస్థాగత అవసరం. మరిన్ని రోజులు సమావేశం కావటం చర్చలకు, ప్రభుత్వ చర్చలను, బిల్లులను మరింతగా స్క్రూట్నీ చేసేందుకు సహజంగానే సమయం ఇస్తుంది. తమ ఫిర్యాదులను, ఆందోళనలను వ్యక్తీకరించేందుకు ప్రతి పక్షానికి వేదిక అవుతుంది. ప్రజాస్వామిక నిర్ణయాలు చేసే కేంద్రంగా పార్లమెంటును తిరిగి పునఃప్రతిష్ఠిస్తుంది. భారతదేశం తన జాతీయ చట్టసభను లాంఛనప్రాయ సంస్థగా నిర్వహిస్తూ తమది ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యం అని చెప్పుకోజాలదు.

మనం రాజ్యాంగ దినం నుంచి అంబేద్కర్ వర్ధంతి దిశగా ప్రయాణించేటపుడు ఈ ఆలోచనలు పదునైన అర్థం అందించాలి. రాజ్యాంగం సంవత్సరంలో ఒకసారి వేడుకచేసుకునే డాక్యుమెంట్ మాత్రమే కాదు. లేక అంబేద్కర్ పూలమాలలతో గౌరవించుకునే విగ్రహం మాత్రమేకాదు. ఆ రెండూ, జవాబుదారీతనంపై ఆధికారం ఆధిపత్యం వహించటాన్ని నిరోధించేందుకై మనం ప్రతినెల, ప్రతి సమావేశంలో, ప్రతిరోజు వినియోగించవలసిన నిఘాకు ప్రాతినిధ్యం వహిస్తాయి. ప్రజాస్వామ్యం బలం ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పు సైజుతో కొలవబడదు. దానికున్న అదుపులు, సమతులనాలను బట్టి, తమ సర్వసత్తాక అభీష్టాన్ని పరిరక్షించుకునేందుకు తన ప్రజలకున్న ధైర్యాన్నిబట్టి కొలవబడుతుంది.

భారతదేశ భౌగోళిక స్వరూపాన్ని తిరిగి కూర్చువేయటానికి ఫాసిస్టు శక్తులు (ఆర్ఎస్ఎస్ – బిజెపి) ప్రయత్నిస్తున్న ఈ సమయంలో కార్యాచరణకు పిలుపు సుస్పష్టం; జవాబుదారీతనాన్ని తిరిగిపొందుదాం, లేదా అంబేద్కర్ సహాయంతో నిర్మించబడిన రిపబ్లిక్‌ను కోల్పోయే ప్రమాదం ఎదుర్కొందాం. భారతదేశ ప్రజాస్వామ్య ఆత్మకోసం పోరాటాన్ని అవిశ్రాంతంగా, సమష్టిగా, రాజ్యాంగం ఇచ్చిన హామీ పట్ల అరమరికలులేని నిబద్ధతతో సాగించాలని డాక్టర్ అంబేద్కర్ వారసత్వం మనకు గుర్తుచేస్తున్నది.

**అధికారం ఎల్లపుడూ, ప్రజలకు మాత్రమే చెందుతుంది అనేది రాజ్యాంగం ఇచ్చిన హామీ!**

# చైనాకు భారత ఎగుమతులు పెరిగాయా!

## జనాలకు గోదీ మీడియా చెబుతున్న నిజానిజాలేమిటి?




ఎం.కోటేశ్వరరావు

చైనాకు ఏడు నెలల్లో 25 శాతం పెరిగిన భారత ఎగుమతులు. మీడియాలో కొద్ది రోజుల క్రితం వచ్చిన శీర్షిక ఇది. ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు వరుసగా ఏడు నెలల నుంచీ పెరుగుతూనే ఉన్నాయి. మంచిదే, మన ఎగుమతులు ఏమాత్రం పెరిగినా సంతోషించాల్సిందే. అయితే అసలు కథేమిటంటే నరేంద్రమోదీకి భజన చేసేందుకు అలవాటుపడిన వారు చేసిన జిమ్మిక్కు ఇది. నిజంగా జరిగిందేమిటి? గతేడాదితో పోలిస్తే ఎగుమతులు పెరిగిన మాట నిజం. ఇదే సమయంలో చైనా నుంచి దిగుమతులు అంతకంటే ఎక్కువగా పెరిగిన సంగతి, పదేండ్ల క్రితం స్థాయికి ఎగుమతులు పడిపోయిన నిజాన్ని జనాలకు చెప్పరేం! నరేంద్రమోదీ ఏలుబడి పదకొండు సంవత్సరాలను మూడు భాగాలుగా విభజిద్దాం. 2014–15 నుంచి 2018–19 మధ్య కాలంలో చైనాకు మన ఎగుమతులు 11.96 నుంచి 16.75 బిలియన్ డాలర్లకు పెరిగాయి. తరువాత మూడు సంవత్సరాలలో 21.56 బిలియన్ డాలర్లకు చేరాయి. అప్పటి నుంచి 2024–25లో 14.25 బిలియన్ డాలర్లకు పతనమయ్యాయి. గత ఏడాది తొలి ఏడు నెలలతో పోల్చి చూపి వర్తమాన సంవత్సరంలో 10.03 బిలియన్ డాలర్లకు 25శాతం పెరిగినట్లు చిత్రించారు. మిగిలిన ఐదు నెలల కాలంలో గత ఏడాది మొత్తాలకు చేరవచ్చు, స్వల్పంగా పెరగవచ్చు తప్ప గతంలోని 21.56 బిలియన్ డాలర్లకు చేరే స్థితి ఉందా ? చైనాకు మన ఎగుమతులు పెరగటం వెనుక అంతర్జాతీయ రాజకీయాలు కూడా లేకపోలేదు. అమెరికా వైపు మొగ్గుచూపుతున్న నరేంద్రమోదీకి పన్నుల రూపంలో ట్రంప్ తీసుకున్న వైఖరి మింగుడు పడలేదు. ఈ స్థితిలో ఎత్తుగడ కావచ్చు, అవసరం కావచ్చు. చైనా ఏప్రిల్ నుంచి మన దేశం నుంచి దిగుమతులను పెంచింది. చైనాకు మన మార్కెట్‌ను ఎంతగా తెరిస్తే దానికి ప్రతిగా మనకూ మేలు చేకూరే విధంగా బీజింగ్ వ్యవహరిస్తుందని వేరే చెప్పనవసరం లేదు. చైనా పెట్టుబడులను స్వీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. మన దేశం నుంచి విమానాలను నడిపేందుకు రెండు చైనా కంపెనీలు దరఖాస్తు చేసినట్లు తాజా వార్తలు వెల్లడించాయి.

చైనా మీద ఆధారపడకూడదు, దాన్ని పక్కకు నెట్టేసి అసలు మనమే ప్రపంచానికి వస్తువులను ఎగుమతులు చేద్దాం అంటూ పైకి ఎన్ని కబుర్లు చెప్పినా అలాంటి సూచనలు లేవు.తొలి ఏడు నెలల్లో ఎగుమతులు పెరిగాయని చెప్పిన వారు అదే సమయంలో చైనా నుంచి దిగుమతులు 57.65 నుంచి 64బిలియన్ డాలర్లకు పెరిగాయని చెబితే నిజాయితీగా ఉంటుంది. గత సంవత్సరం చైనాతో మన వాణిజ్య లోటు 99.12 బిలియన్ డాలర్లు. దీన్నే మరోవిధంగా చెప్పాలంటే నరేంద్రమోదీ సర్కార్ అసమర్థతకు బీజింగ్‌కు మనం చెల్లించిన మూల్యం. ఇంకా చెప్పాలంటే గత పదకొండు సంవత్సరాల్లో 701.95 బిలియన్ డాలర్లు సమర్పించుకున్నాం. మోడీ అధికారానికి వచ్చిన తొలి ఏడాది మన వాణిజ్య లోటు 48.45 బిలియన్ డాలర్లు కాగా పదకొండేండ్లలో రెట్టింపై 99.21 బి.డాలర్లకు చేరింది, ఎందుకని? గత ఐదు సంవత్సరాల్లో చైనాకు మన ఎగుమతులు 33శాతం పడిపోగా దిగుమతులు 74శాతం పెరిగాయి. ఆత్మనిర్భరత ఏమైనట్లు, ప్రపంచంలో పెరిగినట్లు చెబుతున్న మోదీ పలుకుబడి సంగతేమిటి? కాంగ్రెస్ యాభై ఏండ్లలోచేయలేని వాటిని తాను తొలి ఐదేండ్లలోనే చేసినట్లు గతంలో చెప్పుకున్నారు. సంతోషం. వర్తమాన అవసరాలకు అనుగుణంగా వస్తూత్పత్తిని ఎందుకు చేయలేకపోయినట్లు? రెండింజన్ల పాలనే కదా ఉన్నది. యాపిల్ ఐఫోన్లను తయారు చేస్తున్నాం, ఎగుమతి చేస్తున్నాం చూడండి అంటూ ప్రచారం చేస్తున్నారు. మిగతా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల సంగతేమిటి? గ్లోబల్ ట్రేడ్ రిసర్చ్ ఇనిస్టిట్యూట్(జిటిఆర్ఐ ఇండియా) చెప్పిన దాని ప్రకారం కీలకమైన ఎనిమిది పారిశ్రామిక ఉత్పత్తుల విషయంలో చైనా ప్రధాన సరఫరాదారుగా ఉంది. చైనా నుంచి దిగుమతుల వలన రెండు రకాల నష్టాలు, ఒకటి మన స్థానిక పరిశ్రమలు గిడసబారిపోతున్నాయి, కార్మికులకు ఉపాధి దొరకటం లేదు. విలువైన విదేశీమారక ద్రవ్యాన్ని చైనాకు సమర్పించుకుంటున్నట్లు ముందే చెప్పుకున్నాం. గత కాంగ్రెస్ పాలనకూ మోడీ ఏలుబడికి తేడా ఏమిటి? చైనా నుంచి దిగుమతుల్లో మన్మోహన్ సింగ్ రికార్డులనే కాదు, తన రికార్డులను కూడా తానే మోదీ బద్దలు కొట్టుకున్నారు. చైనాతో తిరిగి సత్సంబంధాలను నెలకొల్పుకొనటం మంచిదే. కానీ అనేక వస్తువుల దిగుమతులపై ఆంక్షలను సడలించిన కారణంగా గత రికార్డులను అధిగమించే సూచనలు కనిపిస్తున్నా యి.

అమెరికాతో వాణిజ్య ఒప్పందం గురించి గత పదినెలలుగా చెబుతూనే ఉన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేతతో సహా అన్నీ



డోనాల్డ్ ట్రంప్ చెబుతున్నట్లే జరుగుతున్నందున అనేక అనుమానాలు. ఇంతవరకు ఏం జరుగుతోందో జనానికి తెలియదు. ట్రంప్ చెబితే తప్ప మనకు తెలిసేట్లు లేదు, మన మార్కెట్‌ను వారి వస్తువులకు బార్లా తెరవాలని అమెరికా వత్తిడి తెస్తోంది. అదే జరిగితే స్థానిక పరిశ్రమలు, వాణిజ్యాలను మూసుకోవాల్సిందే అని మన కార్పొరేట్లు హెచ్చరిస్తున్నాయి. వర్తమాన ఆర్థిక సంవత్సరం తొలి ఏడునెలల్లో మన ఎగుమతులు ఎక్కువగా అమెరికాకు జరిగితే దిగుమతులు చైనా నుంచి జరిగాయి. ఇదేం కుదరదు అన్నీ మా నుంచే దిగుమతి చేసుకోవాలని ట్రంప్ బెదిరిస్తున్నాడు. అసలు సంగతేమిటంటే చైనా నుంచి తక్కువ ధరలకు వస్తున్నాయి గనుక దిగుమతి చేసుకుంటున్నాం తప్ప షీ జింపింగ్ మీద ప్రేమతో కాదు. అమెరికాకు చోటిస్తే ఎడారి వ్యాపారి, ఒంటె కథ మాదిరి దేశీయ సంస్థలను బయటకు నెట్టేయటం లేదా మింగివేస్తుంది. అందుకనే రెండు దేశాలతో సమన్వయం చేసుకోవటం మోదీకి కత్తిమీద సాములా ఉంది. రానున్న రోజుల్లో మనకు మేలు జరిగే విధంగా విదేశాంగ విధానం ఉండాలని ఇప్పటికే కార్పొరేట్ల లాబీ మాట్లాడుతోంది. కరవమంటే కప్పకు విడవమంటే పాముకు కోపం !

మన దేశ వస్తు ఎగుమతులను చూస్తే 2024లో 434.44 బిలియన్ డాలర్లు కాగా దిగుమతులు 6987.02 బి.డాలర్ల మధ్య ఉన్నాయి. నిఖర వాణిజ్యలోటు 263.31బిలియన్ డాలర్లు. ఎగుమతుల్లో అమెరికా 18.3, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 8.5, నెదర్లాండ్స్ 5.6, సింగపూర్ 3.6, చైనా 3.4, బ్రిటన్ 3.2, సౌదీ అరేబియా 2.8, బంగ్లాదేశ్ 2.6, జర్మనీ 2.4, ఇటలీ 1.92శాతాల చొప్పున ఉన్నాయి. 2024 జనవరి నుంచి జూన్ వరకు వివరాలు చూస్తే మన దేశం 151దేశాలతో వాణిజ్య మిగులు, 75దేశాలతో తరుగులో ఉంది. మోడీ భక్తులు, చూశారా మా నేత పలుకుబడి అని డబ్బా కొట్టుకోవటానికి ఈ అంకెలు తప్ప వాస్తవ పరిస్థితి ఏమిటోపైన చెప్పుకున్నాం. పదకొండు సంవత్సరాల్లో పరాధీనతను తగ్గించటానికి మోదీ చేసిందేమీ లేదు. మన దిగుమతులను చూస్తే 2024లో చైనా నుంచి 15.5, రష్యా 9.1, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 8.6, అమెరికా 6.1, సౌదీ అరేబియా 4.3, ఇరాక్ 4.2, ఇండోనేషియా 3.4, స్విట్జర్లాండ్ 3.1, దక్షిణ కొరియా 3, సింగపూర్ 2.9శాతం చొప్పున ఉన్నాయి.

మన ఎగుమతులు, దిగుమతులు రెండు రకాలు. ఒకటి వస్తువులు, రెండవది సేవలు. వస్తులావాదేవీల్లో 2014–15లో లోటు 137 బిలియన్ డాలర్ల నుంచి 2024–25 నాటికి 283బి.డాలర్లకు పెరిగింది. సేవల విషయంలో ఇదే కాలంలో మిగులు 74 నుంచి 189 బిలియన్ డాలర్లకు పెరిగింది. రెండింటినీ కలిపి చూసినపుడు నిఖర లోటు 63 నుంచి 94 బిలియన్ డాలర్లకు పెరిగింది. ప్రపంచంలో 2024లో మొత్తం 24.5లక్షల కోట్ల డాలర్ల విలువగల వస్తు ఎగుమతులు జరగ్గా ఎగువన ఉన్న 30దేశాల వాటా 20.3లక్షల కోట్ల డాలర్లు. మొదటి స్థానంలో ఉన్న చైనా వాటా 14.6 శాతం ఉండగా పద్దెనిమిదవదిగా మనదేశ వాటా కేవలం 1.8శాతమే, రష్యా, స్విట్జర్లాండ్ కూడా ఇదే వాటాను కలిగి ఉన్నాయి. చైనాను వెనక్కు నెట్టేయాలన్న సంకల్పాన్ని ఎవరూ కాదనరు, పోటీ పడాల్సిందే. కానీ ఒక్కసారిగా ఈ పరిస్థితి మారాలన్నా, 2047 నాటికి దేశాన్ని ఎక్కడికో తీసుకుపోవాలన్నా నరేంద్రమోదీ అల్లావుద్దీన్ అద్భుత దీపాన్ని సంపాదించాల్సిందే.

## చెర్వుగట్టు హుండీ ఆదాయం లెక్కింపు



ప్రజాపక్షం/నార్కట్ పల్లి: మండలంలోని చెరువుగట్టు శ్రీపార్వతీ జడలరామలింగేశ్వర స్వామి దేవస్థానం నందు శుక్రవారం హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. గట్టుక్రింద అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం రూ.43,7668. గట్టుపైన స్వామివారి ఆలయ హుండీ ఆదాయము రూ.38,49876 మొత్తం 49 రోజులకు గాను నలభై రెండు లక్షల ఎనభై ఏడు వేల ఐదువందల నలభై నాలుగు రూపాయలు, అన్నదానముకు రూ.42,374లుతో పాటుగా అమెరికా డాలర్స్39,కెనెడ డాలర్స్ 5,శ్రీలంక రూపాయలు 10 వచ్చినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్. మోహన్ బాబు తెలిపారు.ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకురాలు సుమతి,విజయవాడకు చెందిన శ్రీ దుర్గ శివసాయి సేవా సంఘం సభ్యులు,ఐడిబిఐబ్యాంకు సిబ్బంది దేవస్థాన సిబ్బంది ఇంద్రసేనా రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాల పరిశీలన



ప్రజాపక్షం/నూతనకల్ : గ్రామ పంచాయితీ ఎన్నికల నామినేషన్ పత్రాల స్వీకరణ కేంద్రాలలోని నూతనకల్ క్లస్టర్, ఎర్రపహాడ్ క్లస్టర్ కేంద్రాలలో జరుగుతున్న నామినేషన్ ప్రక్రియను జనరల్ అబ్జర్వర్ జి రవి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ స్వీకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు జాగ్రత్త వహించాలని అన్నారు. నామినేషన్ పత్రాల స్వీకరణలో ఏలాంటి తప్పిదాలు దొర్లకుండా సరిచూసుకోవాలని అభ్యర్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఓ సునీత, ఎస్ఐ నాగరాజు, ఆర్ఓ అశోక్, పంచాయితీ కార్యదర్శులు సత్యవతి, వినోద, శర్మ, చలమయ్య ఉన్నారు.



## ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ

### నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: పోలీస్ అధికారులు, సిబ్బంది ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని,వారి ఆరోగ్య పరిరక్షణలో భాగంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అపోలో,రినోవా,మెడికవర్,మ్యాక్స్ విజన్,రైన్బో చిల్డ్రన్,క్లౌ డెంటల్,ఇండియన్ మెడికల్ అసోసియేషన్, జిజిహెచ్ నల్లగొండ హస్పటల్ డాక్టర్ల వారి సహకారంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి విది నిర్వహణలో ఒత్తిడి కారణంగా సమయానికి ఆహారం నిద్ర లేకపోవడం వలన అనేక రకాల ఆరోగ్య సమస్యల బారిన పడే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని , వైద్యుల సలహాలు సూచనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి రమేష్,ఎస్.బి డిఎస్‌పిమల్లారెడ్డి,నల్లగొండ డిఎస్‌పి శివ రాం రెడ్డి,ఏ.ఆర్ డిఎస్‌పి శ్రీనివాస్, వైద్యులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడలలో రాణించాలి


### ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి




ప్రజాపక్షం/కోదాడ: ఆటలు చదువులో ఒక భాగమని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడాలలో రాణించాలని ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణ సీసీఆర్ విద్యానిలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న 19వ సీఎస్ఏ జాతీయ స్థాయి క్రీడ ముగింపు వేడుకలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రలకు చెందిన 29 పాఠశాలల నుండి 1,450 మంది క్రీడాకారులు కబాడీ, హ్యాండ్‌బాల్, త్రోబాల్, వాలీబాల్, కబాడీ, బాస్కెట్‌బాల్, స్పోర్ట్స్ ఈవెంట్‌స పాల్గొన్నట్లు నిర్వహాకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆలరించాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందించి నిర్వహించిన సీసీఆర్ విద్యానిలయం యాజమాన్యాన్ని అభినందించారు. ఉడుముల శౌరీ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మండల విద్యాధికారి ఎం.డి సలీంషరీఫ్, ఆల్ఫోన్సా, నక్షత్రం, శాంతమేరీ, జూలియట్, విజయ, ఫజోసాఫ్‌రెడ్డి, చింతకుంట్ల లక్ష్మినారాయణరెడ్డి, బాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, లామ్ దేవరాజ్, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతిక్ ఫౌండేషన్ క్రీడలు నిర్వహించడం అభినందనీయం

### ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : ప్రతిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలతో పాటు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ కేతవత్ శంకర్ నాయక్ అన్నారు.శుక్రవారం పట్టణంలోని ఎన్జీ కళాశాల గ్రౌండ్లో ఏర్పాటుచేసిన నల్లగొండ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ను ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్లగొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడంతో పాటు ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు.అభివృద్ధిలో నల్లగొండ మినీ హైదరాబాద్‌ల ముందుకు పోతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ప్రదీప్ నాయక్,కేసాని వేణు గోపాల్ రెడ్డి,టోర్నమెంట్ ఆర్గనైజర్స్ బోనగిరి ప్రభాకర్ పాల్గొన్నారు.

## వేములపల్లి మండలంలో 'స్థానిక' ఎన్నికలకు సిపిఐ అభ్యర్థుల ఖరారు

ప్రజాపక్షం/వేములపల్లి: గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడే అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు కోరారు.మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సిపిఐ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. డబ్బులు, మద్యం కులం మతం ప్రాంతం వివిధ ప్రలోభాలతో వచ్చే అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని కోరారు. వేములపల్లి మండలంలో స్థానిక సంస్థలఎన్నికలలో సిపిఐ అభ్యర్థులను ఖరారు చేసినట్లు తెలిపారు. అన్నపురెడ్డి గూడెం,తిమ్మారెడ్డి,గూడెం,మంగాపురం గ్రామాలలో సంబంధిత వార్డుల్లో ఆయా అభ్యర్థులను ఎంపిక చేయడం జరిగింది అన్నారు.మండల కేంద్రంలో సర్పంచ్ అభ్యర్థిగా జిల్లా యాదగిరి తో పాటు వార్డు సభ్యులను ప్రకటించారు.ఈ సమావేశంలో మండల కార్యదర్శి జిల్లా యాదగిరి,వేములపల్లి గ్రామ కార్యదర్శి పుట్టల నాగయ్య,మంగాపురం కార్యదర్శి మద్దిరాల రంగారెడ్డి, పుట్టల కృష్ణ,సుధాకర్,కత్తుల బిక్షం, పరమేష్,సంపత్ పాల్గొన్నారు.



# అడ్డొచ్చిన అష్టమి...

రెండవ రోజు తగ్గిన నామినేషన్ల దాఖలు
సర్పంచ్‌లకు 159, వార్డులకు 142 నామినేషన్లు



ప్రజాపక్షం/సూర్యాపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో మొదటి విడతలో పోలింగ్ జరిగే స్థానాలకు మొదటి రోజు అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేయగా, రెండవ రోజు శుక్రవారం నామినేషన్ దాఖలు చేసేందుకు అష్టమి అడ్డు వచ్చింది. మొదటి రోజు గురువారం సర్పంచ్‌లకు 207, వార్డులకు 38 నామినేషన్లు దాఖలు కాగా, రెండవ రోజు సర్పంచ్‌లకు 159, వార్డులకు 142 నామినేషన్లు దాఖలయ్యాయి. దీనిని పరిశీలిస్తే సర్పంచ్ అభ్యర్థులు మంచి మూహుర్తం చూసుకునే నామినేషన్ దాఖలు చేయాలని ఆగిపోగా, వార్డుల్లో పోటీ చేసే వారు మాత్రం అవేవి పట్టించుకోకుండా జోరుగా నామినేషన్లు దాఖలు చేశారు. సూర్యాపేట జిల్లాలో మొదటి విడత తుంగతుర్తి, నాగారం, నూతనకల్, తిరుమలగిరి, జాజిరెడ్డిగూడెం, మద్దిరాల, సూర్యాపేట రూరల్, ఆత్మకూర్(ఎస్) మండలాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ మండలాల పరిధిలో మొత్తం 159 గ్రామ పంచాయితీలు ఉండగా, 1442 వార్డులు ఉన్నాయి. మొదటి రోజు సర్పంచ్‌లకు 207, వార్డులకు 38 నామినేషన్లు దాఖలు కాగా, రెండవ రోజు సర్పంచ్‌లకు 159, వార్డులకు 142 నామినేషన్లు దాఖలయ్యాయి. అష్టమి అడ్డురావడంతోనే సర్పంచ్ పదవీ కోసం పోటీచేసే అభ్యర్థులు మంచి రోజు కాకపోవడంతో నామినేషన్‌లు దాఖలు చేసేందుకు ఆసక్తి చూపనట్లు స్పష్టమవుతుంది. మొదటి రోజు కంటే వార్డుల్లో పోటీ చేసే అభ్యర్థులు మాత్రం అవేవి పట్టించుకోకుండా జోరుగా నామినేషన్లు దాఖలు చేశారు.

రెండవ రోజు దాఖలైన నామినేషన్లను పరిశీలిస్తే ఇలా ఉన్నాయి. తుంగతుర్తి మండల సర్పంచ్‌గా పోటీ చేసే అభ్యర్థులు 25 మంది నామినేషన్లు దాఖలు చేయగా వార్డు మెంబర్లుగా పోటీ చేసే వారు 16 మంది, నాగారం మండలంలో 17 సర్పంచ్ నామినేషన్లు, వార్డులకు 36 నామినేషన్లు, నూతనకల్ మండలంలో సర్పంచ్ పదవికి 18, వార్డులకు 26 నామినేషన్లు, తిరుమలగిరి మండలంలో సర్పంచ్ పదవికి 7 నామినేషన్లు దాఖలు చేయగా వార్డులకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. జాజిరెడ్డిగూడెం మండలంలో సర్పంచ్ పదవికి 11, వార్డులకు 07 నామినేషన్లు దాఖలు అయ్యాయి. మద్దిరాల మండలంలో సర్పంచ్ పదవికి 23, వార్డులకు 13 నామినేషన్లు, సూర్యాపేట మండలంలో సర్పంచ్ పదవి కోసం 22, వార్డులకు 20 నామినేషన్లు దాఖలు చేశారు. ఆత్మకూర్(ఎస్) మండలంలో సర్పంచ్ పదవి కోసం 36, వార్డులకు 24 నామినేషన్లు దాఖలు అయినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ అధికారికంగా ప్రకటించారు. మొదటి విడత ఎన్నికల్లో నామినేషన్ల దాఖలు చేసేందుకు నేటితో గడువు ముగియనుంది.



## నామినేషన్‌లో పొరపాట్లకు తావు లేదు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/తుంగతుర్తి : నామినేషన్‌లో పొరపాట్లకు తావులేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. తుంగతుర్తి గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తుంగతుర్తి గ్రామ పంచాయితీ కార్యాలయంలో తుంగతుర్తి, గానుగబండ, తూర్పుగూడెం సర్పంచ్‌లకు, వార్డు సభ్యుల ఎన్నిక నిమిత్తం కొరకు ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని, మద్దిరాల ఎంపిడిఓ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని, నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏలాంటి సందేహాలు ఉన్నాపై అధికారులను సంప్రదించాలన్నారు. అనంతరం మద్దిరాల ఎంపిడిఓ కార్యాలయంలో నామినేషన్ ఆనైలైన్ చేసే విధానాన్ని పరిశీలించారు. నామినేషన్‌లను స్వీకరించిన తరువాత వెంటనే టి పోల్‌యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఓ వేణుమాధవ్, తహశీల్దార్ దయనందం, ఎంపిడిఓలు సత్యనారాయణ రెడ్డి, శేషకుమార్, ఆర్‌ఓలు, అధికారులు ఉన్నారు.

## పారదర్శకంగా నామినేషన్ల ప్రక్రియ

### నామినేషన్ కేంద్రాల పరిశీలన కలెక్టర్ తనిఖీ




ప్రజాపక్షం/మర్రిగూడ: గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా మొదటి విడత ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.శుక్రవారం ఆమె మర్రిగూడ మండలం, సరంపేట,శివన్న గూడెం ,వట్టిపల్లి గ్రామాలలో పర్యటించి నామినేషన్ స్వీకరణ కేంద్రాలను తనిఖీ చేశారు. నామినేషన్ దాఖలు ప్రక్రియ, సిబ్బంది హాజరు, అభ్యర్థులకు కల్పిస్తున్న సేవలు,భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతి కేంద్రంలో క్రమశిక్షణ, నిబంధనలు కచ్చితంగా పాటించాలని, రిజర్వేషన్లను కల్పించిన వారికి కుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ,మహిళా అభ్యర్థుల కోసం ప్రత్యేక సహాయ డెస్క్ ఏర్పాటు,అభ్యర్థులు కరెంట్ బ్యాంకు ఖాతా సమర్పించాల్సి ఉంటుందని, అభ్యర్థులు సమర్పించే నగదును ఎలా స్వీకరిస్తున్నారని ? అలాగే వారికి రసీదు ఇస్తున్నారా? అని అడిగారు . డిజిటల్ గోడ గడియారం అమర్చుకోవాలని చెప్పారు. చెక్ లిస్టులను నామినేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. చండూర్ ఆర్‌డిఓ శ్రీదేవి,తహసీల్దార్ శ్రీనివాస్,ఎంపీడీవో మున్నయ్య, తదితరులు ఉన్నారు.

## బాలల పరిరక్షణ కమిటీల ఏర్పాటు

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: సీడీపీవో రేఖల మమత ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని 4,5,19,20,21,37 వార్డుల్లో బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేశారు. కమిటీలో వార్డు ఆఫీసర్ల చైర్మన్‌గాను, సూపర్‌వైజర్‌ను కన్వీనర్‌గా, ఏఎన్ఎం, సమభావన సభ్యులను స్కూల్ హెడ్‌మాస్టర్‌ను, వార్డు పోలీసులను, మత పెద్దతలను సభ్యులుగా ఎన్నుకున్నారు. ముఖ్య ఉద్దేశ్యం అక్రమ దత్తత, బాల్య వివాహాలలను అడ్డుకోవడం, స్కూల్ డ్రాప్ అవుట్, భ్రూణహత్యల నిర్మూలించడం, పోక్సో యాక్ట్, భ్రూణహత్యలను నిర్మూలించే అంశాలపై ప్రతి నెలా మొదటి శుక్రవారం సమావేశాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఈవో బాలునాయక్, సూపర్‌వైజర్ నాగమణి, కల్యాణి, ప్రేమలత, క్రాంతికుమార్, రమేష్, లాలునాయక్, సాయిశ్రీనివాస్, శ్రీకాంత్, ఝాన్సీ, నర్సమ్మ, సైదా, రోజా, గోపమ్మ, శివాజిరెడ్డి, రాధాకృష్ణ, గోపమ్మ, కవిత, అచ్చాలు, విజయలక్ష్మి , సైదమ్మ, లలితమ్మ, పార్వతి, రామనుజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

### పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు విడుదల చేయాలి : ఎఐఎస్ఎఫ్ డిమాండ్



ప్రజాపక్షం/దేవరకొండ: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 23నెలల పాలనలో మద్యం శాఖకు మంత్రిని కేటాయించి భవిష్యత్తు విద్యార్థుల చదువులకు ప్రత్యేక మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటని, విద్యా రంగ సమస్యలు పరిష్కారం కావడం లేదని, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం దేవరకొండలోని వివిధ కళాశాలలో, పాఠశాలలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి, కళాశాల, పాఠశాలలో నూతన కమిటి ఏర్పాటు చేయడం జరిగింది. ఈసందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయడంలో, హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిల విడుదల లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పట్టించుకోకుండా వారి చదువులతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని అన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టడంలో, విద్యా హక్కు చట్టం అమలు చేయడంలో, ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. వెంటనే ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ఇంటర్ మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్నభోజనం అందజేయాలని, ప్రభుత్వం విద్యార్థుల ఫీజు బకాయిలు మొత్తం విడుదల చేయకపోతే ప్రభుత్వంపై మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి శివకుమార్, డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శంశోద్దీన్, ఎఐఎస్ఎఫ్ నాయకులు నూతన కమిటి ఎన్నికైన సభ్యులు షోహెల్, సిద్ధు, చరణ్, యశ్వంత్, రాము, గాయత్రి, మానస, అశ్విత, పూజ, జనప్రియ, అనూష, కీర్తన, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

# నూతన ఉత్పత్తుల తయారీపై దృష్టి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: మహిళా సంఘాల సభ్యులు నూతన ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించి ఆర్థికంగా మరింత ముందుకు ఎదగాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.శుక్రవారం జిల్లా నుండి సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహిస్తున్న భారతీయ కళా మహోత్సవ్‌కు జిల్లా నుండి వెళుతున్న స్వయం సహాయక మహిళా సంఘాల అధ్యక్ష, కార్యదర్శుల ప్రత్యేక బస్సుకు ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జండా ఊపి ప్రారంభించారు. కళా మహోత్సవ్‌లో దేశంలోని వివిధ ప్రాంతాలలో తయారుచేసిన పలు రకాల ఉత్పత్తులను ప్రదర్శించడం జరుగుతుందని, అలాంటి స్టాల్స్ ను మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యు లు సందర్శించడం వల్ల విభిన్న ఉత్పత్తుల తయారీపై అవగాహన కలుగుతుందన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పొదుపు, ఆర్థిక అంశాలతో పాటు, సామాజిక అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలని,అలాగే వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సాంస్కృతి, సంప్రదాయాలు,వారి కట్టుబాట్లు, ఆచార, వ్యవహారాలు తెలుసుకునేందుకు ఇది ఒక మంచి అవకాశం అని అన్నారు. జిల్లాలోని మహిళా స్వయం సహాయక సంఘాలు నూతన ఆలోచనలతో కొత్త ఉత్పత్తులను తయారు చేయడం పై దృష్టి సారించాలని తద్వారా మరింత ఆర్థికంగా ఎదిగే ఆకాశం ఉందన్నారు. డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి, డిపిఎంలు, ఏపీఎంలు తదితరులు ఉన్నారు.

## అప్రజాస్వామ్యిక వేలం, ప్రలోభాలతో ఏకగ్రీవ సర్పంచుల ఎన్నిక చెల్లదు

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు వెల్లడి



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా వేలం పాటలు, ప్రలోభాలతో బెదిరింపులతో అప్రజాస్వామ్యక ఏకగ్రీవ సర్పంచుల ఎన్నిక చెల్లదని ఎలక్షన్ కమిషన్ నియమించిన కమిటీ నివేదిక ఆధారంగా మాత్రమే చెల్లుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు స్పష్టం చేశారు. ఏకగ్రీవం చేయాలనుకునే సర్పంచుల ఎన్నిక గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు కమిటీ సమగ్ర విచారణ జరిపి నివేదిక ఆధారంగానే తుది ఫలితం వెల్లడిస్తామని తెలిపారు. యాదాద్రి జిల్లా వ్యాప్తంగా మూడు దశలలో జరగనున్న ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆయన శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న పిఓస్‌ల శిక్షణ శిబిరంలో పాల్గొని ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు కౌంటింగ్ పూర్తయ్యే వరకు అనుసరించవలసిన విధివిధానాలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి దశలో 153 గ్రామాలకు, 1286 వార్డుల 41 క్లస్టర్లలో నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతుందని వివరించారు. మొదటి జోన్ కు సంబంధించిన అన్ని స్థాయిలలో స్టేజ్ 1,2 ఆర్ఓ ఇప్పటికే పూర్తి అయినట్లు పీవోస్‌లకు ఎన్నికల నుంచి మొదలుకొని కౌంటింగ్ వరకు జరిగే అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 17 మండలాలకు సంబంధించిన శిక్షణ శిబిరాలు శుక్రవారం కొనసాగినట్లుగా చెప్పారు. జిల్లాలో మొత్తం 427 గ్రామపంచాయతీలలో 3704 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నందున పటిష్టమైన ఎన్నికల కోడ్ అమలు చేస్తున్నట్టు తెలిపారు. కోడు అమల్లో ఉన్నందువలన అక్రమ మద్యం, డబ్బు రవాణా అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా బీబీనగర్, బొమ్మలరామారం, ఆలేరు, పంతంగి గ్రామాల వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటలు తనిఖీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. 36 హైపర్ సెన్సిటివ్, 146 సెన్సిటివ్ ప్రాంతాలుగా గుర్తించినట్లు తెలిపారు. 192 వార్డులకు గాను వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులను 7గురు రిటర్నింగ్, 7 గురు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను ఇద్దరినీ రిజర్వు అధికారులుగాను నియమించారు. పిలాయిపల్లి, దేశ్ముఖి రెండు గ్రామాలను ఒక క్లస్టర్‌గా, జలాల్పురం, కనుముకుల, దంతూరు, వంకమామిడి నాలుగు గ్రామాలు కలిపి ఒక క్లస్టర్‌గాను మిగిలిన మూడు గ్రామాలకు ఒక క్లస్టర్‌గా విభజించారు. కాగా పోచంపల్లి మండలంలోని 21 గ్రామాలను ఏడు క్రస్టర్లుగా విభజించారు.

## ధృవీకరణ పత్రాల కోసం అష్టకష్టాలు...

### సర్వర్ బిజీతో మీ-సేవ కేంద్రాల వద్ద పడిగాపులు
### అభ్యర్థుల ఆందోళన



ప్రజాపక్షం/సూర్యాపేట : అవసరమైన పత్రాల కోసం మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకునేందుకు వెళ్తున్న వారు అష్టకష్టాలు పడుతున్నారు. అక్కడికి వెళ్తే సర్వర్ బిజీ అని చెప్పడంతో ఆ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేయాలన్న అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే సమయంలో వారి ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు దానితో జతచేయాల్సి ఉండగా అవి అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా దాదాపు 85కు పైగా మీసేవ కేంద్రాలు ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు వారికి అవసరమైన ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు పొందేందుకు మీ సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకునేందుకు గత ఐదు రోజులుగా బారులు తీరుతున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు వెళ్తే సర్వర్ బిజీ అని చెప్పడంతో ఇబ్బందులు పడుతున్నారు. మీసేవ కేంద్రాలు ఎప్పుడు పనిచేస్తాయో తెలియక రోజుల తరబడి కేంద్రాల చుట్టూ అభ్యర్థులు కాళ్ళు అరిగేలా తిరుగుతున్నారు. కొంతమంది దరఖాస్తు చేసుకున్న వారు అధికారులు ఒకే చెప్పిన తర్వాత పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవాలంటే కూడా సర్వర్ బిజీ అని చెబుతున్న పరిస్థితి. సూర్యాపేట జిల్లాలో మొదటి విడత పోలింగ్ తుంగతుర్తి, నాగారం, నూతనకల్, తిరుమలగిరి, జాజిరెడ్డిగూడెం, మద్దిరాల, సూర్యాపేట రూరల్, ఆత్మకూర్(ఎస్) మండలాల్లోని 159 గ్రామ పంచాయితీలకు, 1442 వార్డులకు డిసెంబర్ 11న ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో పోటీచేసే సర్పంచ్, వార్డులకు పోటీచేసే అభ్యర్థులకు నామినేషన్ దాఖలు చేసేందుకు కేవలం మూడు రోజుల సమయం మా త్రమే ఉంది. ఇప్పటికే రెండు రోజులు గడవగా కేవలం ఒక్కరోజు మాత్రమే మిగిలింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసేందుకు కేవలం ఒక్క రోజు మాత్రమే గడువు ఉండడంతో ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ సమీపంలోని మీసేవ కేంద్రాలకు వెళ్ళి ధృవీకరణ పత్రాలను కొంత మంది చేసుకోగా మరికొంత మంది చేసుకోలేదు. దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధించిన పత్రాలు అధికారులు ఓకే చెప్పినా సర్వర్ బిజీతో అవి డౌన్‌లోడ్ కావడంలేదని దరఖాస్తు చేసుకోవాలనుకునే వారికి సర్వర్ బిజీ అడ్డంకిగా మారింది. దీనిపై సంబంధిత అధికారులు చొరవ తీసుకొని సర్వర్ బిజి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## మరికల్ మండలంలోని పోలింగ్ కేంద్రాల పరిశీలన

సిఐ రాజేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, గ్రామపంచాయితీ ఎన్నికల నేపథ్యంలో మరికల్ సీఐ రాజేందర్ రెడ్డి, ఎస్సై రాములు కలిసి మరికల్ మండల పరిధిలోని మరికల్, పెద్దచింతకుంట, అప్పంపల్లి, తీలేరు గ్రామలలోని వివిధ పోలింగ్ కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ప్రాథమిక సౌకర్యాలు, తాగు నీరు, విద్యుత్, బ్యారికేడ్లు, మరుగుదొడ్లు, శానిటేషన్ వంటి ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. అదే విధంగా, పోలింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు భద్రతా చర్యలు, చుట్టుపక్కల నిఘా, క్రమశిక్షణపై ప్రత్యేక సూచనలు చేశారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటిస్తూ, ప్రజలు భయపడకుండా, స్వేచ్ఛగా తమ ఓటును హక్కును వినియోగించుకునే విధంగా పోలీస్ శాఖ అన్ని ఏర్పాటు చేసిందని సీఐ తెలిపారు.

## సిఎం పర్యటన సందర్భంగా బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

ఎస్పీ డాక్టర్ వినీత్

**ప్రజాపక్షం/ మక్తల్ :** డిసెంబర్ 1న నారాయణపేట జిల్లా, మక్తల్ పట్టణానికి సిఎం రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ భద్రతా ఏర్పాట్లను పోలీసు అధికారులు, మున్సిపల్ అధికారులతో పరిశీలించి సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మక్తల్ పట్టణ కేంద్రంలోని బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మైదానంలో పబ్లిక్ మీటింగ్ సమావేశ స్థలం, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించి, బందోబస్తుకు సంబంధించిన రూట్ మ్యాప్ ఏర్పాటు చేయాలని, బందోబస్తు ను సెక్టార్లుగా విభజించి తగిన భద్రత చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

## సేవ్ నేచర్ పోస్టర్ల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణంలోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో తెలంగాణ నేషనల్ గ్రీన్ క్రాప్స్, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అనే అంశానికి సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యులు బి.కుర్మయ్య మాట్లాడుతూ విద్యార్థులు ప్లాస్టిక్ లంచ్ బాక్స్, వాటర్ బాటిల్స్ ఉపయోగించకూడదని, వాటికి బదులుగా స్టీల్ వస్తువులు వాడాలని తెలిపారు. చేతి సంచితో మార్కెట్‌కు వెళ్లడం, స్టీల్ వాటర్ బాటిల్స్, లంచ్ బాక్స్ ఉపయోగించడం విద్యార్థులు అలవాటు చేసుకోవాలి. పిల్లలు పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటడం అలవాటు చేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఆరుబయట చెత్త కాల్చడం వల్ల గాలి కాలుష్యం అవుతుందని, అలా చేయకుండా తడి పొడి చెత్త వేరుగా చేసి చెత్తవాహనలలో వేయాలని, లేదంటే మొక్కలకు ఎరువుగా వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది శ్రీనివాస్, గోపాల్ రెడ్డి, సరస్వతీ, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన



**ప్రజాపక్షం/కృష్ణ:** మండలంలోని కృష్ణ, హిందూపూర్, గూడెబాల్లూరు గ్రామాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం సిద్ధం చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ విజయలక్ష్మి, కృష్ణ ఎస్సై ఎస్‌ఎమ్ నవీద్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్శనలో వారు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సిన ప్రాథమిక సౌకర్యాలు, భద్రతా చర్యలు, తాగు నీరు, విద్యుత్, టాయిలెట్ సదుపాయాలు, ప్రహరీ గోడలు, వికలాంగులకు అవసరమైన సౌకర్యాలు ప్రతి కేంద్రం వద్ద ఏర్పాటు ఎలా ఉందో అధికారులు ప్రత్యేక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై ఎస్‌ఎమ్ నవీద్ మాట్లాడుతూ ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు ఎలాంటి బెదిరింపు లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్నివిధాల భద్రతా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

## పడకేసిన పట్టాదారు పాసుబుక్ ప్రింటర్



**ప్రజాపక్షం/పెబ్బేరు:** పెబ్బేరు తహసీల్దార్ కార్యాలయంలో పది నెలలుగా పట్టాదారు పాసుబుక్ ప్రింటర్ పడకేసింది. భూభారతిలో రిజిస్ట్రేషన్లు, ముటేషన్లు, అమ్మకాలు, కొనుగోళ్లు చేస్తున్న అన్నదాతలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తమ దగ్గర ఉన్న పాస్ బుక్‌లలో భూ విస్తీర్ణంలో మార్పులను చేర్పులను ప్రింట్ తీసుకోవాలంటే పెబ్బేరు మండల తాసిల్దార్ కేంద్రంలో పని కావడం లేదు. పట్టాదారు పాస్ పుస్తకంలో లావాదేవీలు పూర్తిస్థాయిలో అప్డేట్ కానందుకు బ్యాంకర్లు పంట రుణాలను నిరాకరిస్తున్నారు. ప్రింటర్లు పనిచేస్తున్న సమీప తాసిల్దార్ కార్యాలయంలో ప్రింటింగ్ కోసం వెళ్తే అక్కడ అన్నదాతలను ముక్కు పిండి డబ్బులు వసూలు చేసి పాసుబుక్ ప్రింట్ ఇస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణం స్పందించి ఇటువంటి పరిస్థితి నుంచి అన్నదాతలను కాపాడాల్సిన అవసరం ఉంది.

**తాసిల్దార్ వివరణ:** చాలా రోజుల నుండి పాస్ బుక్ ప్రింటర్ పనిచేయడం లేదు. రిపేర్ కోసం కలెక్టర్ కార్యాలయానికి పంపించాము. రాగానే అన్నదాతలకు నేరుగా పట్టాదారు పాసుబుక్‌లకు ప్రింట్ ఇవ్వడం జరుగుతుంది.

## హెల్త్ కిట్‌లు పంపిణీ



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రిలో నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణకు దోహదపడే యెన్నం హెల్త్ కిట్‌లను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి శిశువుల తల్లులకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన తల్లులకు ఆర్థిక భారం లేకుండా శిశువుల ప్రాథమిక అవసరాలను తీర్చుకునేందుకు ఈ యెన్నం అన్న హెల్త్ కిట్‌లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రి వైద్యులతో మాట్లాడారు. ఆసుపత్రిలో అవసరమైన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆశా కార్యకర్తలతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగ అజ్మీర, హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, ఆర్‌ఎంఓ దుర్గ, ఎవో ప్రేరణ, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, నర్సింగ్ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిబా పూలే వర్ధంతి

**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల మండల విద్యా వనరుల కేంద్రం అవరణలో బూర్గుపల్లి గ్రామం పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ప్రజా సంఘాల నాయకులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్, తెలుగు సత్యయ్య, బాగి కృష్ణయ్య, ఫకీర్, జహంగీర్, వెంకటేశ్‌లు, మాట్లాడుతూ అణగారిని ప్రజల జీవితాల్లో చీకట్లను తొలగించడానికి అక్షర జ్యోతి వెలిగించి సమ సమాజ నిర్మాణం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మా జ్యోతి పూలే ని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గొడుగు నర్సింహులు, నరసింహా రెడ్డి, శ్రీకాంత్, రామస్వామి, లింగంపేట్ శేఖర్, వెంకటేశ్, రాదకృష్ణ, చెన్నయ్య, రాములు, నరసింహా, శేఖర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా పంచాయతీ ఎన్నికలు

కలెక్టర్ విజయేందిర బోయి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** పంచాయితీ ఎన్నికలను పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడం ప్రతి అధికారి విధి అని జిల్లా జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ఉదయం, మధ్యాహ్నం స్టేజ్2 రిటర్నింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ని ఎన్నికలు నిర్వహించినా ప్రతిసారి కొత్త సవాళ్లు ఎదురవుతాయని, అందువల్ల అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండి ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఏ పార్టీకి గాని, ఏ అభ్యర్థికి గాని పక్షపాతం లేకుండా నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించాలని ఆమె స్పష్టం చేశారు. గ్రామపంచాయితీలో పోలింగ్ ఏర్పాట్లు, పోలింగ్ స్టేషన్ల నిర్వహణ, ప్రతి వార్డులో వాస్తవ పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు. పోలింగ్ అనంతరం సర్పంచు, వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపును నిబంధనల ప్రకారం నిర్వహించి ఫలితాలను ప్రకటించాలని, అనంతరం ఉపసర్పంచి ఎన్నికను గ్రామపంచాయితీ ప్రత్యేక సమావేశంలో పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ వెంకటరెడ్డి, ట్రైనీ జిల్లా పంచాయితీ అధికారి నికిత, డిఎల్‌పిఓ రామ్మోహన్, మాస్టర్ ట్రైనర్ బాలు యాదవ్, రతంగ్ పాణిరెడ్డి, పాండురంగ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్**

రాజాపూర్, తిరుమలాపూర్ పంచాయితీ కార్యాలయాలలో పంచాయితీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన నామినేషన్ ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర బోయి సందర్శించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రంలో సదుపాయాలు పరిశీలించారు. నామినేషన్ పత్రాల స్వీకరణకు చేసిన ఏర్పాట్లు గమనించి పలు సూచనలు చేశారు. హెల్ప్ డెస్క్, పోలీస్ బందోబస్తు స్టాఫ్ సరిపడా ఉన్నారా అని ఆరా తీశారు. నోటీసు బోర్డులపై అతికించిన నోటిఫికేషన్ పత్రాలను తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్‌లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. రాజాపూర్ మండలంలో గ్రామ పంచాయితీ కార్యాలయంలో, తిరుమలాపూర్ గ్రామపంచాయితీ కార్యాలయంలో గ్రామంలో జరుగుతున్న నామినేషన్ ప్రక్రియలు పరిశీలించిన కలెక్టర్ విజయేందిర బోయి పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్ల వివరాలను, మరియు నామినేషన్ వివరాలు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుంది. పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్వాడిలలో గర్భిణీలు, పిల్లలకు సక్రమంగా పౌష్టిక ఆహారం అందించాలని అన్నారు.



**వరి, మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్**

రాజాపూర్ మండలంలో చెన్నవెల్లి గ్రామంలోని ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను కలెక్టర్ విజయేందిర బోయి తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో రైతులు తెచ్చిన ధాన్యం వెంటనే ఎప్పటికప్పుడు తేమశాతం చెక్ చేయాలని, తేమ శాతం వచ్చిన ధాన్యం తూకం వేసి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు టాబ్ ఎంట్రీలు పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. రాజాపూర్, మండలం తిరుమలాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అలాగే ప్రతి కొనుగోలు కేంద్రంలో సరిపడా అన్ని వసతులను అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. అనంతరం తిరుమలాపూర్ గ్రామంలో పెన్షన్ తీసుకునేందుకు వచ్చిన వికలాంగులు, వృద్ధులలో పింఛన్లు పంపిణీ పై ఆరా తీశారు. కలెక్టర్ వెంట మండల అధికారులు పాల్గొన్నారు.

# పిల్లలకు పునరావాసం కల్పించేలా చర్యలు

**ప్రజాపక్షం/నారాయణపేట్:** ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పునరావాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్‌తో కలిసి మాతృత్వం ఒక వరం అందుకు దత్తత మరో మార్గంకు సంబంధించిన వాల్ పోసర్ కలెక్టర్ సిక్తా పట్నాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారంగా ప్రతి సంవత్సరం నవంబర్ నెలను దత్తత తీసుకున్న నెలగా జరుపుకోవడం జరుగుతదని అలాగే ఈ సంవత్సరం కూడా జరుపుకుంటారని తెలిపారు. ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏటా థీమ్ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సంస్థాగతంగా లేని వారికి పునరావాసం కల్పించడమే ఉద్దేశ్యం అని ఆమె చెప్పారు. ప్రతి బిడ్డ ఇన్స్టిట్యూషన్‌లోనే మగ్గిపోకుండా వారిని దత్తత ఇవ్వాలని, పిల్లలను అక్రమంగా కొనడం కానీ, అమ్మడం కానీ చేయకుండా చట్ట ప్రకారంగా దత్తత తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ ఏడాది ప్రత్యేక అవసరాలు గల పిల్లల సంస్థాగత పునరావాసం అనే థీమ్‌తో ఈ ప్రచారం జరుగుతుందని, దీని ముఖ్య ఉద్దేశ్యం ప్రత్యేక అవసరాలు గల పిల్లలను దత్తత తీసుకోవడాన్ని ప్రోత్సహించడం, దత్తత గురించి ఉన్న అపోహలు, అపార్థాలను తొలగించడం, దత్తత ద్వారా పిల్లలు, కుటుంబాలకు



కలిగే సంతోషాన్ని చాటడమే అని వివరించారు. బాలల న్యాయ బాలల రక్షణ, సంరక్షణ చట్టం 2015 ప్రకారం చట్ట విరుద్ధంగా పిల్లలను పెంచుకోవడం నేరమని, చట్ట విరుద్ధంగా పిల్లలను దత్తత ఇచ్చిన, తీసుకున్నా వారికి 3 సంవత్సరాల కారాగార శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. దత్తతకు సంబంధించిన మరింత సమాచారం కోసం శిశుగృహ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, జిల్లా సంక్షేమాధికారి కార్యాలయం నారాయణపేటను సంప్రదించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్ర మోహన్, డీసీపీ ఓ కరిష్మా, ఆరోగ్య శాఖ అధికారి బిక్షపతి పాల్గొన్నారు.

## ఘనంగా పూలే వర్ధంతి వేడుకలు

**ప్రజాపక్షం/కొత్తకోట:** కొత్తకోట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మా జ్యోతి బా పూలే వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మదనాపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, జిల్లా నాయకులు , మాజీ ఉపసర్పంచు బాయ్స్ పాపయ్య, కృష్ణారెడ్డి, కిషన్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, కొత్తకోట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బీచుపల్లి యాదవ్, కొత్తకోట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మేస్త్రి శ్రీను, రాష్ట్ర నాయకులు ఫిషర్ మ్యాన్ నంద వెంకటేష్, మండల నాయకులు సలీంఖాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డబ్బా లక్ష్మయ్య, రవీందర్ రెడ్డి, సిమెంట్ సాయిలు, ముజీబ్ సాయిల్, యాదవ్ ప్రసాద్, కొత్తకోట కాంగ్రెస్ పార్టీ మైనార్టీ పట్టణ అధ్యక్షులు కరాటే శ్రీను, ఉపాధ్యక్షులు తయ్యబ్ బల్లారెడ్డి, యన్‌ఎస్‌యుఐ శ్యామ్, బాల్‌రాజ్ యాదవ్, భవాని, బాలరాజు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# సమర్థవంతంగా నామినేషన్ల స్వీకరణ

కలెక్టర్ బదావత్ సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** రెండోసాధారణ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డుసభ్యుల నామినేషన్ స్వీకరణల ప్రక్రియ ఎన్నికల సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల రెండో రోజైన శుక్రవారం తెలకపల్లి మండలపరిధిలోని గౌరెడ్డిపల్లి, తెలకపల్లి క్లస్టర్లలో కొనసాగుతున్న నామినేషన్ల ప్రక్రియను జిల్లా ఎస్‌పి డాక్టర్ సంగ్రామ్ సింగ్ గణపత్‌రావుపాటిల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ తెలకపల్లి క్లస్టర్లు గ్రామపంచాయతీ కార్యాలయంలో తెలకపల్లి, రాకొండ, రాంరెడ్డి, కమ్మరెడ్డిపల్లి, దాసుపల్లి, గౌరెడ్డిపల్లి క్లస్టర్లు గ్రామపంచాయతీ కార్యాలయంలో గౌరెడ్డిపల్లి, లక్నారం, గోలగుండం, గట్టునెల్లికుదురు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. రిటర్నింగ్ అధికారులను నామినేషన్ ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ కేంద్రం ముందు ఫోటోతో ఓటర్ల జాబితా అదేవిధంగా గ్రామాల వార్డులవారిగా రిజర్వేషన్ల జాబితా అంటించాలన్నారు. తెలకపల్లి మండలంలోని ఏడు క్లస్టర్లలో 28 గ్రామపంచాయతీల్లో 28సర్పంచ్ ఎన్నికలు, 260వార్డులకు సంబంధించిన పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేలా అన్నిపోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి పక్కాగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. అనంతరం జిల్లా ఎస్‌పి డాక్టర్ సంగ్రామ్‌సింగ్‌గణపతిరావుపాటిల్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటుహక్కును వినియోగించుకునేందుకు అవసరమైన పారదర్శకమైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత పోలిసులదేనని జిల్లా ఎస్‌పి పోలీస్‌సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ జాకీర్‌అలీ, ఎంపిడిఓ తరుణ్, ఎంపిఓ వెంకటేష్, ఎంఈవో శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ నరేష్, కోటేశ్వరరావు, ఆయా గ్రామపంచాయతీల రిటర్నింగ్ అధికారులు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



**నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో మీడియా సెంటర్ ప్రారంభం :**

ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా సమాచార పౌరసంబంధాలశాఖ అధికారి జి1 కార్యాలయంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములుతో కలిసి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మీడియా సెంటర్‌ను ప్రారంభించారు. గ్రామపంచాయతీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోభాగంగా మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల పత్రికా ప్రకటనలు, సోషల్‌మీడియా ప్రచారంపై మీడియాసెంటర్ ద్వారా నిఘా పెట్టడం జరుగుతుందని తెలిపారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోజువారి దినపత్రికలతోపాటు టివిలో వివిధ ఛానల్స్‌తోపాటు లోకల్‌ఛానల్స్‌ను పర్యవేక్షించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. అనంతరం హెల్ప్‌లైన్‌డేస్ సెంటర్‌ను ప్రారంభించారు. 08540230201 సెంటర్ అందుబాటులో ఉంటుందని, ప్రజలు ఎవరైన ఫిర్యాదులు చేసుకునే అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయ ఉద్యోగులు రాము, శివ, వెంకటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్థిక కేంద్రంగా అమరావతి

రైతులకు ఇబ్బందుల్లేకుండా చూసుకోవడం బ్యాంకుల బాధ్యత : కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్




**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సవాళ్లను అధిగమించి, స్థిరమైన ప్రగతిని సాధించే దిశగా ప్రయాణించాలని కేంద్రం ఆకాంక్షిస్తోందని... అమరావతిని ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దుతామమని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. శుక్రవారం అమరావతిలో వివిధ బ్యాంకు కార్యాలయాల నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య ఆహ్వానితులుగా హాజరైన కేంద్రమంత్రి మాట్లాడుతూ అమరావతి నిర్మాణం అంటే ఒక యజ్ఞం లాంటిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పున:ప్రారంభం చేయటం సంతోషమని, దేశంలో ఒక కొత్త రాజధాని నగరం నిర్మించటం సామాన్యమైన విషయం కాదన్నారు. ఇంత పెద్ద నగరానికి ఆర్థికంగా భరోసా ఉండాలన్న నిర్ణయంతోనే పీఎస్‌యూ సంస్థలు ప్రధాన కార్యాలయాలు వస్తున్నాయన్నారు. 15 ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా సంస్థలు ఇక్కడ ప్రధాన కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నాయని, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఒకే చోట బ్యాంకుల ప్రధాన కార్యాలయాలు ఉండటం విశేషమని చెప్పారు. విభజన తర్వాత ఇబ్బందులు ఎదుర్కొన్న రాష్ట్రానికి పూర్తిగా సహకరించాలని ప్రధాని మోదీ స్పష్టం చేశారని తెలిపారు. క్వాంటం వ్యాలీ, ఏఐ ప్రాజెక్టుల కోసం జిల్లాల్లో ఏఐ శిక్షణ పొందేలా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, కేవలం ఐటీ గురించే కాదు ఆస్ట్రో ఫిజిక్స్ గురించి కూడా కేంద్రం ఆలోచిస్తోందన్నారు. ఏపీ ప్రభుత్వంతో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ సంస్థ ఒప్పందం చేసుకోవటం సంతోషకరమన్నారు. ఏడాదిన్నరలో ఏపీ ఫ్యూచరిస్టిక్ కేపిటల్ నగరం అవుతుందని తెలిపారు. ఇక రాజధాని అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న నిధులను సక్రమంగా, పారదర్శకంగా వినియోగిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని కేంద్రమంత్రి కోరారు. రాష్ట్రం తీసుకునే ప్రతి ఆర్థిక నిర్ణయానికి కేంద్రం అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు. ఈ శంకుస్థాపన కార్యక్రమం అమరావతి చరిత్రలో ఒక నూతన అధ్యాయమని, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తును సాధిస్తుందని కేంద్రమంత్రి సీతారామన్ ఆశాభావం వ్యక్తం చేశారు. రాజధాని మౌలిక వసతుల కల్పన కోసం, ప్రత్యేకించి ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కట్టుబడి ఉందన్నారు.



## ఆకట్టుకున్న పాఠశాల రాజ్యాంగ సభ

**ప్రజాపక్షం/జడ్చర్ల:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నసురుల్లాబాద్ విద్యార్థులచే పాఠశాల రాజ్యాంగ సభ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగ సభలో ఆనాడు రాజ్యాంగాన్ని సభ సభ్యులు ఏవిధంగా చర్చలు నిర్వహించి ముసాయిదా రాజ్యాంగాన్ని తయారు చేశారో అచ్చం అలాగే పాఠశాల విద్యార్థులు పాఠశాల రాజ్యాంగ సభను ఏర్పాటు చేశారు. ఇందులో నాటి రాజ్యాంగ పరిషత్ అధ్యక్షులు బాబు రాజేంద్రప్రసాద్ మరియు ముసాయిదా రాజ్యాంగం చైర్మన్ అంబేద్కర్ పాత్రలను నిర్వహించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నసురుల్లాబాద్ రాజ్యాంగాన్ని రూపొందించారు. ఈ రాజ్యాంగంలో పాఠశాల వాతావరణం, పాఠశాల పౌరసత్వం, విద్యార్థుల హక్కులు, బాధ్యతలు ఆదేశిక సూత్రాలు, భాషలు, సంబంధాలు వంటి మొత్తం 22 భాగాలను చేర్చారు. విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని చూడముచ్చటగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఎమ్‌ఓ దుంకుడు శ్రీనివాస్ హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంలు మారుతి నారాయణ, అనంతప్ప, శ్రీనివాసులు, సాంఘీక శాస్త్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, విశ్రాంత ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి, శంకర్, సుశీల, మంజుల, సునీత, పరమేశ్వరి, చామంతి తదితరులు పాల్గొన్నారు.

## అంబులెన్స్‌లోనే సుఖ ప్రసవం

వీపనగండ్లలో అరుదైన ఘటన



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** వీపనగండ్ల మండలంలో అరుదైన సంఘటన చోటు చేసుకుంది. మండల పరిధిలోని కల్వరాల గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి అనే గర్భిణీ మహిళ శుక్రవారం తెల్లవారుజామున అకస్మాత్తుగా తీవ్రమైన పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. పరిస్థితి విషమించకుండా వెంటనే అత్యవసర సేవలైన 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన వీపనగండ్ల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద విధిలో ఉన్న 108 అంబులెన్స్ టెక్నిషియన్ రాము, పైలెట్ మైనుద్దీన్ తక్షణమే కల్వరాల గ్రామానికి చేరుకున్నారని, గర్భిణిని అంబులెన్స్‌లోకి ఎక్కించి వీపనగండ్ల సామాజిక అంబులెన్స్‌లోకి ఎక్కించి వీపనగండ్ల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే ప్రసవ వేదనలు మరింతగా పెరిగాయి. పరిస్థితిని అంచనా వేసిన 108 సిబ్బంది అప్రమత్తమై అంబులెన్స్‌లోనే అవసరమైన వైద్య సహాయం అందించారు. అత్యావసర పరిస్థుతుల్లో కూడా అత్యంత నైపుణ్యంతో వ్యవహరించిన టెక్నిషియన్ రాము, పైలెట్ మైనుద్దీన్ సహకారంతో భాగ్యలక్ష్మి , సుఖ ప్రసవం చేసి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లి, శిశువును పూర్తిగా సురక్షితంగా వీపనగండ్ల సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. ఇది భాగ్యలక్ష్మి కి రెండవ కాన్పు కాగా, సమయానికి 108 సేవలు అందుబాటులోకి రావడంతో ప్రాణాపాయ పరిస్థితి తప్పినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అత్యవసర సమయంలో అద్భుత సేవలందించిన 108 సిబ్బంది రాము, మైనుద్దీన్‌కు భర్త జయవర్ధన్ సహా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## గొప్ప సంఘసంస్కర్త జ్యోతిబా పూలే



ఎమ్మెల్యే మేఘారెడ్డి

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** జ్యోతిబాపూలే తన భార్య సావిత్రిబాయ్ పూలేతో కలిసి బాలికల కోసం దేశంలో మొదటి పాఠశాలను స్థాపించి మహిళలకు విద్యాబోధన చేసిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిబాపూలే రని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. పూలే వర్థంతి సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వనపర్తి యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వాకిటి ఆదిత్య, మున్సిపల్ మాజీ వైస చైర్మన్ బి కృష్ణ, పట్టణ మాజీ కౌన్సిలర్లు చీర్ల సత్యం, వెంకటేష మధుగౌడ్, యాదగిరి, శరవంద, విభూది నారాయణ, వినోద్ గౌడ్, బొంబాయి మన్నెకొండ, పరుశురాం, నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్ ఎస్టీ, ఎస్సీ, బిసి, మైనార్టీ నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న నామినేషన్ల ప్రక్రియ

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం వంగూరు మండలం తిప్పారెడ్డిపల్లి ఉప్పల్‌పాడు డిండి చింతపల్లి గ్రామాల నామినేషన్ కేంద్రాలను పరిశీలించడం జరిగిందని ఎంపిడిఓ బ్రహ్మాచారి పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 27గ్రామ పంచాయతీలకుగాను 86సర్పంచ్ నామినేషన్లు, 46వార్డుమెంబర్ల నామినేషన్లను దాఖలైనట్లు పేర్కొన్నారు. అనంతరం సమస్యాత్మక గ్రామాలపై అధికారులతో సమావేశమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళిమోహన్, ఎస్ఐ మహేష్, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది నిరంజన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# క్రీడ

# నిద్రలేని రాత్రులు మిగిల్చారు



## వరల్డ్ కప్‌లో 'రో-కో'ను ఆడించాల్సిందే
### మోర్నీ మోర్కెల్

వచ్చే వన్డే వరల్డ్ కప్ సన్నద్ధతలో ఉన్న భారత స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మకు మద్దతు పెరుగుతోంది. అనుభవజ్ఞులైన 'రోకో' మెగా టోర్నీలో ఆడడం టీమిండియాకు కలిసొస్తుందని మాజీలు అంటుండగా.. టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేశాడు. వరల్డ్ క్లాస్ బ్యాటర్లైన ఈ ఇద్దరిని 2027 ఎడిషన్‌లో కచ్చితంగా ఆడించాలని మోర్కెల్ చెబుతున్నాడు. స్వదేశంలో దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో సత్తా చాటాలనుకుంటున్న కోహ్లీ, రోహిత్ గురించి అతడు మరో ఆసక్తికర విషయం పంచుకున్నాడు. సొంతగడ్డపై కనీస పోరాటం కొరవడి టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైంది టీమిండియా. సఫారీల జోరుతో 25 ఏళ్లకు ఆ జట్టుకు సిరీస్ సమర్పించుకున్న భారత్ వన్డే సిరీస్ పట్టేయాలనే కసితో ఉంది. నవంబర్ 30న రాంచీలో తొలి మ్యాచ్ సన్నాహకాల్లో ఉంది టీమిండియా. లండన్ నుంచి వచ్చేసిన కోహ్లీ, ముంబై నుంచి రాంచీ చేరుకున్న రోహిత్ నెట్స్‌లో ప్రాక్టీస్ మొదలెట్టేశారు. ఈ సందర్భంగా విరాట్, రోహిత్‌తో ఆడిన అనుభవాలను గుర్తు చేసుకున్న మోర్నీ మోర్కెల్ వీరి భవితవ్యంపై కీలక వ్యాఖ్యలు చేశాడు. 'కోహ్లీ, రోహిత్‌తో కలిసి నేను చాలా మ్యాచ్‌లు ఆడాను. వీరిద్దరికి బౌలింగ్ సవాల్‌గా అనిపించేది. రోకో కారణంగా ఎన్నో నిద్రలేని రాత్రులు చవిచూశాను. కోహ్లీ, హిట్‌మ్యాన్ నాణ్యమైన క్రికెటర్లు. వీరిని కచ్చితంగా వచ్చే వన్డే ప్రపంచ కప్ ఆడించాలి. ఫిట్‌గా ఉండి.. పరుగులు సాధిస్తే వీరిని మెగా టోర్నీకి ఎంపిక చేయవచ్చు. ఎందుకంటే.. ఐసిసి టోర్నీల్లో అనుభవజ్ఞులైన ఆటగాళ్లు ఉండడం చాలాముఖ్యం. వరల్డ్ కప్ వరకూ 'రోకో' ఫిట్‌గా ఉంటే స్క్వాడ్‌లో ఉండే అవకాశముంది అని మోర్కెల్ తెలిపాడు. వన్డే సిరీస్‌లో విజయావకాశాలపై స్పందించిన మోర్కెల్.. ఈ రెండు వారాలు మమ్మల్ని చాలా నిరాశకు గురి చేశాయి. అయితే.. వన్డేల్లో సత్తా చాటుతాం. వన్డే ఫార్మాట్‌లో మా శక్తినంతా ఉపయోగిస్తాం. ఇటీవల కాలంలో భారత్ వన్డేల్లో బాగా ఆడుతోంది. సీనియర్లు కోహ్లీ, రోహిత్ స్క్వాడ్‌లో ఉండడం కొత్త ఎనర్జీ నిస్తోంది' అని చెప్పాడీ సఫారీ మాజీ పేసర్. ఒకప్పుడు దక్షిణాఫ్రికా పేస్ సంచలనమైన మోర్కెల్ వన్డేల్లో కోహ్లీని 8 సార్లు, రోహిత్‌ను ఏడుసార్లు ఔట్ చేశాడు. నవంబర్ 30న భారత్, దక్షిణాఫ్రికా మధ్య రాంచీలో మూడు వన్డేల సిరీస్ షురూ కానుంది.

## స్వదేశంలో టీమిండియాకు శ్రీలంక సవాల్..
### వైజాగ్, త్రివేండ్రంలో మ్యాచ్‌లు..!

ఇటీవలే విశ్వ విజేతగా అవతరించిన భారత జట్టు తొలి సిరీస్‌కు సన్నద్ధమవుతోంది. స్వదేశంలోనే ప్రపంచకప్‌ను సగర్వంగా ముద్దాడిన టీమిండియా ఉపఖండ జట్టు శ్రీలంకను ఢీకొట్టనుంది. డిసెంబర్‌లో ఇరుజట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరుగనుంది. దాంతో.. శుక్రవారం భారత క్రికెట్ నియంత్రణ మండలి షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ ఐదు మ్యాచ్‌లకు రెండు నగరాలను మాత్రమే ఎంపిక చేసింది బిసిసిఐ. వరల్డ్ కప్ తర్వాత కో హోస్ట్‌లు భారత్, శ్రీలంక తలపడుతున్న తొలి సిరీస్ ఇదే. డిసెంబర్ 21 నుంచి డిసెంబర్ 30 వరకూ జరుగబోయే ఐదు టీ20ల సిరీస్‌లో ఇరుజట్లు ఢీకొననున్నాయి. ఈ ఐదు మ్యాచ్‌లకు వైజాగ్, త్రివేండ్రం(తిరువనంతపురం)వేదిక కానున్నాయి. టీమిండియా ఈ ఏడాది జూన్‌లో చివరి పొట్టి సిరీస్ ఆడింది. అది కూడా ఇంగ్లండ్‌లో 32తో విజేతగా నిలిచింది హర్మన్‌ప్రీత్ సేన. లంక విషయానికొస్తే ఆ జట్టు మార్చిలో న్యూజిలాండ్‌తో ఆడిన సిరీసే ఆఖరు. ఆ సిరీస్‌ను ఇరుజట్లు 11తో సమం చేసుకున్నాయి.



తొలి టీ20– డిసెంబర్ 21 ఆదివారం, విశాఖపట్టణం
రెండో టీ20– డిసెంబర్ 23 మంగళవారం, విశాఖపట్టణం
మూడో టీ20– డిసెంబర్ 26 శుక్రవారం, తిరువనంతపురం
నాలుగో టీ20– డిసెంబర్ 28 ఆదివారం, తిరువనంతపురం
ఐదో టీ20– డిసెంబర్ 30, మంగళవారం, తిరువనంతపురం

## డిసెంబర్ 13న హైదరాబాద్‌కు స్టార్ ఫుట్‌బాల్ ప్లేయర్ రాక

ప్రఖ్యాత ఫుట్‌బాల్ ప్లేయర్ లియోనల్ మెస్సి.. ఇండియాలో టూర్ చేయనున్న విషయం తెలిసిందే. అయితే ఆ లెజెండరీ ప్లేయర్ ఇప్పుడు హైదరాబాద్‌లో కూడా అడుగుపెట్టనున్నాడు. ఈ విషయాన్ని అతను కన్ఫర్మ్ చేశాడు. తన ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో ఈ విషయాన్ని చెప్పాడు. మరికొన్ని వారాల్లో గోట్ టూర్ ప్రారంభంకానున్నదని, భారత్ ప్రదర్శిస్తున్న ప్రేమ పట్ల థ్యాంక్స్ చెబుతున్నట్లు పేర్కొన్నారు. తన విజిట్‌లో హైదరాబాద్ నగరాన్ని కూడా జోడించారని, ఇది సంతోషకరమైన విషయం అన్నారు. అర్జెంటీనా స్టార్ ఫుట్‌బాల్ ప్లేయర్ మెస్సి ఇండియాలోని కోల్‌కతా, ముంబై, ఢిల్లీ నగరాలతో పాటు హైదరాబాద్‌లోనూ టూర్ చేయనున్నారు. డిసెంబర్ 13న హైదరాబాద్ నగరానికి మెస్సీ వస్తున్నాడు. ఆ రోజు రాత్రి 7.30కు కార్యక్రమం జరగనున్నది. మెస్సీ రాకను స్వాగతిస్తూ శుక్రవారం తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. ఫుట్‌బాల్ ప్రేమికులకు, హైదరాబాద్ నగరానికి ఇది సంతోషకరమైన విషయం అన్నారు. మెస్సీకి ఘన స్వాగతం పలికేందుకు నగరం సిద్ధంగా ఉందన్నారు.




# ఫోకస్ సైన్స్

## కాకతాళీయం..



భూమిపై నుంచి చూసినప్పుడు సూర్యుడు, చంద్రుడు దాదాపు ఒకే పరిమాణంలో కనిపిస్తాయి. చంద్రుడి కంటే సుమారు 400 రెట్లు పెద్దదైన సూర్యుడు మనకు ఆకారంలో చంద్రుడి కంటే చాలా పెద్దగా కనిపించాలి కదా? ఎందుకు అలా జరగడం లేదనే ప్రశ్నకు సమాధానం ఆసక్తికరంగా ఉంటుంది. ఇది కాకతాళీయం కావచ్చుగానీ, చంద్రుడి కంటే సూర్యుడు 400 రెట్లు పెద్దదిగా ఉండడమేకాదు... భూమి నుంచి చంద్రుడికి ఎంత దూరమో, అక్కడి నుంచి సూర్యుడు సరిగ్గా 400 రెట్లు ఎక్కువ దూరంలో ఉన్నాడు. దూరంలోని వ్యత్యాసం, పరిమాణంలోని వ్యత్యాసం సుమారు ఒకటే కాబట్టి, భూమి పైనుంచి చూసినప్పుడు రెండూ దాదాపు ఒకే సైజ్‌లో కనిపిస్తాయి.


## విశ్వరూపం త్రికోణం



అనంత విశ్వాన్ని గోళాకారంగా పేర్కొంటారు. అయితే, ఇది త్రికోణాకారంగా ఉంటుందనే వాదన ఒకటి తెరపైకి వచ్చింది. కొంత మంది శాస్త్రవేత్తల అభిప్రాయాన్ని అనుసరించి విశ్వం అతి పెద్ద చదరపు ఆకారంలో లేదా ఫ్లాట్‌గా ఉంది. అంటే విశ్వంలో భారీ త్రికోణాన్ని గీస్తే, దాని అంతర్గత కోణాల మొత్తం ఖచ్చితంగా 180 డిగ్రీలుగానే ఉంటుంది. ఇది యుక్లిడ్ గణితంలోని సమతల భౌతిక శాస్త్ర నియమానికి సమానమైనది. దీనిలో త్రికోణం యొక్క మూడు కోణాలు జోడించి ఎప్పుడూ 180 డిగ్రీలు వస్తాయి. 'ఫ్లాట్ యూనివర్స్' అంటే విశ్వం యొక్క పెద్ద భాగం యుక్లిడియన్ జ్యామితి లేదా యుక్లిడియన్ జామెంట్రీకి అనుగుణంగా ఉంటుంది. ఇందులో సరిపడిన రెండు సమాంతర రేఖలు ఎప్పుడూ కలవవు. త్రికోణాకారంలోనే తిరుగుతాయి. మొత్తం 180 డిగ్రీల కోణాన్ని ఆవిష్కరిస్తాయి. మరో రకంగా చెప్పాలంటే, స్పియరికల్ (గోళాకార) లేదా హైపర్బోలిక్ (సడిల్ ఆకార) విశ్వాలకు భిన్నంగా ఫ్లాట్ యూనివర్స్ ఉంటుంది. ఇందులోని కోణాల మొత్తం ఎక్కువ లేదా తక్కువ వంపుతో ఉంటాయి. కాస్మిక్ మైక్రోవేవ్ బ్యాక్‌గ్రౌండ్ (సిఎంబి) అనే విశ్వంలో పురాతన కిరణాలను గణితపరంగా అధ్యయనం చేసిన శాస్త్రవేత్తలు ఫ్లాట్ యూనివర్స్ భావనకు రూపకల్పన చేశారు. బూమెరాంగ్, డబ్ల్యుఎంఎపి, ప్లాన్ సికె వంటి ఉపగ్రహాలు, వివిధ ప్రయోగాలు విశ్వం 99 శాతం బల్లపరుపుగా ఉందని ఆధారాలు చూపాయి. సాధారణంగా, పెద్ద బహుళ కోణాన్ని అంచనా వేయడంలో వంపు లేదా వక్రత మొత్తం 180 డిగ్రీలు వస్తే, అది విశ్వం 'ఫ్లాట్' అని అర్థం. కాగా, విశ్వం త్రికోణాకృతిలో ఉందనే ప్రతిపాదిక సిద్ధాంతానికి ఇంకా ధ్రువీకరణ లేదు. ప్రస్తుతానికి ఇది ప్రారంభ దశలోనే ఉంది. అధ్యయనం మరింత లోతుగా జరిగితేగానీ, ఈ వాదనకు బలం చేకూరదు.

## కణాలకూ చెవులుంటాయ్!

చెవులు మాత్రమేకాదు.. మన శరీరంలోని కణాలు కూడా మన చుట్టూ ఉన్న శబ్దాలను వినగలవని శాస్త్రవేత్తలు ఇటీవల గుర్తించారు. వినికిడిపై ఇప్పటి వరకు మనిషికి ఉన్న అవగాహనకు, సంబంధిత సూత్రాలకు ఇది చాలా భిన్నం. సైన్స్ పత్రికలో సమాచారాన్ని అనుసరించి, మనిషిలో ప్రతి కణం ఒక సున్నితమైన శబ్ద గ్రహీతగా పని చేస్తోంది. అంటే మన చుట్టూ ఉన్న ప్రతి ధ్వనికంపనను ఏదో స్థాయిలో గుర్తించగల సమర్థత మన శరీరంలో ఉంది. ఈ ఆవిష్కరణతో శరీరశాస్త్రం, వైద్యశాస్త్రంలో ఇంత వరకూ ఉన్న వివరణలు, సిద్ధాంతాలను తిరిగి పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. కణాలు శబ్దాల మార్పులను గ్రహించగలవన్న వాస్తవం వైద్యరంగంలో కొత్త మార్గాలను తెరవవచ్చు. ఉదాహరణకు, భవిష్యత్తులో శబ్ద తరంగాలను ఉపయోగించి కణాల ఆరోగ్యాన్ని మార్చడం, అవయవాల పునరుద్ధరణ లేదా రోగనిర్ధారణ వంటి కొత్త సాంకేతికతలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. సూక్ష్మంగా చెప్పాలంటే, మన శరీరం స్వయంగా ఒక జీవ జైవరూప రికార్డింగ్ పరికరం లా వ్యవహరించగల సామర్థ్యం కలిగి ఉంది.



## గదిలో మబ్బు తునక!

ఇక్కడ కనిపిస్తున్నది ఎవరో వేసిన చిత్రం కాదు. డచ్ కళాకారుడు బెర్నాట్ స్మిల్డే ఆవిష్కరించిన ఓ అద్భుతం. అతను ఒక గదిలో మబ్బు తునకను సృష్టించి, అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడు. 'నింబస్' అనే ప్రాజెక్టు కింద అతను గదిలో సరైన ఉష్ణోగ్రత, తేమ, కాంతి సమతౌల్యాన్ని సాధించాడు. వాటి ద్వారా క్రమంగా మబ్బుల రూపాన్ని సృష్టిస్తున్నాడు. ఇవి కొద్ది సేపటి తర్వాత తేలిపోతాయి. క్రమంగా పలుచబడి కనుమరుగవుతాయి. కంప్యూటర్ ఎఫెక్ట్స్‌గా కాకుండా, నిజమైన మబ్బులను సృష్టించడం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటున్నది. ఇది నీటి ఆవిరి, ధూళి కణాలతో రూపొందిన వాస్తవ మబ్బు తునక అని తెలుసుకొని అంతా నిర్ఘాంతపోతున్నారు. స్మల్డే ఈ కళా సృష్టులను ప్రపంచవ్యాప్తంగా గ్యాలరీస్‌లో ప్రదర్శిస్తున్నాడు. ఫొటోలు తీసి అందరిని మంత్రముగ్ధులను చేస్తున్నాడు. ఆలోచనల్ని, వైజ్ఞానిక నియంత్రణల్ని కలిపి, ఊహాశక్తి పరిమితి లేనిదని అతను ప్రత్యక్షంగా చూపించాడు. గదుల్లో కేవలం కొన్ని సెకన్లు మాత్రమే కనిపిస్తున్నప్పటికీ, ఈ మబ్బులను చూసేందుకు ప్రజలు క్యూ కడుతున్నారు. ఇది నిండైన ఉద్వేగాన్ని ప్రేక్షకుల మనసుల్లో నింపుతున్న సాంకేతిక విజ్ఞానంతో కూడిన కళాకృతి.



# మనువాదంపై తిరుగుబాటు చేసిన ఫూలే

### వర్ధంతి కార్యక్రమంలో సిపిఐ నేతలు తక్కళ్లపల్లి, బాగం

**ప్రజాపక్షం/ఖమ్మం :** తరతరాలుగా ప్రజలను అజ్ఞానం నుంచి దోపిడీ చేస్తున్న మనువాదంపై సామాజిక తిరుగుబాటు చేసిన విప్లవ వీరుడు మహాత్మా జ్యోతిబాపూలే అని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని సిపిఐ గిరిప్రసాద్ భవన్‌లో శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి సందర్భంగా పూలే చిత్రపటానికి బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాగం మాట్లాడుతూ మహిళలను చైతన్యవంతుల్ని చేయడానికి నాటి సామాజిక కట్టుబాట్లను ఎదిరించి పూలే విద్యా బోధన కోసం పాఠశాలను ప్రారంభించారన్నారు. ఇందు కోసం పూలేతో పాటు పూలే సతీమణి సావిత్రిబాయి పూలే అనేక అవమానాలను భరించారన్నారు. పూలే జీవితం నేటి తరానికి ఆదర్శం అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, సిహెచ్ సీతామహాలక్ష్మి, బిసి హక్కుల సాధన కమిటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేకల శ్రీనివాసరావు, తాటి వెంకటేశ్వరరావు, మహిళ సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి నిర్మల, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మి నారాయణ, జిల్లా సమితి సభ్యులు పేరబోయిన మోహన్‌రావు, గాయకులు దాసరి రాము, నాయకులు జ్వాలా నర్సింహారావు, నంబూరి శంకర్ రావు, వాడపల్లి యాకయ్య, కృష్ణమాచారి పాల్గొన్నారు.







**వరంగల్ :** వరంగల్‌లోని శివనగర్ తమ్మెర భవన్ సిపిఐ కార్యాలయంలో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. పూలే చిత్రపటానికి ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే సాంఘిక, దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. మహిళలకు విద్యా అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక పాఠశాలలు స్థాపించి తన భార్య సావిత్రిభాయ్ పూలేను మొదటి ఉపాధ్యాయురాలుగా నియమించి స్త్రీలకు, అన్నికులాల వారికి విద్య నేర్పించినటువంటి మహనీయుడు అన్నారు. కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. బాష్ మియా, రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, బుస్సా రవీందర్, తోట చంద్రకళ, వీరగోని శంకరయ్య, సంగి ఏలేంధర్, ఐతే యాకయ్య, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పార్థసారథి, ల్యాదల్ల శరత్, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్క సుధీర్, నాయకులు ఓర్సు రాజు, తాళ్ళపల్లి జాన్ పాల్, యండి అక్బర్ పాషా, తాళ్ళపల్లి రహేళ, జన్ను రవి, పరికిరాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## 'రిమ్స్' కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అందించాలి

### మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ డిమాండ్

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** రిమ్స్‌లో పని చేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కాంట్రాక్ట్ కార్మికులకు కనీసం రూ.26000 వేతనాలు అందించాలని మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం రిమ్స్ డైరెక్టర్‌కు నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ ఒక నెల పెండింగ్ వేతనాలు, నాలుగు నెలల పిఎఫ్, ఇఎస్ఐ చెల్లింపులు కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. లేని పక్షంలో డిసెంబర్ 2 నుంచి నిరసన,5న రాష్ట్రవ్యాప్తంగా ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రిమ్స్ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సంగీత, ఎండి ఖాసీం, నాయకులు రాజేందర్‌సింగ్, శ్రీను, పద్మ, కృపకర్, ఆరీఫ్, రాణి, అలీం, సైఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



## కార్మికుల హక్కులు బలహీనపర్చే నాలుగు లేబర్ కోడ్‌లు

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్




**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** కేంద్రంలోని బిజెపి సర్కార్ అమలు చేస్తున్న నాలుగు కార్మిక కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ కార్మిక, రైతు సంఘాల పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కోడ్‌ల ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ కార్మికుల హక్కులు బలహీనపర్చేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లను దొంగచాటుగా ఆమోదించిందన్నారు. ఈ లేబర్ కోడ్‌ల అమలుతో వేతన లెక్కల్లో భత్యాల తొలగింపు, పని గంటల పెంపు, ఔట్‌సోర్సింగ్, ఫిక్స్‌డ్ టర్మ్ నియామకాలతో కార్మికుల హక్కులు బలహీనపడుతున్నాయన్నారు. మహిళా కార్మికుల హక్కులు, ప్రసూతి ప్రయోజనాలపై ఈ కోడ్‌లలో స్పష్టత లేదని ఆయన విమర్శించారు. 2019 నుంచి ఎన్నో సమ్మెలు చేసిన కేంద్రం స్పందించలేదని సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లలో మోదీ ప్రభుత్వం వెనక్కు తగ్గే వరకు పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. కార్యక్రమంలో సిర్రా దేవేందర్, మంతెన కాంతారావు, సలీం, మోసిన్, మహేందర్, అశోక్, బామన్ జగన్, కాసిం రవి, వైఎండి ముజీబ్, ఐఎన్‌టియుసి, ఐఎఫ్‌టియు, టియుసిఐ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం పనిచేసే వారికే పట్టం

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు వెల్లడి

**ప్రజాపక్షం/వరంగల్ :** ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజల గొంతుకగా నిలుస్తున్న కమ్యూనిస్టులను పంచాయతీ ఎన్నికలలో పట్టం కట్టాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం వరంగల్ నగరంలోని సిపిఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్‌లో వరంగల్ జిల్లా సిపిఐ సమితి సమావేశం అక్కపల్లి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు జరుగుతున్న ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీ చేసి గెలవాలనుకునే వారిని తిరస్కరించి, నిజాయితీపరులకు పట్టం కట్టాలని, ప్రజా సమస్యలను విస్మరించి పరస్పరం దూషణలు చేసుకుంటున్న పార్టీలను తిరస్కరించి నిబద్ధతతో ప్రజల కోసం పని చేసే కమ్యూనిస్టు పార్టీలను ఎన్నికలలో ఆదరించాలని తక్కళ్లపల్లి కోరారు. సమావేశంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె బాష్‌మియా, రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, బుస్సా రవీందర్, తోట చంద్రకళ, వీరగోని శంకరయ్య, సంగి ఏలేంధర్, ఐతే యాకయ్య, ఓర్సు రాజు, ల్యాదల్ల శరత్, పార్థసారది తాళ్ళపల్లి జాన్ పాల్, ఎండి అక్బర్ పాషా, తాళ్లపల్లి రహేళ, జన్ను రవి, పరికిరాల రమేష్, సుదీర్ తదితరులు పాల్గొన్నారు.




**చింతకాని :** సిపిఐ అభ్యర్థులను గెలిపించి గ్రామాభివృద్ధికి బాటలు వేయాలని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ కోరారు. శుక్రవారం చింతకాని మండలం బస్వాపురం గ్రామపంచాయతీ సిపిఐ సర్పంచి అభ్యర్థి ఆవుల నర్సింహారావు నామినేషన్ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ బస్వాపురం గ్రామం సిపిఐ కంచుకోట అన్నారు. తిరిగి సర్పంచ్ స్థానాన్ని కైవసం చేసుకోవాలన్నారు. అనంతరం అభ్యర్థి ఆవుల నర్సింహారావు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ సమర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శి మార్గం శ్రీను, నాయకులు రాసాల మోహన్‌రావు, బొడ్డు కొండలరావు, బద్దల నర్సింహారావు, చంద్రకాని రామ్మూర్తి, పెద్ద వెంకటి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

**వలిగొండ :** గ్రామపంచాయతీ ఎన్నికలలో సర్పంచ్ స్థానాలకు సిపిఐ పోటీలో ఉంటుందని పార్టీ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని దుప్పల్లి గ్రామ శాఖ సమావేశం కట్ల యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో యానాల మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్యలో ఉండి సమస్యల కోసం వాటి పరిష్కారం కోసం పోరాడుతున్న పార్టీని గెలిపించాలని కోరారు. అనంతరం మెట్టు అంజయ్య, మెట్టు నరసింహాలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్, నాయకులు బాలగోని సత్యనారాయణ, మారోజు నరసింహాచారి, నరిగ యాదయ్య, కన్నెబోయిన పృథ్వీరాజ్, కనబోయిన రాములు, తాతయ్య, నోముల నరసయ్య, ఎర్ర కిరణ్ పాల్గొన్నారు.







# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఎన్నికల నియమావళి అధికారులు విధిగా పాటించాలి : ఆర్‌డిఓ సరిత



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఎన్నికల నియమావళిని అధికారులు విధిగా పాటించాలని షాద్‌నగర్ ఆర్‌డిఓ సరిత అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన వాహనాల తనిఖీ కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. అక్కడి నుండి సమీపంలో ఉన్న రాయికల్ ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ సరిత మాట్లాడుతూ ఎన్నికల నియవాళిని పాటించని వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. అనుమానం వచ్చిన ప్రతి వాహనాన్ని విధిగా తనిఖీలు చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు ఉంటాయన్నారు. ఈ తనిఖీల్లో ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ నాగయ్యతోపాటు ఎన్నికల అధికారులు ఉన్నారు.

## కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలి

ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చందుయాదవ్



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అందించాలని, కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కె.చందుయాదవ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రులలో పనిచేస్తున్నటువంటి ఫెసిలిటీ మేనేజ్మెంట్ సర్వీసెస్ అవుట్ సోర్సింగ్ విభాగంలో పనిచేయుచున్న శానిటరీ పేషంట్ కేర్ సెక్యూరిటీ కార్మికుల టెండర్ల కాలపరిమితి ముగియడంతో కొత్త టెండర్లకు పిలవాలని డిమాండ్ చేశారు. అనంతరం కొండాపూర్ డిస్ట్రిక్ట్ హస్పటల్ సూపర్డెంట్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో శ్రావణ్ కుమార్‌యాదవ్, కొండలు, నారాయణ, పద్మ, రాజు తపాల్గొన్నారు.


## నాణ్యతగా అభివృద్ధి పనులు



**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** అభివృద్ధి పనుల్లో అధికారులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కెపురం డివిజన్ ఎన్‌టిఆర్‌నగర్ ఫేజ్2లో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను అధికారులతో కలిసి ఉపేందర్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసీ అసిస్టెంట్ ఇంజనీర్ గోపాల కృష్ణ, సైట్ సూపర్‌వైజర్ మాధవి, ఎన్‌టిఆర్‌నగర్ ఫేజ్2 అధ్యక్షులు రవి, నానవల జ్ఞానేశ్వర్‌యాదవ్, షేక్ నాభీ, లక్ష్మణ్, శ్రీనాథ్, సలీం, పవన్, అశోక్, పాండు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


## ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మీ



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఉద్యోగ పర్వంలో పదవీ విరమణ సాధారణమని షాద్‌నగర్ డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం షాద్‌నగక్ పిపి యూనిట్‌లో పని చేస్తున్న హెల్త్ సూపవర్‌వైజర్ సువర్ణ ఉద్యోగ పదవీ విరమణ పొందిన నేపథ్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ సువర్ణ సర్వీసు ఏఎన్‌ఎంగా హెల్త్ సూపర్‌వైజర్‌గా వివిధ ప్రాంతాల్లో పని చేశారని, ఎక్కడ విధులు నిర్వహించిన ప్రజలకు మెరుగైన సేవలు అంధించారని, దాంతోనే పదోన్నతులు వచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ జె.శ్రీనివాసులు, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ విష్ణువర్ధన్, హెల్త్ సూపర్ వైజర్ శ్రీరామ, పిపి యూనిట్ స్టాఫ్‌నర్స్ వినీత, పిపి యూనిట్ సీనియర్ అసిస్టెంట్ పద్మ, ఏఎన్‌ఎం స్వప్న పాల్గొన్నారు.

## అవుట్‌లెట్ స్టోర్ ప్రారంభం



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** కొత్తగూడలోని శరత్ సిటీమాల్‌లోఎక్స్‌క్యూటివ్ బ్రాండ్ అవుట్‌లెట్(ఇబిఓ) టెక్నోస్పోర్ట్ స్టోర్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ హీరో తేజ సజ్జా, టెక్నోస్పోర్ట్ సీఇఓ పుస్పెన్ మైటీలు విచ్చేసి షోరూమ్‌ను ప్రారంభించారు. అనంతరం సినీ హీరో తేజా సజ్జా మాట్లాడుతూ ఇక్కడ ప్రారంభించిన దుస్తుల స్టోర్‌లో ఉష్ణోగ్రత నియంత్రణ కోసం టెక్నోకూల్, శీతకాలం కోసం టెక్నోవార్మ్ దుస్తులు, యాంటీమైక్రోబియల్ రక్షణ కోసం టెక్నోగార్డ్ దుస్తులు, సూర్య రక్షణ కోసం యూపిఎఫ్ 50 వంటి సాంకేతికతలు గల ఏన్నో అనుబంధ దుస్తులు కస్టమర్ల కొరకు అందుబాటులో ఉంచారని తెలిపారు.

## మద్యం షాపులకు అనుమతి ఇవ్వొద్దు



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్:** హస్తినాపురం డివిజన్‌లో నూతనంగా వైన్స్ షాపులకు, బార్లకు ఎలాంటి అనుమతి ఇవ్వరాదని సరూర్‌నగర్ ఎక్సైజ్‌శాఖ అధికారులను బిజెపి ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ అధ్యక్షులు ఎరుకుల మల్లేష్‌గౌడ్ మాట్లాడుతూ శ్రీరమణ కాలనీలో ఉన్న వైన్స్ షాపును తక్షణమే తొలగించాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో గౌని వెంకటేష్ గౌడ్, కంది శ్రీనివాస్ రెడ్డి, కాంతరెడ్డి, నవనీత్, వెంకటేష్, మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## అభివృద్ధిలో అవగాహన లేదు

**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** రాష్ట్ర ప్రభుత్వ ప్రజాప్రతినిధులకు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే విషయంలో కనీస అవగాహన లేదని మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం తుర్కయాంజల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాదులో విలీనం చేయడం పేద, మధ్యతరగతి ప్రజలకు పెను భారంగా మారుతుదన్నారు. దీనికి వ్యతిరేకంగా పోరాటం చేస్తాం అన్నారు. కార్యక్రమంలో వంగేటి లక్ష్మారెడ్డి, జక్క కృష్ణారెడ్డి, కాకుమాను చెన్నయ్య, సంపతీశ్వర్ రెడ్డి, కళ్యాణ్ నాయక్, బొక్క గౌతమ్ రెడ్డి, తుమ్మల పల్లి వెంకటరెడ్డి, ఏనుగు ఆనంద్ రెడ్డి, బొడ్డు శ్రీనివాస్, జొన్నాడ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

# నేరస్తులకు శిక్ష పడడం అంతిమలక్ష్యం

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనర్

కీలక కేసుల పర్యవేక్షణకు 'సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ టీమ్'



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కీలక కేసుల పర్యవేక్షణకు సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఏర్పాటు చేయనున్నట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనర్ వెల్లడించారు. నేరస్తులను కేవలం అరెస్టు చేయడమే కాకుండా.. వారికి న్యాయస్థానాల్లో కఠిన శిక్షలు పడేలా చూడటమే పోలీసుల అంతిమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని టిజిఐసిసిసి ఆడిటోరియంలో అక్టోబరు నెలకు సంబంధించిన నేర సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసుల నమోదు, దర్యాప్తు తీరుతెన్నులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోజురోజుకి పెరుగుతున్న కేసులు, అక్విటల్ అయిన పాత కేసుల గురించి ఆరా తీశారు. అనంతరం అధికారులకు ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణం స్పందించి.. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఫిర్యాదులను పక్కనపెట్టినా, నేర తీవ్రతను తగ్గించి చూపినా ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. విధి నిర్వహణలో అలసత్వం వహించే అధికారులపై వేటు తప్పదని హెచ్చరించారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్షిస్తూ.. వాటిపై ప్రత్యేక దృష్టి సారించి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే మహిళల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. కేసుల దర్యాప్తులో ఎలాంటి లోపాలకు తావులేకుండా, ప్రతికేసుకు ఒక స్పష్టమైన 'ప్లాన్ ఆఫ్ యాక్షన్' రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. నగరంలో డ్రగ్స్, రోడ్డు ప్రమాదాలు, ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. అలాగే సైబర్ క్రైం, మహిళా భద్రత, స్ట్రీట్ క్రైమ్, ఆహార కల్తీ కేసులపై ప్రత్యేకంగా ఫోకస్ చేయాలని సూచించారు. రౌడీషీటర్లు, పాతనేరస్తులపై నిఘాపెంచాలని తమ పరిధిలో ఎలాంటి నేరాలను జరుగకుండా చూడాల్సిన బాధ్యత ఎస్‌హెచ్ఒలదే అని స్పష్టీకరించారు. తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిపై పి.డి.యాక్ట్ పెట్టాలని ఆదేశించారు. సాంకేతిక ఆధారాలను పక్కాగా సేకరించి దర్యాప్తు పూర్తి చేయాలని, తద్వారా శిక్షల శాతం పెంచేలా ప్రణాళికలు ఉండాలన్నారు. కఠిన శిక్షలు పడినప్పుడే నేరస్తుల్లో భయం ఏర్పడుతుందన్నారు. సమాజములో పెరిగిపోతున్న సైబర్ నేరాలను పరిశీలిస్తూ, వాటిని అదుపు చేసే విధంగా సాంకేతికతను పెంపొందించుకోవాలని, నిపుణుల సహాయముతో కేసులను దర్యాప్తు చేయాలని సూచించారు. పోలీసు అధికారులు విధి నిర్వహణలో ఉన్నప్పుడు తప్పనిసరిగా వెపన్ తమ వెంట ఉంచుకోవాలని ఆదేశించారు. ప్రతి అధికారి తమ పరిధిపై పూర్తిస్థాయిలో పట్టు సాధించాలని, ఎస్‌హెచ్ఓలు కింది స్థాయి సిబ్బందికి దిశానిర్దేశం చేస్తూ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో క్రైం అదనపు సిపి శ్రీనివాసులుతో పాటు వివిధ విభాగాలు, జోన్ డిసిపిలు కె.అపూర్వారావు, సిసిఎస్ డిసిపి శ్వేత, ఐపిఎస్ అధికారులు రక్షిత కృష్ణమూర్తి, ఎస్.రష్మి పెరుమాళ్, కె.శిల్పావళి, సి.రూపేశ్, కె.కిరణ్ ప్రభాక, బి.బాలస్వామి, జి.చంద్రమోహన్, సిహెచ్.శ్రీనివాస్, వి.అరవింద్‌బాబు, పి.లావణ్య నాయక్ జాదవ్ తో పాటు అన్ని అదనపు డిసిపిలు, ఎసిపిలు, ఎస్‌హెచ్‌లు పాల్గొన్నారు.

## కొత్త విత్తన చట్టంపై అవగాహన

రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉష



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** పాత విత్తన చట్టం మార్చి కొత్త విత్తన చట్టం తేవాలని కేంద్రప్రభుత్వం ప్రభుత్వం యోచిస్తోందని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.ఉష అన్నారు. పాత విత్తన చట్టం 1966ను మార్చి దాదాపు 55 సంవత్సరాల తరువాత 202లో కొత్త విత్తన చట్టం తేవాలని కేంద్ర ప్రభుత్వం ఆశిస్తోందని, దీని ముసాయిదాపై అందరి భాగస్వామ్యంతో అభిప్రాయ సేకరణ నిమిత్తం శుక్రవారం కలెక్టర్ ఆధ్వర్యంలో డిఐఒసి మీటింగ్ హాలులో "ముసాయిదా విత్తన బిల్లు 2025"పై అవగాహన, అభిప్రాయ సేకరణ జరిగింది. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె.సురేశ్, కృషి విజ్ఞాన కేంద్రం కెవికె శాస్త్రవేత్త డా.కృష్ణ, ఇతర జిల్లా అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలతో మోసపోతున్న అమాయకులు

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సైబర్ నేరాలతో ఎక్కువగా అమాయక ప్రజలు మోసపోతున్నారని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ (సిపి) అవినాష్ మహంతి అన్నారు. శుక్రవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ బ్యాంక్ అధికారులతో పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో సిపి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులు–పోలీసుల మధ్య సమాచార మార్పిడితో సైబర్ నేరాల కేసుల్లో త్వరితగతిన ఛేదించడమే సమావేశం నిర్వహించిన ముఖ్య ఉద్దేశం అన్నారు. నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫర్లు, ఆన్‌లైన్ స్కాములు, ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో ప్రజలు కష్టపడి పొదుపు చేసుకున్న డబ్బును కోల్పోతున్నారని సిపి అవినాష్ మహంతి అన్నారు. సాంప్రదాయ మోసాల కంటే సైబర్ మోసాలలోనే ప్రజలు ఎక్కువగా డబ్బు నష్టపోతున్నారన్నారు. బాధితులు తమడబ్బును తిరిగి పొందేందుకు బ్యాంకులు బలమైన వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అకౌంట్ ఫ్రీజ్ స్థితి నిర్ధారణ, బ్యాంక్ అకౌంట్ డీఫ్రీజ్ అభ్యర్థనల్లో ఆలస్యం కారణంగా పోలీసుల దర్యాప్తులో అడ్డంకి గా మారుతోందన్నారు. బ్యాంకులు అకౌంట్ స్టేట్‌మెంట్లు, కెవైసి వివరాలు పంపించడంలో ఆలస్యం జరగకుండా చూడాలన్నారు. ఏదైనా సైబర్ మోసం జరిగినప్పుడు బ్యాంకులు సకాలంలో స్పందించి పోలీసులకు సహకరించాలన్నారు. ఎప్పటికప్పుడు తమ బ్యాంకు ఖాతాలను సరిచూసుకోవాలన్నారు. సమావేశంలో మేడ్చల్ డిసిపి ఎన్.కోటిరెడ్డి, మాదాపూర్ డిసిపి రితిరాజ్, రాజేంద్రనగర్ డిసిపి యోగేష్‌గౌతమ్, సైబర్ క్రైమ్స్ డిసిపి వైవిఎస్. సుధీంద్ర, క్రైమ్స్ డిసిపి ఎ.ముత్యంరెడ్డి, మాదాపూర్ ఎస్ఓటి డిసిపి శోభన్‌కుమార్ బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దేశం ఏకీకరణకు పోరాడిన మహోన్నతుడు పటేల్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** భారత యూనియన్‌లో 565 సంస్థానాలను విలీనం చేయడం ద్వారా భారతదేశం ఏకీకరణకు పోరాడి మహోన్నతుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని మేరా యువ భారత్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ అన్సుమన్ ప్రసాద్ దాస్ అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్ర నగర్ నియోజకవర్గం పరిధిలోని అత్తాపూర్‌లో ఏర్పాటు చేసిన యూనిటీ మార్చ్‌ను రంగారెడ్డి జిల్లా యువజన అధికారి టి.ఏసయ్యతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. చైతన్య కళాశాల వద్ద ప్రారంభమైన పాదయాత్ర 4 కిలోమీటర్లు నడిచి సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం ఏర్పాటు చేసిన బహిరంగ సభ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఆత్మనిర్భర్ భారత్ ప్రతిజ్ఞ చేశారు. వేడుకల కన్వీనర్ మల్లారెడ్డి అధ్యక్షత వహించగా కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ షేక్ జహీదా బేగం తదితరులు పాల్గొన్నారు.

## 'జీరో ప్రాసెసింగ్ చార్జీల్లేకుండా రుణాలు'


**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** అత్యంత పోటీపడే వడ్డీ రేట్లతో జీరో ప్రాసెసింగ్ ఫీజు, ప్రీ పేమెంట్ చార్జీలు లేకుండా రుణాలు అందిస్తున్నట్టు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ రీజియన్, కార్పొరేట్ క్రెడిట్ జిఎం ఎడి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆటోమోటివ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, వరుణ్ మోటార్స్ వంటి వాహన డీలర్లతో అండ్ రోమెడా, స్టార్ గ్రూప్‌ల వంటి డివిఎస్ ఏను ఉద్దేశించి ప్రసంగించారు. జీరో ప్రాసెసింగ్ చార్జీల్లేకుండా రుణాలు అందించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. అనంతరం కస్టమర్లకు చెక్కులు, సంశన్ లెటర్లు అందజేశారు. అనంతరం హైదరాబాద్ ప్రధాన బ్రాంచిలో ఎన్ఆర్ఐ హెల్ప్‌డెస్క్‌ను శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో నారెడ్కో డైరెక్టర్ సాసన్ సిద్దార్థ, హైదరాబాద్ జోన్ ఎంవిఎస్ ప్రసాద్, రీజినల్ హెడ్ డిజిఎం బరన్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు అడ్మినిస్ట్రేటర్ జనరల్‌గా సోమ శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** హైకోర్టు అడ్మినిస్ట్రేటర్ జనరల్, అఫీషియల్ ట్రస్టీగా సోమ శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. ఈ పదవిలో ఆయన మూడేళ్లపాటు కొనసాగుతారు. అడ్మినిస్ట్రేటర్ జనరల్ చట్టం – 1963 ప్రకారం ఈ పోస్టులో ఆయన్ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత నెల 27న ఉత్తర్వులిచ్చింది. తనను అత్యంత ప్రాధాన్యం ఉన్న అడ్మినిస్ట్రేటర్ జనరల్, అఫీషియల్ ట్రస్టీగా ఎంపిక చేసినందుకు సిఎం రేవంత్‌రెడ్డికి, మాజీ మంత్రి జానారెడ్డికి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును పలువురు న్యాయవాదులు కలిసి అభినందించారు.

## జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి



**ప్రజాపక్షం/మియాపూర్:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నదని టియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని చందానగర్ పిజెఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిసెంబర్ 3న జరిగే మహా ధర్నా పోస్టర్‌ను జిల్లా అధ్యక్షుడు సలీమ్ పాషాతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన జర్నలిస్టుల జీవితాలు గత పుష్కర కాలంలో ఏ మాత్రం మెరుగు పడలేదని, ఉమ్మడి రాష్ట్రంలో పొందిన ఆరోగ్య బీమా వంటి సౌకర్యాలు సైతం అందకుండా పోయాయన్నారు. నూతన పాలసీని రూపొందించి అక్రెడిటేషన్లు జారీ చేయడం, ఆరోగ్య భద్రత కల్పించడం, ఇళ్ల స్థలాలు మంజూరు చేయడం, అనేక వృత్తి కమిటీలను పునరుద్ధరించడం వంటి కనీస సౌకర్యాలు కల్పనలో ప్రభుత్వం తీవ్రమైన అలక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మాధవ్‌రెడ్డి, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షులు దూపం ప్రసాద్, కార్యదర్శి షకీల్, ఇసి సభ్యులు ప్రణయ్, ప్రెస్‌క్లబ్ ప్రెసిడెంట్ కొండా విజయ్ కుమార్, కార్యదర్శి తిరుపతి రెడ్డి, వరుణ్, జర్నలిస్టులు శ్యామ్, మూర్తి,శ్రీనివాస్‌గౌడ్, నాగేందర్ రెడ్డి, విజయ్, మల్లేష్, శంకర్, శ్రీనివాస్, నరేష్, ప్రభాకర్, శశి, ప్రవీణ్, మణికంఠ, టిల్లు, బస్వరాజ్, షారఫొద్దీన్, యాసీన్, సింహాద్రి, ప్రవీణ్ పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిరావు పూలే సేవలు ఆదర్శణీయం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్







**ప్రజాపక్షం/షాద్‌నగర్:** కుల వ్యవస్థ నిర్మూలనతోపాటు మహిళోద్ధరణకు కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే సేవలు ఆదర్శనీయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయం అవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం మహాత్మా పూలే ఎంతో కృషి చేశారని, వారి ఆశయసాధనకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పి.వెంకట్ రాంరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్, కాంగ్రెస్ నేతలు చెంది తిరుపతిరెడ్డి, లింగారెడ్డిగూడ అశోక్, జెఎసి నేతలు జనార్ధన్, డాక్టర్ జె.శ్రీనివాసులు, శ్రీహరి, వెంకట్‌రెడ్డి, అర్జున్, టెలిఫోన్ వెంకటయ్యలు ఉన్నారు.

**బిసి జనసేన ఆధ్వర్యంలో...** అక్షరం విలువ ప్రపంచానికి చాటిన మహావ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని బిసి జనసేన జాతీయ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో బిసి జనసేన నేత అధ్యక్షురాలు జక్కుల జలజ, స్రవంతి రాజ్, అరుణగౌడ్, రాములు, జూపల్లి చంద్రశేఖర్, చందులాల్ జమాల్పూర్, భాగ్యలక్ష్మి , గడ్డమీది రమేష్ పాల్గొన్నారు.

**హయత్ నగర్ :** సిపిఐ హయత్ నగర్ మండల సమితి ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని సిపిఐ మండల సహాయ కార్యదర్శి మర్రి శోభన్ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యతోనే సామాజిక న్యాయం జరుగుతుందని పూలే భావించారన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కర్నే సుజాత, ఎఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సామిడి వంశవర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు బి.అరుణ్ కుమార్‌గౌడ్, మహిళా సమాఖ్య మండల ప్రధాన కార్యదర్శి కొప్పుల సరిత, పారిజాత, అరుణ, సౌజన్య, కళ్యాణి, సుమతి, వీరస్వామి, కళ్యాణి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**సరూర్‌నగర్ :** అక్షరాస్యత కోసం అసమానతల నిర్మూలన కోసం నిరంతరం కృషి చేసిన మహాత్మాజ్యోతిరావు పూలే అని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఐ బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందరంగారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాలాపూర్ చౌరస్తాలో సిపిఐ ఆధ్వర్యంలో మహాత్మాజ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ మండల సమాయ కార్యదర్శి రెడ్యానాయక్, మండల మహిళా కార్యదర్శి యాదమ్మ యాదవ్, బాలాపూర్ మండల కౌన్సిల్ సభ్యులు శ్రీనునాయక్, రైతు సంఘం కార్యదర్శి జాతర అంజయ్య, గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి శత్రునాయక్, మండల శాఖ కార్యదర్శి పిచ్చి రాజు తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## టిపిసిసి అధ్యక్షుడికి బొంగునూరి శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/దుండిగల్ :** మల్కాజ్గిరి మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు, నూతనంగా ఎన్నికైన మెదక్ డిసిసి అధ్యక్షులు అంజనేయులు గౌడ్ వారితో పాటు కుత్బుల్లాపూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి, టిపిసిసి మహేష్ కుమార్ గౌడ్ ను వారి నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు.

## దివ్యాంగులకు సంక్షేమ పథకాలు
### అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** దివ్యాంగుల అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా లభిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికి లభించేలా చర్యలు తీసుకొంటామని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా తెలిపారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ సంబురాలను పురస్కరించుకొని శుక్రవారం ఘట్కేసర్ మండలం ఏదులాబాద్‌లోని దివ్యాంగుల పునరావాస కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కేంద్రంలో 110 మంది దివ్యాంగులు ఉన్నారని, వారికి అవసరమైన స్పీచ్, ఫిజియో థెరపీల వంటి సౌకర్యాలను పూర్తి స్థాయిలో కల్పిస్తామన్నారు. దీంతోపాటు ప్రభుత్వం దివ్యాంగులకు అందిస్తున్న పెన్షన్లను ప్రతి ఒక్కరికి మంజూరయ్యేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దివ్యాంగుల తల్లిదండ్రులు పునరావాస కేంద్ర రహదారి మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని కోరటంతో స్పందించిన అదనపు కలెక్టర్ అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ సాంబశివరావు, స్థానిక వికలాంగుల సమాఖ్య అధ్యక్షులు రవి, స్థానిక మహిళా సమాఖ్య సభ్యులు, డిపిఎం, ఎపిఎం, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/పరిగి :** పరిగి ఎమ్మెల్యేరామ్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పరిగి పట్టణంలోని వెంకటేశ్వర దేవాలయ ఆవరణలో కాంగ్రెస్ కార్యకర్తలు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్య ఉన్న కార్యకర్తలకు అండగా ఉండి నియోజకవర్గంలో అభివృద్ధికి నిరంతరాయంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. సుఖ సంతోషాలతో అయురారోగ్యాలతో ఉండాలని ఆక్షాంక్షించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధాంతి పార్థసారథి. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కృషి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గనేమోని శ్రీనివాస్, జగన్, మహిపాల్ యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/తాండూరు:** పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. శుక్రవారం పెద్దేముల్, యాలాల మండల పరిధిలోని మంబాపూర్, కందనెల్లి, కోకట్ గ్రామాలలో ఏర్పాటు చేసిన క్లస్టర్లలో నామినేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతి ఎన్నికలు సజావుగా నిర్వహించే క్రమంలో నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి తప్పులు, పొరపాట్లు లేకుండా చూడాలని సూచించారు. అవసరానికి అనుగుణంగా సిబ్బందిని పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్లు దాఖలు చేసే క్రమంలో కావాల్సిన ధృవ పత్రాలను సమర్పించడం లాంటి విషయాలను అభ్యర్థులకు వివరంగా తెలియజేయాలని తెలిపారు. నామినేషన్ల ఫారాలను స్పష్టంగా చూసి వాటిలో ఏవైనా తప్పులు ఉంటే సరిచేసుకునే విధంగా అధికారులు అభ్యర్థులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఎన్నికల సమయంలో అభ్యర్థుల ఖర్చులు వివరాలను ఎప్పటికప్పుడు తీసుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతీలో పోటీచేసే అభ్యర్థులకు వ్యయాలకు సంబంధించి బ్యాంకు ఖాతాలు ఉండాలని సూచించారు. సర్పంచ్, వార్డు మెంబర్లు నిబంధనలకు అనుగుణంగానే ఖర్చులు పెట్టాలన్న విషయం అభ్యర్థులకు స్పష్టంగా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. నామినేషన్ కేంద్రాల పరిశీలనలో ఎంపిడిఓలు రత్నసింగ్, శ్రీనిజా, రిటర్నింగ్ అసిస్టెంట్, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

## రహదారి విస్తరణ పనుల పరిశీలన

**ప్రజాపక్షం /పూడూర్ :** అప్పాజంక్షన్‌నుండి మన్నెగూడ వరకు జాతీయ రహదారి విస్తరణ పనులను పరిగి ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షులు రామ్మోహన్ రెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రహదరి పనుల పురోగతిని, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ రహదారి నిర్మాణంపై పర్యావరణ ప్రేమికులు గ్రీన్ ట్రిబునల్‌లో వేసిన కేసును విరమింపచేయడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా జోక్యం చేసుకోని ఆ బాధ్యతను నాపై ఉంచారు. ఈ ప్రాజెక్టు వేగంగా ముందుకు సాగేందుకు ఆయన అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ రహదారి పనులను అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లడటం జరుగుతుందని, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వాటిని వ్యక్తిగతంగా పరిష్కరిస్తున్నానని మొదట ఈ ప్రాజెక్టుకు ఒక సంవత్సరంలేదా అంతకంటే ఎక్కవ సమయం పడుతుందని భావించినా, ఇప్పుడు ఏడాదిలోనే పూర్తిచేయాలనే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం అని తెలిపారు.

# 40 రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నాం
### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలోని 40 రైల్వే స్టేషన్లను ఆధునిక సౌకర్యాలతో పునరాభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పనుల పురోగతిని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఆయనతో పాటు చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్.గోపాలకృష్ణన్, దక్షిణ మధ్య రైల్వే చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సందీప్ జైన్, దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఎ. శ్రీధర్‌తోపాటు ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. అభివృద్ధి పనుల పురోగతిని ఆయన స్వయంగా పర్యవేక్షించారు. నూతన స్టేషన్ భవనం, 12 మీటర్ల ఎఫ్.ఓ.బి, ప్లాట్‌ఫామ్, సర్క్యులేటింగ్ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. పని ప్రదేశాలలో తీసుకుంటున్న భద్రతా చర్యలను కూడా సమీక్షించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగంగా కొనసాగుతోందని అన్నారు. ప్రయాణీకులకు సౌకర్యంగా ఉండేలా ఇటీవల గౌరవ ప్రధానమంత్రి చర్లపల్లి కొత్త రైల్వే టెర్మినల్‌ను కూడా ప్రారంభించారని ఆయన అన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధిని రూ. 720 కోట్లతో చేపట్టామని, పనులు బాగా జరుగుతున్నాయని, హైదరాబాద్ స్టేషన్‌ను కూడా రూ. 350 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని మరియు కాచిగూడ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి ప్రణాళిక ఆమోదం దశలో ఉందని ఆయన అన్నారు.

హైదరాబాద్ పట్టణ ప్రాంతంలోని హఫీజ్‌పేట, హైటెక్ సిటీ, మలక్‌పేట వివిధ రైల్వే స్టేషన్లను కూడా పునరాభివృద్ధి చేస్తున్నామని, వచ్చే ఏడాది కల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు. మొదటి దశలో భాగంగా హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌ను రూ.25.93 కోట్లతో అత్యాధునిక నిర్మాణాలు, ప్రయాణీకుల సౌకర్యాలతో పునరాభివృద్ధి చేస్తున్నట్లు శ్రీ జి. కిషన్ రెడ్డి తెలిపారు. రెండవ దశలో భాగంగా పాత స్టేషన్ భవన పునరుద్ధరణ మరియు ఇతర పనులను రూ.10కోట్లతో చేపడతామని ఆయన పేర్కొన్నారు. ఈ స్టేషన్ నుండి సికింద్రాబాద్, హైదరాబాద్, ఉమ్దానగర్, ఫలక్‌నుమా, మేడ్చల్ మరియు ఘట్‌కేసర్‌లకు ప్రతిరోజూ దాదాపు 62 సబ్ అర్బన్ రైళ్లు తిరుగుతున్నాయని ఆయన తెలియజేశారు. ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేవెళ్ల నియోజకవర్గంలోని హైటెక్, తాండూరు, వికారాబాద్, హఫీజ్‌పేట్ మొదలైన 4 స్టేషన్లను అమృత్ స్టేషన్లుగా ఆధునీకరిస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ స్వాగత ప్రసంగం చేశారు.



## అన్యాయాన్ని ఎదురించి మాట్లాడకపోతే చదువుకున్నట్లు కాదు
### పూలే వర్ధంతి సభలో సిపిఐ రాష్ట్ర నాయకులు కె.ఏసురత్నం

**ప్రజాపక్షం/నిజాంపేట్:** జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గాంధీనగర్‌లో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. అనంతరం సిపిఐ రాష్ట్ర నాయకులు కె.యేసు రత్నం, సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ, చదువుకుంటేనే బ్రతుకు అని నమ్మి తను చదువుకుని ప్రపంచానికి చదువు నేరిపిన మేధావి, మహాత్మా జ్యోతిరావు పూలే అన్ని తెలియజేశారు. మహిళలు కేవలం పిల్లలు కనే మిషన్‌లాగా చూసే సమాజంలో తన భార్య సావిత్రి బాయి పూలేకు చదువు నేర్పించి, తద్వారా పేద మహిళలకు చదువు నేర్పిన మహా మేధావి పూలే అని అన్నారు. కనుక జ్యోతిరావు పూలే ఆశయాల సాధనకోసం ప్రతి ఒక్కరు పాటుపడాలి అని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆశి, యాదయ్య, పొన్నకంటి దస్తగిరి, రమణ, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపకు భారత రాజ్యాంగం పట్ల అవగాహన
### శ్రీవిద్య ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** గడప గడపకు భారత రాజ్యాంగం వివిధ రాజకీయ పార్టీలు లేదా సంస్థలు ప్రజల వద్దకు వెళ్లి భారత రాజ్యాంగం గురించి దాని ప్రాముఖ్యతను వివరించాలని డాక్టర్ దాసరపు శ్రీనివాస్ అన్నారు. భారత రాజ్యాంగం వజ్రోత్సవ వేడుకల సందర్భంగా శుక్రవారం శ్రీవిద్య హాస్పిటల్లో ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ దాసరపు శ్రీనివస్,సీనియర్ జర్నలిస్టు మూసిఫౌండేషన్ కార్యదర్శి పిట్టల శ్రీశైలం కలిసి గడప గడపకు భారత రాజ్యాంగం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆర్గనైజేషన్ అధ్యక్షులు కుంటోళ్ళ యాదయ్య,ఉపాధ్యక్షులు మేకల పద్మారావు,సామాజిక కార్యకర్త సందుపట్ల జీవన్ రెడ్డిలు కలిసి డాక్టర్ శ్రీనివాస్‌కు పిట్టల శ్రీశైలంకు భారత రాజ్యాంగం బుక్స్‌ను అందించారు.ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ స్ఫూర్తి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రజలలో భారత రాజ్యాంగ స్ఫూర్తితో పాటు శాస్త్రీయ ఆలోచన పెంపొందించే విధంగా చేస్తున్న కృషి అభినందనీయమని ప్రజలలో సోదర భావం సౌభ్రాతృత్వం పెంపొందించే ప్రయత్నంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని డాక్టర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

## ఎంపి నిధులతో రోడ్డు పనులు



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** చిరకాలం గా అసంపూర్తిగా ఉన్న మౌలాలి డివిజన్‌లోని వెంకటేశ్వరనగర్ కాలనీ జెబిఆర్ స్కూల్ రహదారి పనులు ఎట్టకేలకు ఎంపి నిధుల నుండి మల్కాజిగిరి ఎంపి మంజూరు చేసారని మౌలాలి కార్పొరేటర్ సునీత తెలిపారు. సంవత్సరాల క్రితం వేసిన ఈ రహదారి ప్రస్తుత అవసరాల మేరకు అనుకూలంగా లేద ని, తాము పదే పదే కొరుతున్నా ఈ విషయాన్ని పట్టించుకోలేదని శుక్రవారం పర్యటించిన కార్పొరేటర్‌తో స్థానికులు అన్నారు. డివిజన్‌లో ఇప్పటికే అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించానని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి శ్రేణులు వాసుదేవరావు, అవినాష్, కుమార్, శ్రవణ్, శివ, మల్లారెడ్డి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తాం
### నగర మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్
### బోడుప్పల్‌లో ఘనంగా ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ



**ప్రజాపక్షం/బోడుప్పల్:** అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని నగర మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్యాం సుందర్ రావు ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు, ఇందిర మ్మ కమిటీ సభ్యులు హాజరై లబ్ధిదారులకు పట్టా లు పంపిణీ చేశారు. పట్టాలు అందుకున్న వారి లో ఆనందం వెల్లివిరిసింది. నాయకులకు, కమి టీ సభ్యులకు లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేరుతుందని, సన్న బియ్యం పంపిణీ, రెండు లక్షల రూపాయలు రుణమాఫీ, వడ్డీలేని రుణాలు, ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల విద్యుత్ వంటి అభివృద్ధి పనులు చేపట్టిందని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, కొత్త రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ 10 లక్షలకు పెంపు ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు చేసిందని తెలిపారు.

రాష్ట్రంలో పేద ప్రజల గృహావసరాల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ పథకం ఎంతోమందికి ఊరటనిస్తుందన్నారు. ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి భద్రతా చిహ్నమన్నారు. సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కుటుంబాలకు ఈ రోజు చిరస్మరణీయం అని గుర్తు చేశారు. లబ్ధిదారుల ఎంపికలో న్యాయం, సమానత్వం పాటించామని కమిటీ సభ్యులతో కలిసి కృషి చేశామని పేర్కొన్నారు. అర్హులందరికీ ఇండ్ల నిర్మాణం జరిగే వరకు సహాయ సహకారాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన మున్సిపల్ అధికారులకు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ, మేడ్చల్ జిల్లా బిబ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు బొమ్మక్ కళ్యాణ్ కుమార్, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, భూక్య సుమన్ నాయక్, సీసా వెంకటేష్ గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మరాటి మల్లేష్, ఎ.రాములు, దయ్యాల అలివేలు, ఉప్పుగళ్ళ ప్రశాంత్, రాహుల్, వార్డు అధికారులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

**వజ్రేష్ యాదవ్ కి శుభాకాంక్షల వెల్లువ**





మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమితులైన తోటకూర వజ్రేష్ యాదవ్ ను ఫీర్జాదిగూడ నగర కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ కో ఆప్షన్ సభ్యులు చిలుముల జగదీశ్వర్ రెడ్డి, బొడిగే కృష్ణగౌడ్, కొంపల్లి వెంకటేష్ గౌడ్ శుక్రవారం ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనునిత్యం ప్రజలకు సేవలందిస్తున్న తోటకూర వజ్రేశ్ యాదవ్ రానున్న కాలంలో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో బద్దం అంజిరెడ్డి, గున్నాల అశోక్ రెడ్డి, పీసర్ల సత్తిరెడ్డి, బద్దం జంగారెడ్డి, గట్టు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

**మేడ్చల్ మల్కాజిగిరి :** ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన వారందరికీ లభించేలా కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వైద్య సేవలకు గాను మంజూరైన లబ్దిదారులకు ఆయన శుక్రవారం అందచేసారు. కీసర నివాసి రామిడి ఉమకు రూ.1.75 లక్షలు, బోడుప్పల్ నివాసులు పోగుల వెంకటరెడ్డికి రూ.1.75 లక్షలు, షఫీరుద్దీన్‌కు రూ.2.40 లక్షలు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. పేద ప్రజలు ఖరీదైన వైద్యం పొందేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందిస్తున్న ఆర్థిక సాయం ఓ వరంలాంటిదని, అవసరమైన వారు తనను సంప్రదించాలన్నారు.

**షఫీకి సిఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2.40 లక్షల సాయం**

బోడుప్పల్ అశోక్ నగర్‌కు చెందిన మొహమ్మద్ షఫీ కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడు తూ, ఇటీవల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల గురించి తెలుసుకున్న మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ వెంటనే స్పందించి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.2,40, 000 మంజూరు అయ్యేలా చర్యలు తీసుకున్నారు. అవసరమైన పత్రాల సమీకరణ నుంచి, ఫైల్ ప్రాసెసింగ్ వరకూ మొత్తం ప్రక్రియను వ్యక్తిగతంగా పర్యవేక్షించి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కును షఫీ తండ్రి మొహమ్మద్ మొయినుద్దీన్ కు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, కష్టాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి, ఏ పార్టీ, ఏ మతం, ఏ వర్గం అనే తేడా లేకుండా సహాయం అందేలా పని చేయడం తమ బాధ్యత అని తెలిపారు. షఫీ కుటుంబ సభ్యులు వజ్రేష్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలుపుతూ, సంక్షోభ సమయంలో ఈ సహాయం తమకు పెద్ద సహాయకరంగా ఉందని, త్వరలో షఫీ పూర్తిగా కోలుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ మెంబెర్ ముజీబ్, మజార్, యాకూబ్, ఖాదర్,ఉస్మాన్, నయీమ్ లు పాల్గొన్నారు.

## హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు

**ప్రజాపక్షం/వికారాబాద్ :** పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2015సంవత్సరంలో నిండు గర్భిణిని దారుణంగా హత్యచేసిన కేసులో వికారాబాద్ జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి నిందితునికి జీవిత ఖైదుతోపాటు రూ.5000 జరిమాన విధించినట్లు జిల్లా ఎస్‌పి స్నేహ మెహ్రా వెల్లడించారు. జరిమానా చెల్లించనట్లు అయితే అదనంగా ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష అనుభవించవలసి ఉంటుందని తెలిపారు. బండపల్లి గ్రామం పెద్దముల్ మండల నివాసి అయిన గ్రామం గుండెపల్లి రవి తన భార్యకు ఇప్పటికే ఇద్దరు అడ పిల్లలు వున్నారు. శారీరంకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసేవాడు. 2015 సంవత్సరంలో తన భార్య మళ్లీ 8నెలలు గర్భిణీగా ఉన్నప్పుడు మళ్లీ ఆడపిల్లకు జన్మనిస్తుందని అనే తన అమ్మమాటలు విని అనుమానం పెంచుకొని ఎలాగైనా హతమార్చాలి అనే ఉద్దేశంతో 2015 సంవత్సరం జనవరి 3న భార్యను అతికిరాతంగా గొడ్డలితో హతమర్చడం జరిగింది. ఫిర్యాదు అందిన వెంటనే అప్పటి పెద్దేముల్ ఎస్ఐ కృష్ణ కేసు మోదు చేయడం జరిగింది. కరుణకోట్ సిఐ సైదిరెడ్డి కేసు దర్యాప్తు చేసి కోర్టు నందు చార్జ్‌షీట్ దాఖలు చేయడంతో ఈ రోజు నిందితునికి జీవిత ఖైదు శిక్ష జిల్లా న్యాయమూర్తి విధించారు.

## తట్టేపల్లి సర్పంచ్ స్థానానికి తీవ్ర పోటీ
### బిఆర్ఎస్ తరపున నామినేషన్ వేసిన మైబూబ్


**ప్రజాపక్షం/పెద్దేముల్:** పెద్దేముల్ మండల పరిధి తట్టేపల్లి సర్పంచ్ స్థానానికి తీవ్ర పోటి నెలకొంది. తట్టేపల్లి సర్పంచ్ పదవి జనరల్ కేటాగిరికి రిజర్వు చేశారు. పెద్దేముల్ మండల పరిధిలోనే తట్టేపల్లి మేజర్ గ్రామ పంచాయతీ కావడంతో సర్పంచ్ పదవిపై నేతలు ఆశలు పెట్టుకున్నారు. తొలి విడతలోనే పెద్దేముల్ మండలానికి ఎన్నికలు జరుగుతున్నాయి. అధికారులు ఈ నెల 27నుంచి నామినేషన్ల స్వీకరిస్తున్నారు. రెండవ రోజు శుక్రవారం తట్టేపల్లి సర్పంచ్ స్థానానికి సుమారు ముగ్గురు వ్యక్తులు నామినేషన్ల దాఖ లు చేసిన వారిలో ఉన్నారు. ఈ పాటికే బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తులు నామినేషన్ దాఖలు చేసిన వారిలో ఉన్నారు. తట్టేపల్లి గ్రామానికి చెందిన కొండాపురం గోపాల్ పెద్దేముల్ మండల కాంగ్రె స్ పార్టీ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. ఆయన తల్లి పార్వతమ్మ తాజా మాజీ సర్పంచ్‌గా పనిచేసిన విషయం తెలిసిందే. కాగా ఈ సర్పంచ్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ ఖాతాలో వేసుకోవడానికి గాను గోపాల్ తీవ్రంగా కృషి చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో మాత్రం సర్పంచ్ స్థానానికి అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. కాంగ్రెస్ పార్టీ నుండి నారాయణగౌడ్, గోపాల్, శంకర్, యువనాయకులు పోటీకి సై అంటున్నారు. బిఆర్ఎస్ నుండి పిఏసిఎస్ వైస్ చైర్మన్ అంజప్ప,షేక్ మైబూబ్, మాజీ వైస్ ఎంపిపి లక్ష్మ ణ్ సైతం సై అంటున్నారు. మరో పక్క బిఆర్ఎస్ పార్టీ నుండి షేక్ మైబూబ్ నామినేషన్ దాఖలు చేశారు.

## మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల మేరకు కొనసాగాలి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ కొనసాగుతూ సామాజిక సేవల్లో పాలుపంచుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా తన క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి అవసరాలను గుర్తించి కొనసాగించిన సేవలు నేటికీ చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. శ్రమజీవుల హక్కులు, బాలి కా విద్య, సామాజిక సంస్కరణల కోసం ఆయన చేసిన పోరా టం ఇప్పటికీ ప్రేరణగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం కార్పొరేటర్ సబిత, బిఆర్ఎస్ శ్రేణులు అనిల్ కిషోర్ గౌడ్, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు. గౌతంనగర్ చౌరాస్తాలో జరిగిన మరో కార్యక్రమంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన స్థానిక కార్పొరేటర్ మేకల సునీత మాట్లాడుతూ పూలే అడుగుజాడల్లో ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

**కాప్రాలో :** మహత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి కుషాయిగూడ ఆర్‌టిసి డిపో మేనేజర్ వేణుగోపాల్ ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ నరసింహరెడ్డి,అసిస్టెంట్ మేనేజర్ చంద్రమౌళి, కె లక్ష్మ ణస్వామి, రీజినల్ అధ్యక్షురాలు సృజన, కుషాయిగూడ డిపో అధ్యక్షులు, ఎస్,ఎస్‌టి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.







# రీల్

## అఖిల్ రాజ్‌తో 'అర్జునుడి గీతోపదేశం'



రాజు వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ రాజ్, దివిజ ప్రభాకర్, ఆదిత్య శశికుమార్, సదన్, వసంతిక మచ్చ, హీరో హీరోయిన్స్‌గా రూపొందుతున్న చిత్రం అర్జునుడి గీతోపదేశం. వరలక్ష్మి శరత్ కుమార్ ఇంపార్టెంట్ రోల్ ప్లే చేస్తున్నారు. సతీష్ గోగాడ ని దర్శకుడిగా పరిచయం చేస్తూ ఫస్ట్ కట్ ఫిలిం ఫ్యాక్టరీ బ్యానర్‌పై త్రిలోక్ నాథ్ కాళిశెట్టి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఎనభై శాతం షూట్ హైదరాబాద్, రాజమండ్రి, అమలాపురం పరిసర ప్రాంతాల్లో జరిగింది. ఆఖరి షెడ్యూల్ డిసెంబర్‌లో మొదలవుతుందని చిత్ర నిర్మాత త్రిలోక్ నాథ్ కాళిశెట్టి తెలిపారు. ఈ చిత్రానికి చరణ్ అర్జున్ సంగీతం అందిస్తున్నారు. ఛాయాగ్రహణం చైతన్య కందుల, ఎడిటర్ ఎంఎన్ అర్జున్.

## 'పతంగ్' లిరికల్ వీడియో విడుదల



న్యూ టాలెంట్‌ను ఎంకరైజ్ చేయడంలో ఎప్పుడూ ముందుండే సురేష్ ప్రొడక్షన్స్ అధినేత, ప్రముఖ నిర్మాత డి.సురేష్ బాబు తాజాగా 'పతంగ్' చిత్ర టీమ్‌తో చేతులు కలిపారు. సురేష్ ప్రొడక్షన్స్ డి.సురేష్ బాబు సమర్పణలో ఈ చిత్రం డిసెంబరు 25న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఇటీవల ఈ చిత్రంను ప్రత్యేక్షంగా వీక్షించి, చిత్ర టీంను ప్రశంసించిన ఆయన 'పతంగ్' చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై తన సమర్పణలో చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నారు. పతంగుల పోటీతో రాబోతున్న ఈ కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్'. సినిమాటిక్ ఎలిమెంట్స్, రిషన్ సినిమాస్, మాన్సూన్ సంస్థలు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నీ ఈ స్పోర్ట్స్ డ్రామా ఈ చిత్రానికి విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి, నాని బండ్రెడ్డి నిర్మాతలు. ఈ చిత్రానికి ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకుడు. ఈ చిత్రంలో ఇన్‌స్టాగ్రామ్ సెన్సేషన్ ప్రీతి పగడాల, జీ సరిగమప రన్నరప్ ప్రణవ్ కౌశిక్‌తో పాటు వంశీ పూజిత్ ముఖ్యతారలుగా నటిస్తున్నారు. మరికొంత మంది నూతన నటీనటులతో పాటు ప్రముఖ సింగర్, నటుడు ఎస్పీ చరణ్ ఈ చిత్రంలో కీలకమైన పాత్రలో కనిపించబోతున్నారు. సురేష్ ప్రొడక్షన్స్, డి.సురేష్ బాబు సమర్పణలో ఈ చిత్రం డిసెంబరు 25న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ చిత్రంలోని ఎమోషనల్ డ్రామా అంటూ కొనసాగే ఓ మాసివ్ పాటను చిత్ర సమర్పకుడు సురేష్‌బాబు విడుదల చేశారు. శుక్రవారం జరిగిన ఈ పాత్రికేయుల సమావేశంలో ఈ పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ.. 'కొత్తతరం అంతా కలిసి ఈ సినిమా చేశారు. ఎంతో డబ్బు ఖర్చు పెట్టి ఎంతో రిచ్గా చేశారు. నాని బండ్రెడ్డి మంచి క్రియేటివిటి ఉన్న పర్సన్. కెమెరా వర్క్ అన్ని బాగున్నాయి. ఈ సినిమా కోసం ఎంతో ఖర్చు పెట్టి క్లైమాక్స్ను షూట్ చేశారు. ఓ స్టేడియంను తీసుకుని, పతంగుల పోటీ పెట్టి ఎంతో భారీగా ఆ పతాక సన్నివేశాలు తీశారు. సినిమా తప్పకుండా అందరికి నచ్చుతుంది. తప్పకుండా ఈసినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు.

## 'భీమవరం బల్మా' పాట ఆవిష్కరణ



నవీన్ పోలిశెట్టి హీరోగా వస్తున్న సినిమా 'అనగనగా ఒక రాజు'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో మారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మీనాక్షి చౌదరి కథానాయిక. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి మొదటి గీతం 'భీమవరం బల్మా' తాజాగా విడుదలైంది. 'భీమవరం బల్మా' గీతావిష్కరణ వేడుక భీమవరంలోని ఎస్.ఆర్.కె.ఆర్. ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా జరిగింది. యువత కోలాహలం నడుమ ఎంతో వైభవంగా జరిగిన ఈ వేడుకలో చిత్ర బృందం సందడి చేసింది. ముఖ్యంగా సంక్రాంతి పండుగను కాస్త ముందుగానే తీసుకొచ్చినట్టుగా ఎద్దుల బండిపై నవీన్ పోలిశెట్టి వేదిక వద్దకు రావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే మీనాక్షితో కలిసి 'భీమవరం బల్మా' పాటకు వేదికపై నవీన్ స్టెప్పులేసి అందరిలో ఉత్సాహం నింపారు.'భీమవరం బల్మా' పాటతో నవీన్ పోలిశెట్టి మొదటి సారి గాయకుడిగా మారడం విశేషం. గాయకుడిగా తొలి ప్రయత్నంలోనే ఆకట్టుకున్నారు. వినోదాన్ని పంచడంలోనే కాదు, పాటను ఆలపించడంలోనూ దిట్ట అనిపించుకున్నారు. కథానాయిక మీనాక్షి చౌదరితో కలిసి ఈ పాటలో ఆయన చేసిన నృత్య ప్రదర్శన కట్టిపడేసింది.. జనవరి 14న థియేటర్లలో అందరం హాయిగా నవ్వుకుందాం.



## 'పిఠాపురంలో' ముగ్గురు తండ్రుల కథ

తొలి చిత్రం 'ప్రేయసి రావే' తోనే దర్శకునిగా తన సత్తా చాటుకున్నారు మహేష్ చంద్ర. ఆ తర్వాత అయోధ్య రామయ్య, చెప్పాలని వుంది, జోరుగా హుషారుగా, ఒక్కడే, హనుమంతు, ఆలస్యం అమృతం, రెడ్ అలర్ట్ చిత్రాలతో మంచి పేరు తెచ్చుకున్నారాయన. తాజాగా మహేష్ చంద్ర రూపొందించిన చిత్రం 'పిఠాపురంలో'. దీనికి ఉప శీర్షిక 'అలా మొదలైంది'. 'నటకిరీటి' డా. రాజేంద్రప్రసాద్, పృధ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, జయవాహిని, అన్నపూర్ణమ్మ తదితరులు ముఖ్య తారాగణంగా ఈ చిత్రం రూపొందింది. మహేష్ చంద్ర సినిమా టీమ్ బ్యాన్ప దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్ఎం మురళి (గోదారి కిట్టయ్య) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా దర్శకుడు మహేష్చంద్ర మాట్లాడుతూ కుటుంబ భావోద్వేగాలు కలగలిసిన ప్రేమకథ ఇది. ఇందులో మూడు జంటల ప్రేమకథలు చూడొచ్చు. ముగ్గురు తండ్రుల పెంపకాల్లోని లోటుపాట్లనీ చూడొచ్చు. ప్రేక్షకులు ఏదో ఒకరకంగా ఈ కథతో కనెక్ట్ అవుతారు. ఈమధ్య కాలంలో 'పిఠాపురం' అనేది ఎంతలా మారుమోగిందో అందరికీ తెలిసిందే. ఆ పిఠాపురం నేపథ్యంలోనే సినిమా అంతా సాగుతుంది. పిఠాపురం పరిసర ప్రాంతాల్లో 80పెర్సెంట్ చిత్రీకరణ జరిపాం. ఇందులో మొత్తం మూడు పాటలు ఉంటాయి. పాటలు చాలా బాగా వచ్చాయి. గోవాలో కొన్ని సీన్స్, ఒక పాటను, హైదరాబాద్లో సెట్వేసి ఇంకో పాటను, సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్లో మరో పాటను చిత్రీకరించాం. దర్శకునిగా నాకు జీవితాన్ని ప్రసాదించిన 'మూవీమొఘల్' డి.రామానాయుడు స్ఫూర్తితో కథను నమ్మి, ఎక్కడా వేస్టేజ్ లేకుండా ఈ సినిమా తీశాం. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం' అని తెలిపారు.

## 'వానర' టీజర్ రిలీజ్



అవినాశ్ తిరువీధుల హీరోగా, దర్శకుడిగా పరిచయమవుతున్న సినిమా 'వానర'. ఈ చిత్రంలో సిమ్రాన్ చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. నందు ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. 'వానర' చిత్రాన్ని శంతను పత్తి సమర్పణలో సిల్వర్ స్క్రీన్ సినిమాస్ బ్యానర్‌పై అవినాశ్ బుయానీ, ఆలపాటి రాజా, సి.అంకిత్ రెడ్డి నిర్మిస్తున్నారు. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్ అందిస్తున్న 'వానర' సినిమా మైథలాజికల్ రూరల్ డ్రామా కథతో ప్రేక్షకుల్ని ఆకట్టుకునేందుకు రాబోతోంది. వివేక్ సాగర్ మ్యూజిక్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ కాబోతోంది. 'వానర' సినిమా టీజర్ ను రాకింగ్ స్టార్ మంచు మనోజ్ చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలోరాకింగ్ స్టార్ మంచు మనోజ్ మాట్లాడుతూ 'వానర' సినిమా టీజర్ లాంచ్ కు గెస్ట్గా రావడం హ్యాపీగా ఉంది. అవినాశ్ గురించి నాకు తెలుసు. చాలా కష్టపడే తత్వం ఉన్నవాడు. ఫస్ట్ సినిమాకే హీరోగా నటించడంతో పాటు డైరెక్షన్ కూడా చేశాడు. అది అంత సులువు కాదు. ఈ రోజు చిన్న సినిమా పెద్ద సినిమా లేదు. కంటెంట్ బాగుంటే ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. బాగున్న ప్రతి సినిమా భాషలకు అతీతంగా ఇండియన్ సినిమా అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో క్రియేటివ్ డైరెక్టర్ జానకీ రామ్, నటుడు హర్ష, ఎడిటర్ ఛోటా కె ప్రసాద్ స్టోరీ, స్క్రీన్ ప్లే రైటర్ విశ్వజిత్, నటుడు శివాజీ రాజా, చిత్ర సమర్పకులు శంతను పత్తి, డైలాగ్ రైటర్ సాయి మాధవ్ బుర్రా, డీవోపీ సుజాత సిద్ధార్థ్, హీరో, డైరెక్టర్ అవినాశ్ తిరువీధుల ఉన్నారు.

## 'లైఫ్ ఈజ్ ఎ గేమ్..' సాంగ్ రిలీజ్




ఈషా రెబ్బా, సత్య, హర్ష చెముడు, ప్రిన్స్ సిసిల్, హేమ, సత్యం రాజేశ్, కుషిత కల్లపు ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'త్రీ రోజెస్'. ఆహా ఓటీటీలో సూపర్ హిట్టయిన ఈ సిరీస్ సీజన్ 2 డిసెంబర్ 12వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కు రెడీ అవుతోంది. రాశీ సింగ్ మరో కీ రోల్ చేసింది. ఈ సిరీస్‌ను మాస్ మూవీ మేకర్స్ బ్యానర్ పై ఎస్ కేఎన్ నిర్మిస్తున్నారు. డైరెక్టర్ మారుతి షో రన్నర్ గా వ్యవహరిస్తున్నారు. రవి నంబూరి, సందీప్ బొల్ల రచన చేయగా..కిరణ్ కె కరవల్ల దర్శకత్వం వహించారు. ఈ వెబ్ సిరీస్ నుంచి లైఫ్ ఈజ్ ఎ గేమ్ లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు.లైఫ్ ఈజ్ ఎ గేమ్ పాటకు భాస్కరభట్ల రవికుమార్ ఇన్స్ పైరింగ్ లిరిక్స్ రాయగా, లిప్సిక అందంగా పాడారు. అజయ్ అరసాడ ఛాట్ బస్టర్ ట్యూన్ చేశారు. 'త్రీ రోజెస్ సీజన్ 2' సిరీస్‌లో ఫీమేల్ లీడ్ రోల్స్ చేసిన ఈషా రెబ్బా, రాశీ సింగ్, కుషిత కల్లపు వెకేషన్‌లో ఎంజాయ్ చేస్తున్న సందర్భంగా ఈ సాంగ్‌ను రూపొందించారు.

## 'లవ్ డేస్' టైటిల్ గ్లింప్స్ విడుదల



నవీన్, కుసుమ చందక జంటగా ఆన్ క్యాన్ ఎంటర్టైన్మెంట్స్, క్రిసెంట్ సినిమాస్ బ్యానర్ల మీద మాదల వెంకటకృష్ణ ప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'లవ్ డేస్'. ఏ టాక్సిక్ లవ్ స్టోరీ అనేది ఉప శీర్షిక. ఈ మూవీని సురేష్ లంకలపల్లి తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన టైటిల్, గ్లింప్స్ను రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమానికి దర్శకుడు సముద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు సముద్ర మాట్లాడుతూ .. 'గీతాంజలి', 'తొలి ప్రేమ', 'అందాల రాక్షసి' లాంటి అద్భుతమైన ప్రేమ కథల్లా ఈ 'లవ్ డేస్' నిలిచిపోతుంది. 'లవ్ డేస్' పెద్ద విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను. టీం అందరికీ ఈ మూవీ జీవితంలో ఎన్నో మెమోరీస్ను అందించాలని కోరుకుంటున్నాను. మనస్ఫూర్తిగా ఈ మూవీ బిగ్ సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.దర్శకుడు సురేష్ లంకలపల్లి మాట్లాడుతూ .. 'నిర్మాత వెంకట్ వల్లే ఈ కథ, ఈ సినిమా ఇక్కడి వరకు వచ్చింది. సర్ నన్ను హీరోగా ఎందుకు చేయాలని అనుకున్నారో నాకైతే తెలియడం లేదు. డిసెంబర్ నుంచి మా నిర్మాత కొత్త ప్రాజెక్ట్ ప్రారంభించబోతోన్నారు. ఆర్య సాయి కృష్ణ 'రాచరికం' నుంచి నాతో జర్నీ చేస్తున్నారు. ఎడిటర్ ప్రదీప్ ఎప్పుడూ కష్టపడుతూనే పని చేశాడు. వెంగి మ్యూజిక్ ఎప్పుడూ అద్భుతంగానే ఉంటుంది. రాం ప్రసాద్ డైలాగ్స్ అందరినీ ఆకట్టుకుంటాయి. నవీన్ కటౌట్ బాగుంటుంది. కుసుమకి సినిమా పట్ల ఎంతో ప్యాషన్ ఉంది. ఆదిత్యకి తెలుగు అంతగా రాకపోయినా కష్టపడి డైలాగ్స్ చెప్పాడు. ఈ మూవీలో ప్రతీ ఒక్కరి పాత్ర బాగుంటుంది అని చెప్పారు.

## ధనుష్ శ్రీకాంత్‌కు ఘన స్వాగతం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇటీవల టోక్యోలో జరిగిన డెఫలింపిక్స్ 2025లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో రెండు బంగారు పతకాలు సాధించిన ధనుష్ శ్రీకాంత్ హైదరాబాద్ నగరానికి చేరుకున్న సందర్భంగా, రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మరియు చైర్మన్ శివసేనారెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ చంద్రారెడ్డి స్టేడియం అడ్మినిస్ట్రేటర్లు వెంకటేశ్వరరావు నందకిషోర్ గోకుల్ పి ఆర్ ఓ కాలేరు సురేష్ తదితరులు ఉన్నారు.

## డిజిటల్ పైరసీ నివారణకు జపాన్‌తో ఫిలిం ఛాంబర్ ఒప్పందం



**హైదరాబాద్ :** హైదరాబాద్‌ను సినిమా హబ్‌గా మార్చే క్రమంలో తెలుగు ఫిలిం ఛాంబర్ అఫ్ కామర్స్ కంటెంట్ ఓవర్సీస్ డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ టోక్యో, జపాన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు జపాన్ ప్రతినిధులతో, తెలుగు ఫిలిం ఛాంబర్ ప్రతినిధులతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పలు అంశాలపై చర్చించారు. డిజిటల్ పైరసీని ఎదుర్కొనడానికి జపాన్ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకున్న తెలుగు ఫిలిం ఛాంబర్ ప్రతినిధులను భట్టి ప్రశంసించారు. డిజిటల్ పైరసీ నివారణకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి ఈ సందర్భంగా చెప్పారు. ముందుగా వారు ప్రజా భవన్‌లో ఉప ముఖ్యమంత్రికు కోడా సంస్థ జపాన్ ప్రతినిధులు తమ, ప్రపంచ వ్యాప్తంగా జపనీస్ కంటెంట్కు పెరుగుతున్న ప్రజాదరణ గురించి వివరించారు. జపాన్లో తెలుగు చిత్రాలకు పెరుగుతున్న ఆదరణ గురించి కూడా తెలిపారు. ఇటీవలి కాలంలో డిజిటల్ పైరసీ ఒక అంతర్జాతీయ క్రైమ్‌గా ఉద్భవించింది. చట్టవిరుద్ధమైన బెట్టింగ్, ఐడెంటిటీ థెఫ్ట్, ఆన్లైన్ మోసం, మాల్వేర్ వ్యాప్తి మరియు చాలా వైవిధ్యమైన స్వభావం గల సైబర్ నేరాలు డిజిటల్ పైరసీతో ముడిపడి ఉన్నాయి. ఈ పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమలు, సంస్థలు మరియు ప్రభుత్వాలు ద్వైపాక్షిక, బహుళపాక్షిక ఒప్పందాలు మరియు సహకారాన్ని కలిగి ఉండవలసిన అవసరం ఉందని భట్టి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత దగ్గుబాటి సురేష్ బాబు, ఫిలిం ఛాంబర్ కార్యదర్శి దామోదర్ ప్రసాద్, నిర్మాత సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

# 42శాతం రిజర్వేషన్ల సాధనకు ప్రభుత్వాన్ని వెంటాడుతాం

### అప్పటివరకూ ఉద్యమాన్ని ఆపే ప్రసేక్తే లేదు

### అమరవీరుల స్థూపం వద్ద నిరసనలో ఎంపి ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేసేంతవరకు రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటడుతామని, వేటాడుతామని, అంతవరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని తెలంగాణ బిసి జెఎసి చైర్మన్ ఎంపి ఆర్.కృష్ణయ్య తెలిపారు. పంచాయతీల్లో బిసిల రిజర్వేషన్లను తగ్గించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర బిసి విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పగిళ్ల సతీశ్, బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్ ఆధ్వర్యంలో శుక్రవారం గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద వందలాది మంది విద్యార్థులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య, బిసి సంఘాల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిసి రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధత కల్పించే విషయంపై త్వరలో ప్రధానిని కలిసి చర్చిస్తామన్నారు. పంచాయతీ ఎన్నికలపై హైకోర్టు స్టే ఇవ్వకపోడం విచారకరమన్నారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీనిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీహర్ ఎన్నికలు ముగియగానే చడీచప్పుడు కాకుండా రిజర్వేషన్లను 22శాతానికి తగ్గిస్తూ మరో జిఒ 46ను జారీ చేసి, అమలులో 17 శాతానికే కుదించారని తెలిపారు. జిఒ 46తో పది జిల్లాల్లో, 27 మండలాల్లో ఒక్క సర్పంచ్ స్థానం కూడా బిసిలకు దక్కలేదన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి శాస్త్రీయత లేకుండా అధికారులు బిసి రిజర్వేషన్లను ఖరారు చేశారని ఆరోపించారు. గతంలో ఉన్న బిసి రిజర్వేషన్లను సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గండికొడుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బిసి సంఘం నేతలు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, డాక్టర్. ఆర్.అరుణ్ కుమార్, కొండా దేవన్న, భూమన్న గౌడ్, గుజ్జ సత్యం, సి.రాజేందర్, జి.అనంతయ్య, మోదీ రాందేవ్, బాణాల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## సరిదిద్దాలి

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడది 21.39 శాతానికి తగ్గిందన్నారు. అనగా మొత్తంలో 1.39 శాతం తగ్గిందని, బిసిల సంఖ్య జనాభాలో 56.33 శాతమని ఇటీవల జరిగిన ఇంటింటి సర్వేలో తేలిన తర్వాత రిజర్వేషన్ల శాతం గతంలో కంటే తగ్గడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రిజర్వేషన్లను నిర్ధారించే ప్రక్రియలో జరిగిన పొరపాటు వల్లనే బిసి రిజర్వేషన్లు గతంలో కంటే తక్కువ అయ్యాయని, దీనిని సరిదిద్ది ఎన్నికలు జరపాలని లేకుంటే బిసిలకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిసి కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, అసిస్టెంట్ సెక్రటరి కె.మనోహర్ రావు, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, సెక్షన్ ఆఫీసర్ సతీష్ కుమార్‌తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## స్టే ఇవ్వలేం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వానికి మరోసారి నివేదిక ఇచ్చిందని దాని ఆధారంగానే రిజర్వేషన్లు కేటాయిస్తూ జిఒ విడుదల చేశారన్నారు. కానీ నివేదికలో ఏముందో బయటపెట్టడం లేదని వాదించారు. బిసిలలో కులాల జనాభా ఎంత అనే విషయం బయటికి రాలేదని ప్రభుత్వం దేన్ని ఆధారంగా చేసుకొని జిఒ విడుదల చేసిందనే విషయం తెలియాల్సి ఉందన్నారు. బిసిలలో వర్గాల ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించకపోవడం వల్ల అత్యంత వెనుకబడిన కులాలు రాజకీయంగా నష్టపోతున్నాయన్నారు. ఎన్నికలపై స్టే విధించాలని సుదర్శన్ కోరారు. ఈ దశంలో జోక్యం చేసుకున్న సిజె ధర్మాసనం పంచాయతీ రాజ్ చట్టంలోని 285 'ఎ'ను సవరించిన తర్వాత 2019లో పంచాయతీ ఎన్నికలు జరిగాయి కదా అని పిటిషనర్ న్యాయవాదిని ప్రశ్నించింది. అప్పుడు లేని బిసి రిజర్వేషన్ల సమస్య ఇప్పుడు ఎందుకు తలెత్తిందని ప్రశ్నించింది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు పిటిషన్ వేయకుండా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత రిజర్వేషన్లను సవాల్ చేస్తూ కోర్టును ఎందుకు ఆశ్రయించారంది. ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ ప్రారంమభమైనందును జోక్యం చేసుకోలేమని హైకోర్టు పేర్కొంది.

**బిసి రిజర్వేషన్లకు ఆరు వారాల గడువు :** బిసి రిజర్వేషన్ల అంశానికి సంబంధించి 6 వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు రిప్లై కౌంటర్ దాఖలు చేయడానికి పిటిషనర్‌కు 2 వారాల గడువు ఇచ్చిం ది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. ఎంపిటిసి, జెడ్‌పిటిసితో పాటు పురపాలక సంఘాల ఎన్నికలు కూడా జరగనున్నాయని, ఆ ఎన్నికల్లోపు ఈ అంశం తేల్చే విధంగా వీలైనంత త్వరగా విచారణను చేపట్టాలని పిటిషనర్ న్యాయవాది కోరారు. బిసి డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. తదుపరి విచారణలో ఈ అంశాన్ని పరిశీలిద్దామన్న హైకోర్టు విచారణను 8 వారాలకు వాయిదా వేసింది.

## ప్రకృతి విలయం

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం సెలువు ప్రకటించడంతో, సహాయక చర్యలు ముమ్మరంగా సాగడానికి అవకాశం ఏర్పడింది. ట్రింకోమలీ జిల్లాలోని దిత్వాలో శుక్రవారం కూడా భారీగా వర్షాలు కురిశాయి. ప్రాణ నష్టం జరిగినట్టు సమాచారం ఏదీ అందలేదు. ఇలావుంటే, ఇండోనేషియాకు ముందు ఊహించినట్టు సునామీ ముప్పు లేకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, వర్షాలు, మెరుపు వరదలతో నదులు ఉప్పొంగి ప్రవహించగా, శిథిలాల కింద నుంచి మృతదేహాలను వెలికితీశారు. ఉత్తర సుమత్రా, దాని చుట్టుపక్కల ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. రెండు వేలకుపైగా ఇళ్లు నీట మునిగాయి. ఐదు వేల మందికి ప్రభుత్వ పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్నారు.

**థాయిలాండ్‌లో 145 మంది మృతి**

థాయిలాండ్‌లో భారీ వర్షాలు, ఆకస్మిక వరదల పరిస్థితి కొంత సద్దుమణిగింది. శుక్రవారం నాటి అధికారిక ప్రకటనను అనుసరించి, ఇప్పటి వరకూ 145 మంది మృతి చెందారు. కనీసం 12 లక్షల ఇళ్లు పూర్తిగా లేదా పాక్షికంగా ధ్వంసమయ్యాయి. 36 లక్షల మందిని ఈ ప్రతికూల వాతావరణం ప్రభావితం చేసింది. మొత్తం ఎనిమిది ప్రావీన్సుల్లో వరద ప్రభావం ఎక్కువగా ఉంది.

## సిఇసి చేతికి రక్తపు మరకలు

(మొదటి పేజీ తరువాయి)

ఇంటెన్సివ్ సవరణ (సర్) మధ్య టిఎంసి రాజ్యసభ నాయకుడు డెరెక్ ఓ బ్రియన్ నేతృత్వంలోని 10 మంది సభ్యుల ప్రతినిధి బృందం ఎన్నికల సంఘం అధికారులను కలిసింది. ఈ ప్రతినిధి బృందంలో లోక్‌సభ ఎంపిలు మహువా మోయిత్రా, సతాబ్ది రాయ్, కళ్యాణ్ బెనర్జీ, ప్రతిమా మండల్, సజ్దా అహ్మద్, రాజ్యసభ ఎంపిలు డోలా సేన్, మమతా ఠాకూర్, సాకేత్ గోఖలే, ప్రకాష్ చిక్ బారిక్ ఉన్నారు. సమావేశం ఓ బ్రెయిన్ విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీ ఐదు ప్రశ్నలను లేవనెత్తిందని, అయితే ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ ఎటువంటి సమాధానాలు ఇవ్వలేదన్నారు. సిఇసి చేతులపై రక్తం మరకలు ఉన్నాయని చెప్పడం ద్వారా మేము సమావేశాన్ని ప్రారంభించామని, ఐదు ప్రశ్నలు లేవనెత్తామన్నారు. ఆ తరువాత కళ్యాణ్ బెనర్జీ, మహువా మొయిత్రా, మమతా బాల ఠాకూర్ దాదాపు 40 నిమిషాలు మాట్లాడారని ఓ'బ్రియన్ అన్నారు. ఆ తరువాత సిఇసి ఒక గంట పాటు నిరంతరాయంగా మాట్లాడారని చెప్పారు. అయితే తాము లేవనెత్తిన ఐదు ప్రశ్నలలో దేనికీ మాకు సమాధానం రాలేదన్నారు. సర్ ప్రక్రియతో ముడిపడి ఉన్న 40 మంది మరణాల జాబితాను ప్రతినిధి బృందం సిఇసితో పంచుకున్నట్లు మోయిత్రా చెప్పారు. అయితే, కమిషన్ దానిని కేవలం ఆరోపణలుగా తోసిపుచ్చిందని లోక్‌సభ ఎంపి పేర్కొన్నారు. అయితే టిఎంసి సర్ భావనను వ్యతిరేకించడం లేదని, కానీ సిఇసి, ఇసి పని చేస్తున్న ప్రణాళిక లేని విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుందని బ్రియన్ చెప్పారు. సర్ పూర్తిగా ప్రణాళిక లేనిది, హృదయం లేనిదని విమర్శించారు.

## భారత్‌కు పుతిన్

(మొదటి పేజీ తరువాయి)

ద్రౌపది ముర్ము కూడా పుతిన్‌ను ఆహ్వానించి ఆయన గౌరవార్థం విందును ఏర్పాటు చేయనున్నారు. 'రాబోయే పర్యటన భారతదేశంరష్యా నాయకత్వానికి ద్వైపాక్షిక సంబంధాలలో పురోగతిని సమీక్షించడానికి ప్రత్యేక, విశేష వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతీయ. ప్రపంచ అంశాలపై అభిప్రాయాలను మార్పిడి చేసుకోవడానికి అవకాశాన్ని అందిస్తుంది' అని ఎంఇఏ సంక్షిప్త ప్రకటన తెలిపింది. రక్షణ, భద్రత. వాణిజ్యం, పౌర అణుశక్తి రంగాలలో సహకారాన్ని మరింత పెంచుకోవడంపై మోదీపుతిన్ చర్చల దృష్టి కేంద్రీకరించబడుతుందని భావిస్తున్నారు. ఉక్రెయిన్ వివాదం కూడా ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆయుధాలు చాలా ప్రభావవంతంగా ఉన్నాయని నిరూపించబడినందున రష్యా నుండి ఎస్400 ఉపరితలం నుండి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే క్షిపణి వ్యవస్థల అదనపు బ్యాచ్‌లను సేకరించాలని భారతదేశం చూస్తోంది. ప్రతిపాదిత సేకరణ రెండు వైపుల మధ్య ఒప్పందంలో భాగం కావచ్చని తెలిసింది. 'భారత ప్రధానమంత్రి, రష్యా అధ్యక్షుడు నేతృత్వంలో భారతదేశం, రష్యా మధ్య ఒక యంత్రాంగం ఉంది. ప్రతి సంవత్సరం ఒక శిఖరాగ్ర సమావేశాన్ని నిర్వహించి సంబంధాల మొత్తం పరిధిని సమీక్షిస్తారు. ఇప్పటివరకూ 22 భారతదేశ శిఖరాగ్ర సమావేశాలు భారతదేశంరష్యాలో ప్రత్యామ్నాయంగా జరిగాయి. రాబోయే శిఖరాగ్ర సమావేశం ద్వైపాక్షిక వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి గణనీయమైన ఫలితాలను ఇస్తుంది' అని భావిస్తున్నట్లు సంబంధిత వ్యక్తులు తెలిపారు.రష్యా అధ్యక్షుడు చివరిసారిగా 2021లో న్యూఢిల్లీని సందర్శించారు. కాగా, గత సంవత్సరం జులైలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ వార్షిక శిఖరాగ్ర సమావేశం కోసం మాస్కోకు వెళ్లారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com